# ప్రజల మనిషి

enemy

ఇబ్సన్ ~~ఎనర్జీ~~ ఆఫ్ ది పీపుల్‌కు స్వేచ్ఛానుకరణ

ఉస్మానియా విశ్వవిద్యాలయ నాటక విభాగం కోసం ప్రప్రథమంగా రాయబడ్డది.

మొదలి నాగభూషణ శర్మ

26.6.1991

## పాత్రల వివరాలు

| | |
|---|---|
| కరుణాకరం | డాక్టరు |
| పరంధామయ్య | ఆయన మామగారు |
| రాజారావు | ఆయన అన్నగారు |
| అరుంధతి | ఆయన భార్య |
| విద్య | ఆయన కూతురు |
| చైతన్య | ఆయన కొడుకు |
| నాగార్జున | ఆయన కొడుకు |
| శివశంకరం | పత్రికాధిపతి |
| సత్యనాధం | పత్రికా సంపాదకుడు |
| సురేంద్ర | పత్రిక ఉపసంపాదకుడు |
| జానకి రామయ్య | పొరుగింటివాడు, స్వాతంత్ర్య సమరయోధుడు |
| నరసింహం | రాజకీయ నాయకుడు |

వీళ్ళు కాక
ఒక తాగుబోతు
ముగ్గురు/నలుగురు పౌరులు

## ఒకటో రంగం

(డాక్టర్ కరుణాకరం గారి ఇంటి లోపల భాగం. తెరతీసేసరికి పరంధామయ్య ఏదో నోటినిండా తింటూ లోపలినుంచి వాకిట్లోకి వస్తాడు. అతని వెనకనే సురేంద్ర వస్తాడు – చేతిలో తింటున్న ప్లేటుతో సహా. పరంధామయ్య చేతిని, మూతిని ధోవతి అంచులకు తుడుచుకుంటాడు)

**సురేం** : పరంధామయ్యగారూ! అవతల రైళ్ళు పరుగెత్తుకుపోతున్నట్టు, అంత తొందరగా తింటారేమిటండీ?

**పరం** : నీలాగా తింటూ కూర్చుంటే, ఇవ్వాళ రైళ్ళేం, రేపటి రైళ్ళు కూడా వెళ్ళిపోతాయి....నేను ఇంటికి వెళ్లిపోయానని మా అమ్మాయితో చెప్పు.

**సురేం** : (నోటినిండా తింటూ) అట్లాగే

(లోపలికి వెళ్లిపోతాడు)

(ఈలోగా పరంధామయ్య అక్కడ టేబుల్ మీద ఉన్న ఆపిల్‌పండ్లను ఒకదానిని వాసన చూసి, ఎవ్వరూ లేరని చూసి గభాలున తన కోటుజేబులో వేసుకుంటాడు. మరో పండుతీసి బాగా తుడిచి మరోజేబులో వేసుకుంటూ వుండగా – కూతురు అరుంధతి వస్తుంది)

**అరుం** : వెడుతున్నావా నాన్న?

పరం : అవునమ్మా! అవతల చాలా పనుంది. అసలెందుకు వచ్చానో తెలుసా? ఇవ్వాళ నువ్వు రసగుల్లాలు చేస్తున్నావని మనవరాలు చెప్పింది. ఆ మాట చెప్పిందో లేదో లేచి చక్కా వచ్చేశాననుకో!

అరుం : (నవ్వి) నువ్వు రాకపోతే మాత్రం నీకోసం పంపించేదాన్ని కాదా?....ఎట్లాగూ వచ్చావుగా! మీ అల్లుడు వచ్చేదాకా ఆగురాదూ?..నీ గదికి వెళ్ళినా అక్కడ ఎవ్వరూ ఉండరుగా? కాసేపట్లో సత్యనాథం గారూ వస్తారు...నీకు బోలెడంత కాలక్షేపం.

పరం : వెళ్ళాలమ్మా! వెళ్లాలి..బోలెడు పనులున్నాయి! పైగా నీ ఇంటికొచ్చే వాళ్ళందరూ చదువుకున్న వాళ్ళు, తెలివిగలవాళ్ళు..వాళ్లని మీ ఆయనేదో అంటాడే! మేధ....ఆ! మేధావులు! వాళ్ళను చూస్తే నాకు కించిత్తు భయం!

అరుం : ఇవిగో! రెండు ఆపిల్స్ తీసుకుపో –

పరం : వద్దమ్మా! వద్దు.....వద్దంటుంటే – (మొహ పడినట్లు పళ్ళు తీసుకుంటాడు)

(బయట తలుపు చప్పుడు)

అరుం : బహుశా సత్యనాథం గారయివుంటారు.

(తలుపు తీస్తుంది...వచ్చింది మున్సిపల్ ఛైర్మన్ రాజారావుగారు)

మీరా బావగారూ! రండి, రండి....

రాజా : ఈ ధోవనుంచే వెడుతున్నాను. ఒకసారి తొంగి చూద్దామనుకున్నాను. అంతే! (పరంధామయ్యను చూసి) ఓ! పరంధామయ్యగారా?

పరం : ఓ! మీరా! ఛైర్మన్గారూ.......(ఆపిల్ కొరుకుతూ నిష్క్రమిస్తాడు)

అరుం : ఆయన్ని పట్టించుకోకండి...పెద్దవాడయినాడా, మనుషులను గురించిన ధ్యాసే ఉండదు...ఆ! ఇవ్వాళ రసగుల్లాలు చేశాను. రెండు తెస్తాను.

పరం : వద్దమ్మా! వద్దు...ఈ వేళప్పుడు రసగుల్లాలా?...అమ్మో!

సురేం : (లోపలనించి వస్తూ) అరుంధతమ్మగారూ! మీ రసగుల్లాలు ఏం అమోఘంగా ఉన్నాయండీ....ఒకసారి కలకత్తాలో–

అరుం : (కొంచెం తత్తరపాటుతో) అతను ఇప్పుడే వచ్చాడు...ఈ వూళ్ళో సత్యనాథం గారి పత్రికలో సబ్–ఎడిటర్! – సురేంద్ర –

సురేం : (నమస్కారం పెడుతూ) అవును...ఇంతకు ముందే వచ్చాను...డాక్టరుగారు రసగుల్లాలు తిని వెళ్ళమంటేనూ –

రాజా : అట్లాగా!....బావుంది...

అరుం : రెండంటే రెండే తెస్తారు...కూర్చోండి –

రాజా : వద్దమ్మా! నా సంగతి తెలుసుగా! బ్రెడ్, టీ – ఇవి తప్ప సాయంకాలాలు ఇంకేం తీసుకోను. ఆరోగ్యానికి ఆరోగ్యం ....పొదుపుకు పొదుపూ....(సురేంద్రతో) ఏమంటారు?

సురేం : (ఏమి మాట్లాడాలో తోచక) అవునవును..అంతగా మరి!

అరుం : మీరు చెప్పేది చూస్తే నేనూ, మీ తమ్ముడు డబ్బును మంచినీళ్ళలా ఖర్చు పెడుతున్నామంటారా?

రాజా : అట్లాఅనకు..మన వూళ్ళో మంచినీళ్ళకు కూడా చాలా గిరాకీ.....ఏడీ వీడు? ఈవేళప్పుడు ఎక్కడికి వెళ్ళాడు?

అరుం : మగపిల్లలని తీసుకుని అట్లా నడిచి వస్తామన్నారు.

రాజా : ఈ వేళప్పుడు నడవడం కూడా ఆయన ఆరోగ్య సూత్రాల్లో ఒకటా?

(వాకిట్లో చప్పుడు)

అది కరుణాకరమేనేమో –

అరుం : అయివుండదు..అంత తొందరగా వస్తారా? (వాకిట్లోకి చూసి) రండి లోపలికి రండి సత్యనాథం గారూ!

సత్య : ఆలస్యం అయింది కదూ! ప్రెస్‌లో ఆలస్యం అయిపోయింది...ఏదో ఒక పని! (రాజారావును చూసి, ఆశ్చర్యపడి) నమస్కారం ఛైర్మన్‌గారూ!

రాజా : మీరు పత్రికలవాళ్ళు కదా! మా వాడితో ఏదో పనుండి వచ్చుంటారు...

సత్య : (సగం నవ్వుతో) అవునండీ! అలాంటిదే – మా పత్రికకు ఒక వ్యాసం కోసం–

రాజా : అందుకు సందేహమా? మీ పత్రికకి – దాని పేరేమిటన్నారూ?

**సత్య** : సత్యంవద –

**రాజా** : ఆ! అవును.....సత్యంవధ –

**సత్య** : కాదండీ! సత్యంవద – సత్యమునే పలకవలెను!

**రాజా** : అబ్బా!...దానకే మా వాడు చాలా వ్యాసాలు రాస్తాడనుకుంటాను...

**సత్య** : అవునండీ! ఆయన వ్యాసాలన్నీ ప్రచురించగలగడం మా అదృష్టం..ఏ కొత్త విషయాన్ని గురించినా నిజ నిజాలనయినా ప్రజలకు విప్పి చెప్పాలనుకున్నప్పుడల్లా ఆయన మా పత్రికకే వ్యాసాలు రాస్తారు..

**రాజా** : ఓ! కొత్త విషయాలను గురించిన నిజానిజాలు! అట్లాగా! (ప్రతిమాటనూ విడమరిచి అంటాడు)

**అరుం** : (కొంచెం ఇబ్బందిగా) సత్యనాథంగారూ! నేను ఇవ్వాళ చేసిన రసగుల్లాలు –

**రాజా** : తింటాడమ్మా, తింటాడు! అవి మీ ఆయన రాసే నిజమంత తియ్యగా ఉంటయ్యా?...సత్యనాథంగారూ! మావాడు మీ పత్రికలో వ్యాసాలు రాయకూడదు అనడం లేదు. ప్రతి ఉపన్యాసకుడు తాను చెప్పే ప్రతిమాటకీ చప్పట్లు కొట్టే ప్రేక్షకులు కావాలని కోరుకోవడంలో తప్పేముంది?..అట్లా అని మీ పత్రికమీద నాకు దురభిప్రాయం ఉన్నదనుకొనేరు!!

**సత్య** : అబ్బే! అట్లా ఎందుకనుకుంటాం ఛైర్మన్‌గారూ! మీ సంగతి నాకు తెలియదూ!

**రాజా** : నిజానికి ఈ ఊళ్ళో వాళ్ళ సహనశక్తిని చూస్తుంటే నాకు ఆశ్చర్యం వేస్తుంది! ఎంతటి విమర్శనైనా సహించగలిగినంత సహనశక్తిని పెంచుకున్నారు జనం...ఎందుకో తెలుసా? మన ఆలోచనల్లో ఎన్ని తేడాలు ఉన్నా, మనందరి ధ్యేయం ఒకటేకనుక. ఆర్థికంగా మనల్ని ఇంకా ఇంకా ఉన్నతికి తీసుకు వెళ్ళే ఆ ఒకే ఒక్క విషయం మీద మనందరి ధ్యాస కేంద్రీకృతం అయింది కనుక.

**సత్య** : మనవూరి నీటి బుగ్గలను గురించేనా మీరు అనేది?

**రాజా** : అవి నీటి బుగ్గలేమిటండీ? అమృత జలాలు! ఎక్కడెక్కడి వాళ్ళూ మన వూరు వచ్చి ఈ నీటిబుగ్గల్లో

స్నానాలు చేసి తమ దీర్ఘరోగాలనుంచి బయటపడాలనుకునే వాళ్ళే! ఈ నీటిబుగ్గలు మనవూరి స్వరూపాన్నే మార్చేశాయి...నేనివ్వాళ చెబుతున్నాను, జ్ఞాపకం ఉంచుకోండి....ఈ దేశ ఆరోగ్య పటంలో మనవూరు కూడా ప్రముఖంగా కనిపించడానికి ఇంకా ఎక్కువగోజులు పట్టదు.

అరుం : ఆ మాటే మీ తమ్ముడూ అంటూ వుంటారెప్పుడూ.

రాజా : దానితోపాటు ఊరి అవసరాలు పెరిగాయి. చిన్న చిన్న దుకాణదారులు పెద్ద వ్యాపారస్థులయినారు...ఇళ్ళ కిరాయిలు పెరిగాయి. స్థలాలకు గిరాకీ పెరిగింది. ఈ రాష్ట్రం మొత్తంలో ఇంతటి ఆరోగ్య కేంద్రం లేదనే పేరు వచ్చింది. ఎక్కడెక్కడి వాళ్ళు వేసంకాలం విడిది చేయడానికి ఇళ్ళకోసం గాలిస్తున్నారు.

సత్య : అప్పుడే ఈ వేసంకాలానికి మున్సిపాలిటీ కట్టించిన ఇళ్ళు కావాలని చాలామంది అప్లికేషన్లు పంపుతున్నారట!

రాజా : మెల్లగా అంటున్నారేం? రోజుకు అధమ పక్షం వంద అప్లికేషన్లు – !

సత్య : బావుంది..(అరుంధతితో) ..డాక్టరుగారి వ్యాసం ప్రచురించడానికి ఇదే తగిన సమయం.

రాజా : మా వాడు మళ్ళీ కొత్తగా ఏమన్నా రాశాడా యేమిటి?

సత్య : వెనక రాసిందేనండీ! మన నీటి బుగ్గల్ని గురించే! వేసంకాలం దాకా ప్రచురించడానికి అనువు కాదని నేనే ఆపివుంచాను.

రాజా : ఏం? అందులో అభ్యంతరకరమైన విషయాలు ఏమన్నా ఉన్నాయా?

సత్య : అబ్బే! అదేం కాదండీ! సరిగ్గా వేసంకాలం మొదలయ్యే సమయంలో మన నీటిబుగ్గల్ని గురించిన వ్యాసం వస్తే బయటి ప్రపంచానికి వాటిని గురించి ఇంకా ఎక్కువ తెలుస్తుంది కదా!

రాజా : అవును...మీకు చాలా ముందు చూపు ఉన్నదండీ!

సత్య : అబ్బే! నాదేముంది? అట్లా అనుకోవడం మీ మంచితనం!

అరుం : మీ తమ్ముడికి ఎప్పుడు ఈ నీటిబుగ్గల్ని గురించిన ఆలోచనే!

రాజా : వాటి అజమాయిషీకి జీతం తీసుకుంటూ ఉన్నప్పుడు వాటి ధ్యాసే లేకపోతే ఎలాగమ్మా?

సత్య : కేవలం ఉద్యోగిగా కాదండీ...ఇక్కడ నీటిబుగ్గల్ని కట్టించడానికి మూలకారణం ఆయనే కదండీ!

రాజా : మరీ అట్లా అనకండి...ఈ మధ్య ఈ మాటను చాలామంది అనడం వింటున్నాను..అందులో మా వంటివాళ్ళకి కూడా కొద్దో గొప్పో ప్రమేయం ఉన్నదనుకుంటాను!

అరుం : మీ తమ్ముడు కూడా!

సత్య : అబ్బే! నీటిబుగ్గల్లో రోగనివారణ లక్షణాలున్నాయని చెప్పింది డాక్టరు గారని – అట్లా అన్నారు.

రాజా : ఇటువంటి భావాలు అందరికీ వస్తాయి...కాని వాటి ఆచరణ? అది ఎందరికి సాధ్యం? చెప్పండి.

అరుం : (తత్తరపాటుతో) మా ఉద్దేశ్యం అది కాదు బావగారూ!...సత్యనాథం గారూ! మీ కోసం రసగుల్లాలు వంటయింట్లో టేబుల్ మీద ఉన్నాయి...మీరు తీసుకుంటూ వుండేలోగా డాక్టరుగారు వస్తారు...

సత్య : ఆకలిగా లేదండీ.....అయినా రసగుల్లాలు కదా!..జిహ్వ చాపల్యం –

(అంటూ లోపలికి వెడతాడు. వాకిట్లో నుంచి నవ్వులు వినిపిస్తాయి)

అరుం : అదుగో! మీ తమ్ముడు, పిల్లలు వచ్చినట్టున్నారు.

కరుణా : (వాకిట్లోనుంచే) అరుంధతీ! నాతో ఎవర్ని తీసుకువచ్చానో చూసుకో! మూడు రోజులాయె ఇల్లు వదిలిపెట్టి వెళ్లారు…"ఇవ్వాళ మీ అమ్మాయి రసగుల్లాలు, పాయసం చేసింది – ఏమయినా ఇంటికి రావలసిందేనని తీసుకువచ్చాను…ఆయన ఇంటికి ఆయన రావడానికి బతిమిలాడవలసి వచ్చిందనుకో!

(లోపలికి వచ్చారు, కరుణాకరం తరువాత పిల్లలూ)

కరుణా : పిల్లలూ! తాతగారికి పాయసం తీసుకురండి

చైతన్య: లోపలికి వెళ్ళి కాళ్లు చేతులు కడుక్కుని ఇప్పుడే వస్తామన్నారు నాన్నా?

అరుం : ఏమండీ! బావగారు –

కరుణా : అరె! అన్నయ్యా! ఎంతసేపయింది వచ్చి? కూర్చోలేదేం?

రాజా : నేను వెళ్ళబోతున్నాను. నువ్వు వచ్చావు.

కరుణా : అదేమిటన్నయ్యా! అప్పుడేనా? అరుంధతీ! అన్నయ్యకి రసగుల్లాలు –

అరుం : అడిగాను. వద్దన్నారు…వస్తున్నా (లోపలికి వెడుతుంది)

రాజా : నాకు వద్దమ్మా. తీసుకురాకు. ఎప్పుడు పడితే అప్పుడు ఏది పడితే అది తినే స్వభావం కాదు నాది…నా ఒంటికి పడదు కూడా….అయినా ఇవ్వాళ ఈ సంరంభం అంతా ఏమిటి?

కరుణా : ప్రత్యేకత అంటూ ఏమీలేదు. ఇవ్వాళ పొద్దున్నే విద్య నిద్రలేచి అమ్మా! మనం అంతా రసగుల్లాలు తింటున్నట్లు కలవచ్చిందే – అన్నది. కలకత్తాలో ఉన్నప్పుడు దానికి రసగుల్లాలంటే పిచ్చి ఇష్టంగా ఉండేది..అందుకని మీ మరదలు అన్ని పిండివంటలూ మొదలుపెట్టింది…పైకి రావలసిన పిల్లలు ముందుతరాన్ని నిర్మించవలసిన వాళ్లు అలా ఆనందంగా కడుపునిండా తినడం కన్న మనకు కావలసిందేమిటి?

రాజా : వాళ్ళు ముందు తరాల్ని నిర్మించడానికి కడుపునిండా తినడానికి సంబంధం ఏమిటో ఈ మట్టిబుర్రకు అంతు పట్టడంలేదు.

కరుణా : (నవ్వుతూ) తిండి గలిగితే కండగలదోయ్…కండగలవాడే మనిషోయ్ – అన్నాడు కవి…..అరుంధతీ! నాకేమన్నా ఉత్తరాలు వచ్చాయా?

అరుం : (లోపలనుంచే) ఏమీ రాలేదే!

కరుణా : పైగా ఈ సంపాదన అంతా ఎందుకన్నయ్యా? పిల్లలు మానసికంగా శారీరకంగా ఎదగడానికి, సంపూర్ణ మానవులు కావడానికి – అంతేనా?

రాజా : అది నాకెట్లా తెలుస్తుంది?

కరుణా : ఓ! నువ్వు బ్రహ్మచారివనా? అయినా యీ వూరి వాళ్ళంతా నిన్ను ఈ మునిసిపాలిటీకి ఛైర్మన్ చేశారు కదా! ఈ ఊళ్ళో ఉన్న ప్రతి పిల్లవాడు నీ పిల్లవాడే ననుకుంటే – వాళ్ళ భవిష్యత్తే ఈ ఊరి భవిష్యత్తు అనుకుంటే ఎన్ని పథకాలన్నా అమలు చెయ్యొచ్చు…సత్యనాథం వస్తే ఈ వూరి పిల్లలకి

నేను మొదలెట్ట బోతున్న ఓ కొత్త పధకాన్ని గురించి చెప్పేవాడు...వాళ్ళని మానవులుగా తీర్చిదిద్దే పథకం!

రాజా : ఆ సత్యనాధంగారు మీ వంటిట్లో రసగుల్లాలు ఆరగింపు మహోత్సవంలో ఉన్నాడు – ఆయనకు నువ్వేదో కొత్త వ్యాసం యిస్తానన్నావుటగా?

కరుణా : కొత్త వ్యాసమా?

రాజా : అదే! మన ఊళ్ళో నీటి బుగ్గల్ని గురించి –

కరుణా : అదా! ఇప్పుడు దానిని ప్రచురించడానికి వీలులేదు..

రాజా : అదేమిటి? దాన్ని ప్రచురించడానికి ఇదే అదను అన్నడే అతను!

కరుణా : మామూలు పరిస్థితిల్లో అది నిజమే! కాని ఇప్పుడు –

(ఆ విషయం మాట్లాడుతున్నప్పుడు తన ఆతృతని దాచుకోలేదు)

రాజా : (దగ్గరకు పోయి) ఏం? ఇప్పుడు మామూలు పరిస్థితులు కాక అంతటి అవాంతర పరిస్థితులేం వచ్చాయి?

కరుణా : ఇప్పుడప్పుడే ఏం చెప్పలేను...రేపటికి అవాంతర పరిస్థితులు ఏర్పడనూ వచ్చు...లేదా – పరిస్థితులు ఇప్పటిలానే మామూలుగానూ ఉండవచ్చు.

రాజా : ఏమిటా అర్థం లేని మాటలు? ఇప్పటికి రేపటికి ఏం జరుగబోతున్నది? ఎక్కడన&ఆన తభావతు వచ్చిందా?...(కరుణాకరం మాట్లాడడు) నా నుంచి నువ్వేదో దాచిపెడుతున్నట్లు వుంది...ఈ ఊరి నీటి బుగ్గల్ని నిర్వహించే ఆరోగ్య సంస్థకి నేను అధ్యక్షుణ్ణని మరిచిపోతున్నావు!

కరుణా : ఆ విషయాన్ని గురించి ఇప్పుడెందుకు చర్చించడం?

రాజా : ఎందుకా? నీటిబుగ్గల విషయంలో కాని, ఆరోగ్య సంస్థ విషయంలోగాని నా వెనకాల నువ్వేదయినా అడ్డదిడ్డమైన పని చేస్తే నేను సహించను. ప్రతీది సవ్యంగా, ఆధికారికంగా జరగాలి. చట్ట ప్రకారం ఏర్పడ్డ సంస్థలు, దాని అధిపతులు మాత్రమే ఆ పనులు చెయ్యాలి అంతేగాని –

కరుణా : నీ వెనకాల అటువంటి పనులెప్పుడన్నా చేశానా?

రాజా : అధికారానికి ఎదురు తిరగడం నీ స్వభావం....అది ఇక్కడ చెల్లదు. ప్రతివాడూ ఇక్కడ అధికారానికి లొంగినడుచుకోవలసిందే!

కరుణా : ఇదంతా నాకెందుకు చెబుతున్నావు?

రాజా : ఎందుకు చెబుతున్నానో తెలుసుకోలేనంత పసివాడివి కాదు. నిన్ను నమ్మి ఆరోగ్య సంస్థలో నిన్ను డాక్టర్‌గా పెట్టుకున్నాం. దానిని అప్రదిష్టపాలు చేసే ఏ పనిని నువ్వు చేసినా –

కరుణా : ఆరోగ్య సంస్థ అంటే నీకెంత ఇష్టమో, నాకూ అంతే! అవసరం అయితే దాని గౌరవ ప్రతిష్టల కోసం నా ప్రాణాలిస్తాను....

రాజా : నేను చెప్పవలసింది చెప్పాను. ఆ తరువాత నీ యిష్టం. అరుంధతీ....వెళ్ళొస్తాను. (వెళ్ళిపోతాడు)

అరుం : (వస్తూ) బావగారేరీ? వెళ్ళిపోతున్నారా?

కరుణా : ఆ! నిప్పులు తొక్కుకుంటూ!

అరుం : మళ్ళీ ఏమయింది? ఆయనకి కోపం ఎందుకొచ్చింది?

కరుణా : ఆయనకి కోపం రావడానికి కారణాలెందుకు?...ఆయనకు ఆయన అధికారానికి ఎవ్వరూ అడ్డు చెప్పకూడదు...ఆయన అనుజ్ఞ లేనిది ఈవూళ్ళో ఎవ్వరూ గాలి కూడా పీల్చ కూడదని మున్సిపల్ ఛైర్మన్ రాజారావుగారి ఆదేశం!

అరుం : దేన్ని గురించి చెప్పాలిట ఆయనకి?

కరుణా : ఆ సంగతి వదిలెయ్...ఇవ్వాళకూడా పోస్టురాకపోవడం ఆశ్చర్యంగా ఉందే!

(లోపలనుంచి సురేంద్ర, సత్యనాథం వస్తారు)

సురేం : అరుంధతమ్మగారూ! మీ పిండి వంటలన్నీ అద్భుతంగా ఉన్నాయండీ! బ్రహ్మచారులం అందరం మీకు ఎంత రుణపడి ఉన్నామో!

సత్య : ఇవ్వాళ ఛైర్మన్‌గారు ఎందుకో రుసరుసలాడుతున్నట్టున్నారు!

కరుణా : ఆయన ఆరోగ్యం అంత మంచిది కాదు..అజీర్తి వ్యాధి.........పైగా ఇన్ని తీసి వస్తువులు చూసేసరికి తట్టుకోలేకపోయాడు!

(జానకి రామయ్యగారు వస్తారు. పెద్దవాడు...జాతీయ వాది...అందరూ లేస్తారు)

కరుణా : రండి బాబుగారూ! మీ అమ్మాయి ఇందాకటి నుంచి మీ కోసం కాచుకుని ఉంది...

జానకి : ఏమిటయ్యా ఈ మర్యాదలు? ఇది నా యిల్లు.......నా ఇంట్లో నాకే మర్యాద లెందుకు?

కరుణా : అది నిజమేనండీ! ఉంటున్నది పక్క పక్క ఇళ్లలోనయినా మీరు మా ఇంట్లో మనిషే!...మాకు పెద్ద దిక్కు మీరే!

అరుం : మూడు రోజుల పాటు ఇంటికి రాలేదు....ఒక్క క్షణం తోలచలేదనుకోండి....(లోపలనుంచి పాయసం తెచ్చి యిస్తాడు చైతన్య. దానిని ఆయనకు ఇస్తూ)
ఆరోగ్యం ఎలావుంది?

జానకి : ఆరోగ్యానికేమమ్మా! దానిని గురించి మనం పట్టించుకోనంత కాలం అది కులాసాగానే వుంటుంది.

అరుం : మీరు ఇహ ఈ తిరగడం తగ్గించు కోవాలి బాబుగారూ!

జానకి : కొందరి కాళ్ళలో చక్రాలతో పుడతారమ్మా! తిరగక పోతే తోచదు నాకు...వెళ్ళిన ప్రతి ఊళ్ళోనూ అరుంధతమ్మలు ఉన్నంతకాలం నాకు భయమేమిటమ్మా?

కరుణా : అయితే మళ్ళీ ప్రయాణమా?

జానకి : అవునోయ్! వరంగల్లులో గ్రంధాలయ సభలు. మా రోజుల్లో గ్రంధాలయాలంటే వైజ్ఞానిక విశ్వవిద్యాలయాలు...ఊరి జనానికి అదే కేంద్రం. వార్తలు తెలిసేది అక్కడే! వ్యూహాలు పన్నేది అక్కడే! స్వాతంత్రం వచ్చాక అవి చీట్లపేకల నిలయాలయినాయి.

సత్య : మీరు చెప్పింది అక్షరాలా నిజమండీ!

జానకి : కాని ఇప్పుడే గ్రంధాలయాల అవసరం మరీ వుంది.....ఇంతవరకు చదువుకోని నిరక్షరాస్యులకి గ్రంధాలయ విద్యాలయం కావాలి. చదువుకున్న ప్రతివాడూ కనీసం మరొక్క చదువు రానివాడికైనా చదువు చెప్పాలి. అందుకోసం స్వచ్ఛంద కార్యకర్తల్ని సేకరిస్తున్నాను. కరుణాకరం! మీ యింటిల్లిపాదీ

వాలంటీర్లే!

**కరుణా** : (నవ్వుతూ) తప్పకుండా. మీరు చెప్పినా చెప్పకపోయినా మీ మనవరాలు అప్పుడే వీర కార్యకర్త అయింది. పగలంతా స్కూల్లో ఉద్యోగం. సాయంకాలం మహిళా మండలిలో వయోజన విద్య.

**జానకి** : అదేనయ్యా నా ఆశ! విద్యలాంటి వాళ్లు ఊరూరా పదిమంది ఉంటే ఇంకా నిరక్షరాస్యత ఎక్కడుంటుంది? స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నాళ్ళకు కూడా అజ్ఞానం, మూర్ఖత్వం మన మీద ఎలా స్వారీ చేస్తున్నాయో చూడ్డంలా!

**సత్య** : నిజానికి దీనికి ప్రభుత్వం పూనుకోవాలండీ!

**కరుణా** : వాళ్ళకి జనం అజ్ఞానంతో ఉంటే లాభించినంతగా, చదువొస్తే లాభించదు...అందుకని వాళ్ళేం చెయ్యరు.

(అందరూ అవునంటారు....నవ్వులు...విద్య వస్తుంది...చేతులో పుస్తకాల దొంతర)

**విద్య** : (వస్తూ) ఏమిటీ అందరూ ఏదో ఆనంద కోలాహలంలో ఉన్నట్టున్నారు? నేనేమో అవతల అడవ చాకిరీ చెయ్యడమూ, మీరంతా విశ్రాంతిగా నవ్వుకోవడమూనా?.....ఇదేం బాగాలేదు.

**కరుణా** : నువ్వు కూడా హాయగా, విశ్రాంతిగా నవ్వుకో – రా!

**విద్య** : (తాతగారి పక్కన కూర్చుంటూ) తాతగారూ! మీరు ఇన్నాళ్ళు కనిపించకుండా ఉంటే నాకేదో దిగులుగా వుంటుందండీ!

**జానకి** : పిచ్చిదానా! ఇటువంటి దిగుళ్లు పెట్టుకుంటే అత్తవారింటికి ఎలా వెడతావు?

**విద్య** : మిమ్మల్ని తీసుకుపోతాను...(లేచి, సంచీలో నుంచి ఉత్తరం తీసి) నేనిందాక స్కూలుకి వెడుతుంటే పోస్ట్‌మాన్ కనిపించి ఈ ఉత్తరం ఇచ్చాడు నాన్నా! మళ్ళీ ఇంటికి వచ్చే టైం లేక అటు స్కూలుకు తీసుకువెళ్ళాను.

**కరుణా** : పొద్దుననగా వచ్చిన ఉత్తరాన్ని ఇప్పుడుదాకా ఇవ్వడం పడలేదన్న మాట!

**అరుం** : దీని కోసమేనా మీరు రెండు రోజులు నుంచీ అడుగుతున్నది?

**కరుణా** : (అవునని తలవూపి) ఇప్పుడే వస్తాను. (అని లోపలికి వెడతాడు)

**విద్య** : ఏమిటమ్మా! ఎవరి దగ్గర నుంచి?

**అరుం** : ఏమోనమ్మా! రెండు రోజులనుంచీ ఉత్తరం వచ్చిందా అని అడుగుతున్నారు.

**సురేం** : బహుశా పక్క ఊళ్లో ఎవరో పాత పేషంటు అయివుంటాడు.

**విద్య** : అవును. నాన్నకి ఈ మధ్య పనిమరీ ఎక్కువయింది.

**సత్య** : అన్నట్లు, మీరు మాకిస్తానన్న ఇంగ్లీషు నవల అనువాదం ఎంతవరకయింది?

**విద్య** : ఏదీ, పొద్దునా సాయంకాంల ఈ పనులతో సరిపోతున్నది..ఇంకా మొదలు పెట్టలేదు.

**సత్య** : అవును. రాత్రిపూట కూడా పనిచేస్తున్నారటగా!

**విద్య** : అవును...చిన్నపిల్లలకి చదువు చెప్పడంలో ఓ ఆనందం ఉంది...ఈ పెద్దవాళ్ళకు చదువు చెబుతున్నప్పుడు సంతృప్తి ఉందండీ!

**జానకి** : పిచ్చితల్లీ! మరొకరితో పంచుకున్న దేనమ్మా ఆనందం అంటే!

అరుం : ఈయన రారేం?

కరుణా : (వస్తూ) ఈ ఊరి కంతటికి ఒక గొప్ప వార్త!

సురేం : వార్తా!

సత్య : అంతగొప్పదా? అయితే మా పేపరు బాగుపడ్డట్టే!

కరుణా : ఒక విపత్కరమైన పరిశోధనా ఫలితం!

విద్య : మీరు చేసిందేనా?

కరుణా : అవును..ఇప్పుడు అనమనండి ఈ వూరి పెద్దల్ని నేను పిచ్చివాణ్ణని...ఒక్కొక్క పెద్ద మనిషి ఎట్లా తలలు వంచుకుంటారో ఇప్పుడు చూడాలి.

అరుం : ఏమిటండీ అది?

కరుణా : ఇప్పుడు అన్నయ్య ఉండవలసింది ఇక్కడ...

జానకి : ఆవేశపడకు కరుణాకరం....అసలు సంగతి ఏమిటి?

కరుణా : ఈ వూళ్ళో వున్న నీటి బుగ్గల్లో చాలా జబ్బుల్ని నయంచేసే ఔషధజలం ప్రవహిస్తోందని మనకందరికీ తెలుసుకదా!

సత్య : అందుకు సందేహం ఏమిటి?

సురేం : వాటిని గురించి మీరు రాసిన వ్యాసాలు....దేశవిదేశాల్లో కూడా మనకు ఖ్యాతి గడించి పెట్టాయి గదండీ!

కరుణా : కాని, మనం ఇన్ని లక్షలు ఖర్చు పెట్టి కట్టుకున్న ఈ నీటిబుగ్గలు ఇప్పుడు విషపూరితాలు...

అరు,విద్య : మన బావులా?

సురేం : నమ్మడానికి వీలు లేకుండా వీలు లేకుండా ఉన్నదే!

జానకి : వివరంగా చెప్పు కరుణాకరం!

కరుణా : ఈ బావుల్లోకి వస్తున్న నీళ్ళన్నీ విషక్రిముల మయం బాబుగారూ! ఈ నీళ్ళ ఎగువ భాగంలో ఉన్న ఫ్యాక్టరీల కాలుష్యం అంతా ఈ నీళ్ళల్లో కలిసింది......

సత్య : ఇంతకాలం లేనిది, ఇప్పుడు అకస్మాత్తుగా ఈ నీరు కలిషితం కావడమేమిటి?

కరుణా : మన బుగ్గల్లోకి కొండమీదనుంచి నీటిని తెచ్చే గొట్టాలను నేలబారుగా వెయ్యడమే దీనికి కారణం. ఫ్యాక్టరీలనుంచి వచ్చిన కాలుష్యం మన గొట్టాలలోకి మెల్లమెల్లగా దిగుతోందన్నమాట! దీనికి తోడు ఎగువ భాగాన ఫ్యాక్టరీల కాలుష్యాన్ని మళ్ళీస్తే తప్ప గొట్టాలను ఇంతకిందగా వెయ్యకూడదని ఎంత మొత్తుకున్నా పెడచెవిని పెట్టారు. ఇప్పుడు చూడండి!

అరుం : నిద్రాహారాలు మాని క్రిందటి వారం అంతా మీరు చేసింది ఇదన్నమాట!

కరుణా : అవును. నాకీ అనుమానం కిందటేడే వచ్చింది. ఇక్కడకు వచ్చిన చాలామంది రోగులకు రోగం నయం కావడం పోయి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. ఇక మన వూరివాళ్ళకు సరేసరి...ఇది నా అనుమానాన్ని బలపరిచింది. ఈ నీళ్ళ పరిస్థితిని గురించి చాలాకాలంగా పరిశోధన చేస్తున్నాను నేను. వీలైతే వీటిని శుభ్రపడచడానికి మార్గాలు వెతకాలని. ఇప్పుడు ఆ నీటిని హైదరాబాద్‌లో జాతీయ పరిశోధనా సంస్థకి పంపాను...వాళ్ళు నా అనుమానాన్ని దృఢ పరిచారు.

సత్య : ఇప్పుడు వచ్చిన ఉత్తరం అదేనా?

కరుణా : అవును...మన బుగ్గల్లో నీళ్ళు ఎంత విషక్రిమి పూరితాలో పూర్తి వివరాలతో సహా పంపించారు.

సత్య : మరి ఇంత కాలం దీన్ని ఇంత రహస్యంగా ఎందుకుంచారు?

కరుణా : నా అనుమానం ధృడపడొద్దు! ఊరికే నా అనుమానాన్ని నిజం అనుకుని చేప్పేస్తే ఎన్ని ఇబ్బందులు! ఇది విన్న రోగుల్లో కలిగే ఆందోళన.....ఒకవేళ ఇవి అబద్ధమైతే నా మీద వచ్చే అపప్రధ! అప్రతిష్ట!

సురేం : మరిప్పుడేమిటి చెయ్యడం?

కరుణా : చేసేదేముంది. ముందు ఈ విషయం మన వూరి ప్రజలకు చెప్పి నీళ్లను కాచుకుని తాగమని చెప్పాలి...బయట రోగుల్ని రానివ్వకూడదు...ఆ విషయాన్ని ఒక రిపోర్టు రాసిపెట్లాను కిందటి వారమే! విద్యా! ఆ టేబుల్ మీద కాగితాలుంటాయి తీసుకురా అమ్మా!

(విద్య తీసుకువస్తుంది)

అరుంధతీ! చైతన్యను వెంటనే వెళ్ళి ఈ కాగాతాలను అన్నయ్యకు ఇచ్చిరమ్మని చెప్పు –

(అరుంధతి కదలదు)

అరుంధతీ వెళ్ళు!

విద్య : దీనికి పెదనాన్న ఏమంటారో?

కరుణా : ఆయన ఏమంటారో నన్న దానిమీద ప్రజల ఆరోగ్యం, జీవితాలు ఆధారపడి వుండవమ్మా!..చైతన్యను వెంటనే వెళ్ళిరమ్మను –

జానకి : కరుణాకరం! అమ్మాయి అనుమానంలో అర్థం ఉందయ్యా! ఇది నీకు వైజ్ఞానిక సత్యం! వాళ్ళకి? రాజకీయ ప్రతిబంధకం! వాళ్ళు దీన్ని మానవతా దృష్టితో కాక, రాజకీయంగా తీసుకుంటే చాలా ప్రమాదం వాళ్ళు బలవంతులు.

కరుణా : (కొంచెం ఆగి) బాబుగారూ! బ్రిటీష్ వాళ్ళు మనకన్న బలవంతులేగా?

జానకి : అవును..అయితే?

కరుణా : మరి వాళ్ళని ఎదిరించడానికి మనకు ఆయుధం ఏమిటి? సత్యం! అదే నా ఆయుధం కూడా!

జానకి : నాకర్థమయింది...కాని పెద్దవాణ్ణి చెబుతున్నాను...నేవ్వు కొండలతో ఢీకొంటున్నావు! ఎంత దెబ్బ తగిలినా ఓర్చుకోవాలి సుమా!

(జానకిరామయ్య మెల్లగా వెడుతూ వుండగా)

తెర

## రెండో రంగం

(కరుణాకరం గారి ఇంటిలోపల....మర్నాడు)

అరుం : ఏమండీ! ఎక్కడ? (చేతిలో ఉత్తరంతో వస్తుంది)

కరుణా : (వస్తూ) ఏమిటి?

అరుం : మీ అన్నయ్య ఈ ఉత్తరం పంపించారు....ఇప్పుడే –

(కరుణాకరం ఉత్తరం చదువుకుంటాడు)

ఏమంటారాయన?

కరుణా : సాయంకాలం ఆయనే కలుస్తాడుట నన్ను.

అరుం : అప్పటికి ఇంట్లో ఉండడం మరిచిపోకండి.

కరుణా : (అట్లాగే అన్నట్టు తల ఊపుతాడు)

అరుం : ఆయన దీనికీ పెడర్థాలు తియ్యరుగదా?

కరుణా : అబ్బే!...వీలైతే ఈ పరిశోధన అంతా తానే చేయమన్నట్టు తన వల్లనే యిది బయటపడ్డట్టు చెప్పుకుంటాడు...మరొకరు ఎవరైనా ఈ వూరికి సేవ చేయడం భరించలేదు అన్నయ్య.....ఆయన చేసినా, నేను చేసినా ఊరికి మంచి జరగడం, అదీ ముఖ్యం.

(పరంధామయ్య లోపలికి తొంగి చూస్తాడు.)

పరం : (అక్కడ నుంచే నవ్వుతూ) నే విన్నదంతా నిజమేనా?

అరుం : నాన్నా! లోపలికిరా –

కరుణా : రండి, రండి.

పరం : ఇదంతా! నిజమేనంటారా?

కరుణా : ఏది?

పరం : అదే మన బావుల్లో విషం ఉందన్నది –

అరుం : నీకెట్టా తెలుసు?

పరం : విద్య స్కూలుకు వెడుతూ వెడుతూ ఒక్క పరుగున వచ్చి ఈ మాట కాస్త చెప్పి మాయమైంది...ముసలాడిని ఆట పట్టిస్తోందేమో అనుకున్నాను.

కరుణా : ఇందులో ఆట పట్టించడానికేముంది?

పరం : చిన్న పిల్లలకి ముసలాళ్ళను ఏడిపించడం సరదా కదమ్మా?

కరుణా : వేసంకాలానికి ముందే ఈ విషయం తెలియడం మనందరి అదృష్టం!

పరం : (నవ్వును ఆపుకుంటూ) అవునవును...మన అదృష్టమే!

కరుణా : ఇంకా నయం! రోగులు రావడం మొదలుపెట్టలేదు.

పరం : అవునవును...కాని అల్లుడు! మీ అన్నయ్యని ఇట్లా తలకిందులుగా చిత్తు చేసే తెలివితేటలు నీకున్నాయని నాకింత వరకు తెలియదు.

కరుణా : అన్నయ్యని చిత్తు చేయడం ఏముంది దీన్లో?

అరుం : నాన్నా! ఇది పరిశోదన –

పరం : నాకు తెలియక అడుగుతాను....ఈ నీళ్ళలో ఏమున్నాయంటావ్? బొద్దింకలు –

కరుణా : బొద్దింకలా? కాదు..కాదు.......

అరుం : విషక్రిములు నాన్నా!

పరం : విషక్రిములా? చాలా వున్నాయా?

కరుణా : ఆ! లక్షలు, కోట్లు –

పరం : అబ్బా! వీటిని మనం చూడొచ్చా –

కరుణా : అవి మన కళ్ళకు కనిపించవు..మైక్రోస్కోప్‌లో – అవును! మీరెందుకు నవ్వుతున్నారు?

అరుం : నీకు అర్థం కాదులే నాన్నా! వీటిని బాక్టీరియా అంటారు.

పరం : నాకు అర్థం కాకపోతే పోయింది కాని, నా జీవితంలో ఇంతటి సంతోషకరమైన వార్త వినలేదంటే నమ్ము.

అరుం : అదేమిటి?

కరుణా : ఇది సంతోషించే విషయమా?

పరం : సరే! (సీరియస్ అయిపోయి) ఈ విషయం మీ అన్నయ్య నమ్ముతాడనే నీ ఉద్దేశ్యమా?

కరుణా : ఏం? ఎందు నమ్మదు?

పరం : మీ అన్నయ్య అంత పిచ్చివాడేం కాదు....ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం.....మాలాంటి వాళ్ళనీ మునిసిపాలిటీ నుంచి ఏరేసిన మనిషాయన!...ఇప్పుడీ బొద్దంకిల విషయంలో ఏం చేస్తాడో చూద్దాం!

(సత్యనాథం వస్తాడు)

సత్య : (వస్తూ) డాక్టర్‌గారూ!

పరం : ఓ! పేపరాయన కదూ! (కరుణాకరంతో) నువ్వు పోతున్న పోకడకి, ఈయన ఈ యింటి రాకడకీ కనెక్షనేమిటి. (నాభిప్రాయంగా) అదేనా?

కరుణ : (నవ్వుతూ) అదే!

సత్య : నాకేం అర్థం కాలేదు.

పరం : నీకర్థం కాదులే పేపరాయనా! డాక్టరుగారు కనుక్కున్న కొత్తవిషం నీ పేపర్తో పడాలి...జాగ్రత్తగా అచ్చువెయ్...పెద్ద అక్షరాలతో రావాలి। (నవ్వుతూ వెళ్ళడానికి లేస్తాడు)

కరుణా : మీరు కొంచెం సేపాగండి...మీకు అసలు విషయం ఏమిటో చెప్పాలి.

పరం : ఇంకా చెప్పేదేమిటియ్యా? ఇదంతా ఊరికే చేస్తావా? నాకాపాటి తెలియదూ? అంత వెర్రాణ్ణానుకున్నావా ఏం?

అరుం : అయ్యో నాన్నా? ఆ విషకీటకాల సంగతి –

పరం : నాకు తెలుసునమ్మా! విషకీటకం – ఛైర్మన్‌గారూ – ఛైర్మన్‌గారూ......విషకీటకం.....(అనుకుంటూ పెద్దగా నవ్వుకుంటూ వెళ్ళిపోతాడు)

సత్య : ఏమంటారాయన?

కరుణా : (నవ్వుతూ) ఇదంతా మా అన్నయ్యని ఏడిపించడానికి నేను పన్నిన పన్నాగం అనుకుంటున్నాడాయన.... మా అన్నయ్యను నేనెందుకు ఏడ్పించాలో నాకర్థం కావడం లేదు –

సత్య : మీతో రెండు నిమిషాలు మాట్లాడాలి.

(కరుణాకరం భార్యవంక చూస్తాడు. ఆమె లోపలికి వెడుతుంది)

**కరుణా :** చెప్పు –

**సత్య :** మీ అన్నయ్యగారి దగ్గరనుంచి కబురేమైనా తెలిసిందా?

**కరుణా :** ఆ! ఇవ్వాళ సాయంకాలం తానే వచ్చి కలుస్తానన్నాడు.

**సత్య :** నేను ఈ విషయాన్ని గురించే రాత్రంతా ఆలోచిస్తున్నాను డాక్టరు గారూ! ఒక పరిశోధకుడిగా, సైంటిస్టుగా ఇది మీకు మహత్తరమైన విజయం....కాని దీనితో చాలా విషయాలు ముడిపడి ఉన్నాయన్న సంగతి మీరు గమనించినట్లు లేదు.

**కరుణా :** అంటే.....కూర్చో –

**సత్య :** (కూర్చుంటూ) ఈ కాలుష్యం అంతా ఎక్కడనుంచి వస్తున్నదని మీ ఉద్దేశ్యం?

**కరుణా :** ఎగువన ఉన్న ఫ్యాక్టరీల నుంచి.

**సత్య :** కాదు డాక్టర్‌గారూ! మరో విషాల ఊబిలోనుంచి వస్తున్నది.

**కరుణా :** అదేమిటి!

సత్య : ఈ ఊరికి విషమంతా అధికార వర్గం నుంచి, వాళ్ళు చేస్తున్న పనుల నుంచి వస్తున్నదండీ..స్వార్థం కోసం వూరిని నరక ప్రాయం చేస్తున్నారు...

కరుణా : సత్యనాథం! తొందరపడి నిర్ణయాలకు రాకు......వాళ్ళకు ఇదీ తప్పు అని మనం చెబితే తమ తప్పు తెలుసుకొని వ్యవహారాన్ని చక్కబరచవచ్చుగా?

సత్య : అసంభవం! చూడండి డాక్టరుగారూ! ఛైర్మన్‌గారు మీ అన్నయ్యగారు. ఆయన మొహంచూసి మీరు నిజాన్ని కప్పిపుచ్చరని నా నమ్మకం.

కరుణా : ఆయన మా అన్నయ్య అయితే నిజం నిద్రపోతుందా?

సత్య : అమ్మయ్య! (ఊపిరి పీల్చుకుని) ఇప్పుడు చూడండి. ధన బలంతో, అధికార మదంతో, సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభువుల్ని – ఈ ప్రజావిరోధుల్ని నా సత్యంవదలో కడిగి పారేస్తాను.

కరుణా : ఇందతా ఎందుకు సత్యనాథం?....ఇది కేవలం నీటికి సంబంధిచిన విషయం....ఈ విషయాన్ని ఈ ఊరి ఆరోగ్య సంస్థకు రాద్దాం. వాళ్ళు దీని మీద ఏ యాక్షను తీసుకుంటారో చూద్దాం...

(బయట 'డాక్టరు గారూ' అని పిలుపు.)

(విసుగ్గా) ఎవరది? లోపలికి రండి..........

(శివ శంకరం – పత్రికాధిపతి వస్తాడు)

**శివ :** డాక్టరుగారూ! నేను శివశంకరాన్ని!

**సత్య :** మా పత్రికాధిపతి..తెలుసుగా?..ప్రజా నాయకులు....గుడిసెల సంఘానికి, చిన్న దుకాణాదారుల సంఘానికి, ఒక కార్మిక వర్గానికి నాయకులు–

**కరుణా :** నమస్కారం...కూర్చోండి.

**శివ :** కూర్చోడానికి టైం లేదండీ! మా సురేంద్ర వచ్చి మీరు కనుక్కున్న అమూల్యమైన పరిశోధనా వివరాలు

చెప్పాడు....ఇంతకన్నా ఉత్తమమైన మంచినీటి పథకాన్ని మన వూళ్ళో ప్రవేశపెట్టాలని మీరు మునిసిపాలిటీని డిమాండ్ చేస్తున్నారని చెప్పాడు. ఈ పోరాటంలో –

కరుణా : ఇది పోరాటమూ కాదు, నేను చేస్తున్నది డిమాండూ కాదండీ!

శివ : అది ఏదయినా, ఈ విషయంలో ప్రజలంతా మీ వెంట ఉంటారని చెప్పడానికి వచ్చాను. ఇది ప్రజాకార్యం...వాళ్లు బాగుకోసం మీరు చేస్తున్న పని. దీనికి మద్దతు నివ్వడం మా విధి –

సత్య : చూశారా! మీకు అప్పుడే ఎంత మద్దతు లభిస్తున్నదో –

కరుణా : మీ సహాయానికి కృతజ్ఞతలు. కాని విషయం ఏమిటంటే –

శివ : అసలు విషయానికి తరువాత వద్దాం....డాక్టరు గారూ! మా సహాయం అంటే ఏమిటో మీకు చెప్పిపోదామని వచ్చాను...ఊళ్ళో పీడిత, తాడిత ప్రజానీకం అంతా మన పక్కనే ఉన్నారు..

కరుణా : చూడండి! మీరు మాట్లాడుతున్న దేమిటో నాకేం అర్థం కావడం లేదు. ఇది కేవలం నీటికి, నీటి బావులకి సంబంధించిన విషయం....దాన్ని విచారించాల్సింది పోయి –

శివ : అదే కదండీ మన పరమావధి! కాని మన డిమాండ్లని అధికారంలో ఉన్న వాళ్ళు వినాలంటే ఇదొక్కటే మార్గం! ఈ రంగంలో కాచి వడపోసిన వాణ్ణి......మీరు ఏదో పోరాటం – అవీ అంటే పోట్లాట అనుకుంటున్నారేమో – నేను శాంతివాదిని. మితవాదిని....అతి సర్వత్ర వర్జయేత్ – అన్నది నా మతం –

సత్య : (కొంచెం వెక్కిరింపుగా) అవునండీ!

శివ : వామపక్ష మితవాదిగా!

కరుణా : ఆ!

శివ : చిన్న తరహా వ్యాపారస్థుల సంఘం అధ్యక్షుడిగా –

కరుణా : ఆ!

శివ : మిత వాద పక్ష కార్మిక సంఘాల నాయకుడిగా –

కరుణా : ఆ!

శివ : మీకు చెప్పేదేమిటంటే..మనం ముందుగా ఒక ఊరేగింపు జరపాలి....సంఘటితంగా – శాంతియుతంగా

కరుణా : ఊరేగింపా? దేనికి?

శివ : (నవ్వి) ఊరేగింపు ఎందుకంటారేమిటి? మన ఐక్యతను నిరూపించుకోవడానికి..సరే! ఈలోగా మా సత్యనాథం మీ ఉద్యమాన్ని గురించి పత్రికలో రాస్తాడు..మీ ఫోటోతో సహా –......వివరాలు తొందరలో మాట్లాడదాం? సరా? ....నువ్వు కూడా ఆఫీసు వైపుకు వస్తున్నావటయ్యా?

సత్య : ఇదుగో! డాక్టరు గారితో మాట్లాడి –

శివ : సరే! అయితే – నేను వెళ్ళొస్తాను డాక్టరుగారూ! ప్రజలంతా మన వైపే ఉన్నారని జ్ఞాపకం ఉంచుకోండి. (వెళ్ళిపోతాడు)

సత్య : చూశారా! ఇదండీ తంతు!!

కరుణా : ఎవరిని గురించి?

సత్య : అదే! మా పత్రికాధిపతిగారి గురించి..... పేరుకు మాత్రం అభ్యుదయ వాది – ఉపన్యాసాలు మాత్రం మితవాదిత్వాన్ని గురించి –

కరుణా : అదేమిటి! ఆయన మీ పత్రికాధిపతి. నువ్వు సంపాదకుడివి..మరి మీ ఇద్దరి అభిప్రాయాలు –

సత్య : అవి కలిశేవి కాదులెండి...వీళ్ళంతా పైకి శ్రామికజనం అంటూ ఉపన్యాసాలు చెప్పి, ధనవంతుల, అధికారుల కొమ్ముకాసే జనం – గోడమీద పిల్లి బాపతు అనుకోండి...వీళ్ళేనండీ ప్రజా ఉద్యమాన్ని నీరుకార్చేది – ఇటువంటి వాళ్ళ ఆటకట్టాలంటే వీళ్ళు కొలిచే పాలక వర్గాన్ని కొట్టాలి. దానికి మొదటి మెట్టు మీ రిపోర్టు.....దాన్నివండి – ఇవ్వాళే పేపర్లో వేస్తాను.

కరుణా : ముందు అన్నయ్యతో మాట్టాడ నివ్వండి.

సత్య : ఒకవేళ మీ అన్నయ్య మీరు చెప్పిన మార్పులకు ఒప్పుకోకపోతే –

కరుణా : ఒప్పుకోక గత్యంతరం లేదని నా ఉద్దేశ్యం.....జనం అంతా రోగ పీడితులు కావడం ఆయనకి మాత్రం ఇష్టమా?.....

సత్య : సరే! మీ మాట కాదనడం ఎందుకు? ఆయన కాదంటే మాత్రం –

కరుణా : నా మాట నమ్ము. ఆయన తప్పకుండా ఒప్పుకుంటాడు. ఒప్పుకున్న మరుక్షణం నా రిపోర్టు మీ పత్రికలో వెయ్యండి......

సత్య : నిజంగానా?

కరుణా : మీకు అనుమానమైతే ఈ రిపోర్టు నీ దగ్గరే వుంచు...ఈలోగా చదివి నాకిచ్చేద్దువుగాని –

సత్య : సరే!.....మరి వెళ్ళొస్తాను.

కరుణా : హాయిగా వెళ్ళిరా...ఈ విషయాన్ని పరిష్కరించడం నువ్వనుకున్నంత కష్టం అని అనుకోను.
(సత్యనాధం వెళ్ళిపోతాడు)
అరుంధతీ!....అరుంధతీ!

అరుం : వస్తున్నానండీ –

కరుణా : పిల్లలు ఏరీ?

అరుం : అందరూ స్కూలుకు వెళ్ళిపోయారు.

కరుణా : బాబుగారూ – ?

అరుం : ఇప్పుడే పూజ అయినట్టుగా ఉంది –

కరుణా : నేనొకసారి వెళ్ళి బాబుగార్ని కలిసొస్తాను –

(జానకి రామయ్యగారు వచ్చారు)

బాబుగారూ! నేనే మీకోసం బయలుదేరాను.

జానకి : నేను పొరుగూరు వెడుతున్నాను..రేపటి దాకా రాను...ఆ మాట చెప్పిపోదామనే వచ్చాను...నువ్వు నలుగురికీ పనికివచ్చే విషయమని, ఆరోగ్యానికి సంబంధించినదని ఈ విషయం నెత్తిన వేసుకున్నావు. కాని స్వార్థం కోసం ప్రజాక్షేమాన్ని కూడా బలి పెట్టే సంఘంలో బతుకుతున్నాం నాయనా!...తొందరపడకు..ఆవేశాలకు పోకు...ఆలోచించి నిర్ణయాలు తీసుకో..నువ్వు నమ్మిన సూత్రాలను మాత్రం వదులుకోకు...జాగ్రత్తసుమా!... వస్తానమ్మా! (వెళ్ళిపోతాడు)

అరుం : (ఆయనను వాకిలి దాకా పంపించి వస్తూ) బాబుగారూ కూడా జాగ్రత్తగా ఉండడని చెప్పారంటే ఇందులో ఏదో ప్రమాదం ఉన్నట్లుగా ఉందండీ!

కరుణా : ప్రమాదం ఏముంటుంది? మనమేమన్నా వాళ్ళ రాజకీయాల జోలికి వెడుతున్నామా? మనకు కావలసింది ఆ నీటిని బాగుచేయించే పద్ధతి చూడడం, అంతదాకా ఆ నీళ్ళను శుద్ధి చేసి వాడుకోవడం

(వాకిట్లో 'కరుణాకరం గారూ' అని పిలుపు)

అరుం : బావగారు కాదుకదా! (గుమ్మందాకా పోయి)
ఉన్నారు...లోపలికి రండి – (ఆమె లోపలకు వెడుతుంది)

(నరసింహం లోపలకు వస్తాడు.....ప్రతిపక్షనాయకుడు...రాజకీయవాది)

నర : నమస్కారం డాక్టరుగారూ! నా పేరు నర్సిమ్మం.....నా పేరు ఇనే ఉంటారు...అప్పోజీషను లీడర్ని – మునిసిపాల్టీలో – అప్పోజిషన్ లీడర్ అంటే ఎవరు? కాబోయే ఛైర్మన్ గాదటండీ?

కరుణా : కూర్చోండి..ఏమిటి పని?

నర : నాకు చల్లకొచ్చి ముంత దాచడం చేతకాదండీ.....శివశంకరం విసయమంతా ఇవరంగా జెప్పాడు...ఛైర్మన్ మీ అన్నయ్య కూడా తెలుసునాకు..కాని ఈ సమ్మందాలు మన డూటీకి అడ్డం రాకూడదని చెప్పడానికి ఒచ్చానండీ – అన్నగారన్నగారే – డూటీ డూటీనే!

కరుణా : ఆ సంగతి నాకు తెలుసు....నేను నమ్మిన దాన్ని ధైర్యంగా చెప్పగల ఆత్మ స్థయిర్యం నాకుంది.

నర : అమ్మమ్మ! ఆ సంగతి తెలియబట్టే గదో మీ దగ్గరికి వచ్చింది..ఈ ఊళ్ళో బావుల్లో విషం ఉందని దీన్ని కట్టించు నోళ్లు మీరు పబిలీక్ మీటింగ్‌లో చెప్పండి..అమ్మమ్మ!..మీటింగ్ ఇసయం మా కొదిలీసెయ్యిండి...మీరు మా పక్కన ఉండండి....మిమ్మల్ని అందలం ఎక్కిస్తాను.

కరుణా : ఇటువంటి వన్నీ నాకు గిట్టదండీ!

నరం : ఓస్సోసి! పల్లకీలో ఊరేగిత్తానంటే కాదనే పెళ్ళికొడుకు ఎదవ ఎవరంటా? మీరు మా పక్షాన ఉంటే రేపు కౌన్సిలర్ కావొచ్చు – ఇంకా నాల్నాళ్ళుంటే ఈ ఊరి ఆరోగ్య సంస్థకి పెసిడెంటే కావచ్చు –

కరుణా : (ఏదో చెప్పబోతాడు) చూడండి –

నర : మీరాలోసించుకోండి....అవకాశాలు రమ్మన్నప్పుడల్లా రావు......నేనసలే నిర్మొహమాటం మనిషిని?

కరుణా : ఇది శాస్త్రమండీ! రాజకీయం కాదు....

నర : (పెద్దగా నవ్వి) ఓరి నీ యిల్లు బంగారం కాను!..రాజకీయాల్లో అన్నీ ఉంటాయియ్యా! సదువుకోన్నోళ్ళతో ఇదే గొడవ! అచ్చరమ్ముక్కరాని వాడు ముఖ్యమంత్రి అయి అన్ని విసయాలమీద ఏకబిగీని మాట్టాడ్డంలా?...ఆ అధికార పచ్చాన్ని కొట్టాలని రెండేళ్ళుగా చూస్తండా.....ఈ దెబ్బతో ఆళ్ళని చిత్తు చెయ్యడం తప్పదు...పెజలంతా రోగాలతో బాధపడితే పతిపక్షం ఊరుకుంటదిటండీ?...మళ్ళీ రేపొస్తాను...ఊరి క్షేమం – అది గాపకం ఉంచుకోండి...వస్తా.........(వెళ్ళిపోతాడు)

అరుం : (వస్తూ) ఎవరండీ ఈయన?

కరుణా : ఎవరా? మున్సిపాలిటీ మనిషి!.....ప్రతిపక్ష నాయకుడట! వాళ్ళ పక్షంలో చేరి బావుల్లో విషం ఉందని ప్రచారం చేస్తే తాను ఛైర్మన్ అయిన తరువాత ఆరోగ్య సంస్థకు అధ్యక్షుణ్ణి చేస్తాడట!

అరుం : ఎంత నీచం! మీరేమన్నారు?

కరుణా : నన్నేమన్నా అననిస్తేనా? ఈ ఎర చూపించి వెళ్ళిపోయాడు....ప్రతి విషయాన్ని రాజకీయాల రొంపిలోకి లాగకుండా ఉండరు కదా వీళ్ళు! అవతల జనం చావు బతుకుల్లో ఉంటే వీళ్ళు రాజకీయ చదరంగం ఆడుకుంటున్నారు. ఛీ! ఏం మనుషులు?

(విద్య రొప్పుకుంటూ పరిగెత్తుకు వస్తుంది)

విద్య : నాన్నా! నేనొచ్చేశాను.

అరుం : అదేమిటే! అప్పుడే స్కూలు అయిపోయిందా?

విద్య : లేదమ్మా! మధ్యాహ్నం సెలవు పెట్టే వచ్చేశాను...నాన్నా! పెదనాన్న వచ్చెళ్ళాడా?

కరుణా : ఇంకా రాలేదమ్మా!

విద్య : ఎందుకనబ్బా!.....ఏమయిందోనని తొందరగా వచ్చేశాను.

కరుణా : పిచ్చిదానా! ఏమవుతుంది?

(కరుణాకరం అని పిలుపు)

అదుగో! మీ పెదనాన్న వచ్చాడు..

(రాజారావు వచ్చాడు)

రాజా : అరె! ఇంట్లోనే వున్నావే!

కరుణా : నీ కోసమే!

రాజా : నువ్వు పంపిన రిపోర్టు చదివాను –

కరుణా : నీ అభిప్రాయం ఏమిటి?

(రాజారావు గొంతు సవరించుకుని ఆడవాళ్ళిద్దరి వంక చూస్తాడు...విద్యను తీసుకుని అరుంధతీ లోపలకి వెడుతుంది)

రాజా : కరుణాకరం! నా వెనకాలే ఈ పరిశోధన అంతా సాగించడం అవసరం అంటావా?

కరుణా : అదేమీ లేదు.....మీకు చెప్పబోయే ముందు నేను నిశ్చయంగా తెలుసుకోవాలి గదా! అందుకనే ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు. చివరికి అరుంధతికి కూడా –

రాజా : ఇప్పుడు నిశ్చయం అయిందా?

కరుణా : నా రిపోర్టు జతపరిచిన కాగితాలు చూడలేదా? జాతీయర పరిశోధనా సంస్థ కూడా నా అభిప్రాయన్ని బలపరిచింది.

రాజా : అయితే ఈ రిపోర్టును – ఆరోగ్య పథకం డాక్టరుగా – సంస్థ యాజమాన్యానికి పంపుతానంటావ్

కరుణా : మరి దానిని గురించి నిర్ణయం తీసుకోవలసింది వాళ్ళేగదా? ఏ నిర్ణయమైనా తొందరలో తీసుకోవాలి. ఆలస్యం చేస్తే జీవితాలతో ఆటలాడుకోవడమే!

రాజా : నువ్వు ప్రతి విషయానికీ కొంపలంటుకు పోతున్నయ్యంటూ తొందర పడతావు...ఆ! నీ రిపోర్టులో – మనం మన పౌరులకు, రోగనివారణ కోసం వచ్చే వందల మందికి – విషపుజలం యిస్తున్నామని రాశావు.

కరుణా : అవును....

రాజా : అందువల్ల మొత్తం ఆరోగ్య పథకాన్నంతా కూలంకషంగా మార్చాలన్నావు..,...

కరుణా :ఈ రిపోర్టు చూసిన ఎవరి నిర్ణమైనా అదే అవుతుంది! ఈ పరిస్థితుల్లో ఇందుకు భిన్నమైన నిర్ణయం ఉంటుందా? నాకైతే తెలియదు.

రాజా : ఇక్కడకు వస్తూ వస్తూ, మన ఇంజనీరుగారి దగ్గరకి వెళ్ళొచ్చాను. అక్కడ ఆయనతో మట్లాడుతూ – మాట వరసకి అన్నట్టుగా – ముందు ముందు ఈ ఏర్పాటునంతా మార్చాలి. ఎంతవుతుందని అడిగాను.

కరుణా : ఏమన్నాడాయన?

రాజా : నువ్వు అది కూడా తెలుసుకోకుండా నీ రిపోర్టు ఇచ్చావు....అవునా?

కరుణా : దాన్ని గురించి నేను ఆలోచించలేదు.

రాజా : నీకా అవసరం ఏముంది? ఇంజనీరుగారు నా మొహానే నవ్వి ఆ విషయం ఇప్పట్లో ఆలోచించకండి... అధమ పక్షం ముప్ఫయ్ లక్షలవుతోంది – అన్నాడు.

కరుణా : అంత ఖర్చవుతుందా?

రాజా : అంతేకాదు. పూర్తికావడానికి రెండేళ్ళకి పైగా పడుతుంది.

కరుణా : రెండేళ్ళా?

రాజా : అధమ పక్షం..ఈలోగా ఈ నీటి బావుల్ని ఏంచేస్తావు? నిజానికి మూసెయ్యాలి...ఈ నీళ్ళలో విషక్రిములున్నాయని తెలిసిన మరుక్షణం బయటనించి ఆరోగ్యం కోసం యీ వూరికి ఒక్క పురుగు కూడా రాదు...అదీ సంగతి! మొత్తానికి ఈ వూరిని నాశనం చేసే పథకం ఆలోచించావు!

కరుణా : నేను ఆలోచించి కావాలని చేశానంటారా ఇదంతా?

రాజా : ఆలోచించకుండా చేశానంటావు..ఈ నీటిబావుల మీద ఈ వూరి ఆర్ధికస్థితి అంతా ఆధారపడి వుంది. దాదాపు అన్ని కుటుంబాల వాళ్ళు వాటిమీద ఆధారపడే బతుకుతున్నారు. ఇప్పుడు వాటిని మూసేస్తే ఏం జరుగుతుంది?

కరుణా : మూసెయ్యక చెయ్యగలిగిందేముంది?

రాజా : కరుణాకరం! నీ రిపోర్టు చదివాక ఇక్కడి పరిస్థితులు నువ్వు చెప్పినంత ప్రమాదకరంగా లేవనిపిస్తున్నది నాకు.

కరుణా : నో! నిజానికి నా రిపోర్టులో చెప్పిన దానికన్నా భయంకరంగా ఉన్నయ్. వస్తున్నది వేసంకాలం... దానికి ఈ విషక్రిములు తోడయితే, ఇక్క – వద్దు, వద్దు –

రాజా : నువ్వు విషయాలను అనవసరంగా పెద్దవి చేస్తున్నావు! నీవంటి తెలివిగల డాక్టరు, శాస్త్రజ్ఞుడు దానికి విరుగుడు వాడలేడా?

కరుణా : అంటే?

రాజా : ఆ నీళ్లని, ఆ పథకాన్ని ఆలానే వుంచాలి....తప్పుదు.....నువ్వు కొంచెం నేర్పుగా వ్యవహరిస్తే ఆరోగ్య సంస్థ నువ్వు చెప్పే కొద్దిపాటి మార్పుల్ని అమలు పరుస్తుంది ......ఎక్కువ డబ్బు ఖర్చు కాకుండా ఉంటే –

కరుణా :అంటే నా రిపోర్టు వెనకుక తీసుకోవాలి....జనాన్ని చావనివ్వాలి –

రాజా : నేనప్పుడే చెప్పాను........ఇప్పుడంత ప్రమాదకర పరిస్థితులు లేవని – అది నా నమ్మకమని –

కరుణా : కాని అది శాస్త్రానికి, పరిశోధనకి నిలవదు. అవి నా పక్షాన ఉన్నాయి. అధికారంలో ఉన్న మీరు నా పథకాన్ని తారుమారు చేసి, గొట్టాలను నేలబారుగా వేసి విషక్రిములున్న నీళ్ళు గొట్టాల్లోకి వచ్చేటట్టు చేశారు.. నిజానికి ఈ ఘోరానికి కారణమైన వాళ్ళను నేరస్థులుగా విచారించాలి.....

రాజా : (కోపం వచ్చింది. కాని తట్టుకుని) సరే! నువ్వు చెప్పిందే నిజమనుకుందాం కాసేపు. అదంతా గతం.......ఇప్పుడు నువ్వు దాన్ని తవ్వితే నా గౌరవమర్యాదలకు, అధికారానికి ఇబ్బంది......

కరుణా : అయితే ఏం చేస్తామంటారు?

రాజా : నీ రిపోర్టును బోర్డుదాకా పోకుండా చెయ్యడం నా విధి. ఆ తరువాత ఈ విషయాన్ని నేనే ఏదో విధంగా నేనే తీసుకువస్తాను. ఈలోగా ఈ విషయం మరొకరికి తెలియడానికి వీలులేదు.

కరుణా : అది జరిగే పని కాదు.

రాజా : జరిగేటట్టు నేను చేస్తాను.

కరుణా : అసంభవం. ఇప్పటికే ఈ విషయం చాలామందికి తెలిసిపోయింది.

రాజా : కొంపతీసి, ఆ సత్యవధగాళ్ళకు తెలియలేదు కదా!

కరుణా : స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్న పత్రికలు నిజాన్ని గౌరవిస్తాయి!

రాజా : ఓహ్! నువ్వు ఇంత బాధ్యతారహితంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావో నాకు తెలియడం లేదు.....నీ కాళ్ళకింది గోతులు నువ్వే తవ్వుకుంటున్నావు.....

కరుణా : అదేమిటి?

రాజా : నీకూ, నీ కుటుంబానికీ కూడా –

కరుణా : ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది?

రాజా : ఈ కుటుంబ పెద్దగా చెబుతున్నాను....నువ్వు, నీ కుటుంబం హాయిగా జీవించడం నాకు అవసరం...ఫలానా ఆయన తమ్ముడు తిండికి లేకుండా బతుకుతున్నాడని ఎవరైనా అంటే ఆ చిన్నతనం ఎవరిది?...చీటికీ మీటికీ ఏదో ఇబ్బందులు కొని తెచ్చుకుంటుంటే నేను సరిచూడొద్దూ?

కరుణా : ఇప్పుడటువంటి ఇబ్బందులు తెచ్చుకొన్నానంటావా?

రాజా : కాక? నువ్వు మరమనిషివి. నీ బుర్రలోకి ఏ ఆలోచన వస్తే అదే! అది వెలుగుచూసేదాకా నిద్రపోవు..నలుగురికీ చెప్పే దాకా నీకు తోచదు....

కరుణా : నీకు తెలిసిన విషయాన్ని, జనానికి మంచిని కలిగించే విషయాన్ని నలుగురికీ చెప్పడం తప్పా?

రాజా : కాని, నువ్వొక చోట ఉద్యోగం చేస్తున్నావు. అక్కడ నీ పై అధికారుల ఆజ్ఞలకు ఒదిగి పని చెయ్యాలి..... ఆ విషయం నీకు తలకెక్కదని నాకు తెలుసు.....అందుకని, ఈ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడిగా ఈ రిపోర్టు బయటకు రానివ్వకూడదని నా ఆజ్ఞ..దీన్ని ఉల్లంఘిస్తే నీ ఉద్యోగం ఏమవుతుందో జ్ఞాపకం ఉంచుకో!

కరుణా : ఈ ఉద్యోగం ఉంచుకోవడానికి ఏం చెయ్యాలో?

రాజా : నువ్వు ఇప్పుడు చెబుతున్నవన్నీ పుకార్లనీ, అందులో నిజం లేదని నువ్వు ప్రకటన ఇవ్వాలి.

కరుణా : అదెట్లా?!

రాజా : నువ్వు మళ్ళీ ఈ నీళ్ళని పరిశోదనకి పంపానని, ఇంకా జాగ్రత్తగా పరిశీలించిన తరువాత నీ మొదటి అంచనా తప్పయిందని చెప్పాలి.

కరుణా : ఓ!

రాజా : పరిస్థితులను చక్కబరచడానికి పాలకవర్గం తీసుకునే చర్యలమీద నీకు నమ్మకం ఉందని కూడా చెప్పాలి.

కరుణా : (నవ్వి) నా నమ్మకం..ఈ నీటి స్థితిగతుల మీద ఆధారపడి ఏర్పరుచుకున్నది. ఆ నీటి పరిస్థితి మరితేనే నా నమ్మకమూ మారుతుంది.

రాజా : నీ స్వంత నమ్మకాలను గురించి ఎవడికి కావాలి? నువ్వు ఈ సంస్థలో ఉద్యోగివి. నీ నమ్మకాలు ఏమన్నా వుంటే వాటిని భద్రంగా వుంచుకో –

కరుణా : నా అభిప్రాయాలు నా ఉద్యోగంలో భాగమయిన నీటి బుగ్గల్ని గురించి – శాస్త్రజ్ఞుణ్ణిగా, డాక్టరుగా ఈ విషయాన్ని చెప్పడానికి నాకు సర్వస్వతంత్రం ఉంది.....

రాజా : ఈ సంస్థను గురించి చెప్పడానికి మాత్రం లేదు....అట్లా చెప్పడానికి వీలులేదని నిర్మొహమాటంగా హెచ్చరిస్తున్నాను.

కరుణా : శాసిస్తున్నావా?

రాజా : అవును. నీ పై అధికారిగా – దీన్ని నువ్వు అమలు చేసి తీరాలి.

కరుణా : అమలు చేసితీరాలా?.....ఎంత ధైర్యం! (తలుపులు తోసుకుని విద్య వస్తుంది........ఆమె వెనకాలే ఆమెను వారిస్తూ అరుంధతీ వస్తుంది)

అరుం : విద్యా! విద్యా!

రాజా : అక్కడేం చేస్తున్నారు? మా మాటలు పొంచి వింటున్నారా?

అరుం : మీ ఇద్దరి అరుపులు దొడ్లోకి కూడా వినిపిస్తున్నాయి..

విద్య : అవును.....పొంచి వుండే వింటున్నాం....ఏం?

రాజా : అవునవును..ఇప్పుడు నాకు చాలా సంతోషంగా వుంది.

కరుణా : ఎందుకు? నన్ను శాసిస్తున్నందుకా?

రాజా : ఆ మాటలు అనడానికి నన్ను ఉసిగొల్పింది నువ్వు.

కరుణా : అంటే – నలుగురి ముందు నా మొహంమీద నేనే ఉమ్మేసుకోవాలన్నమాట!

రాజా : ప్రతీదీ అలా అలంకారాలతో మాట్లాడతవేం?

కరుణా : నేను మీ ఆజ్ఞకఇ తల ఒగ్గకపోతే?

రాజా : మా పక్షంగా ప్రజలకు ఏం చెప్పుకోవాలో అది చెబుతాం.

కరుణా : మంచిదే!...మళ్ళీ మీ మాటల్ని ఖండిస్తూ నేనూ ప్రకటన చేస్తాను...నేను నా మాటలకి కట్టుబడి వుంటాను....అంతేకాదు....నేను చెప్తున్న మాటలు నిజాలని నిరూపిస్తాను.

రాజా : అప్పుడు నిన్ను ఉద్యోగంలో నుంచి తీసివెయ్యకుండా ఎవ్వరూ – చివరికి నేనుకూడా – కాపాడలేను.

కరుణా : ఏమిటీ!

రాజా : అవును...ఆరోగ్య పథకాన్ని ఎదిరించే నువ్వు ఆ సంస్థలో ఉద్యోగిగా ఉండడానికి వీలులేదు.

కరుణా : అంటే నన్ను డిస్మిస్ చేస్తావా?

విద్య : పెదనాన్న! నాన్న లాంటి డాక్టర్ని అలా అనడం మంచిది కాదు.

అరుం : నువ్వూరుకోవే!

రాజా : భేష్! పులికడుపున పులిపెల్లే పుట్టిందన్నమాట! చూడు అరుంధతీ! ఈ ఇంట్లో సజావుగా ఆలోచించగలిగిన దానికి నువ్వొక్కత్తెవే! మీ ఆయన బుర్రలోకి కాస్త లోక జ్ఞానాన్ని పట్టించి, తనకు తన కుటుంబానికి తన ఊరికి, ఈ ఊరి జనానికి ఎంత హాని తలపెట్టాడో తెలిసేటట్లు చెప్పు.

కరుణా : ఎవరు ఈ ఊరిని ఈ ప్రజలను ప్రేమించే వాళ్ళో ఎవరు అధికారాన్ని, డబ్బును ప్రేమించేవాళ్ళో త్వరలోనే తెలుస్తుంది...

రాజా : వాళ్ళ బ్రతుకుతెరువుల్ని నాశనం చేస్తూ, అది మీ కోసమే చేస్తున్నానంటే నమ్మే మూర్ఖులా వాళ్ళు!

కరుణా : బ్రతుకు తెరువన్నది ముందు బతికినప్పటి మాట కదా! ఆ నీళ్ళు తాగితే రెండేళ్ళలో ఇది ఊరుకాదు, స్వశానం అవుతుంది.

రాజా : ఇటువంటి విషభావాల్ని ప్రచారం చేసేవాడు ప్రజాద్రోహి –

కరుణా : ఏమన్నావ్! ...ఎంత ధైర్యం – (అన్నయ్య మీదకు వెడతాడు)

అరుం : ఏమండీ!

విద్య : నాన్నా!

రాజా : ముష్టి యుద్ధాలు నాకు నచ్చవు. నిన్ను మరోసారి హెచ్చరిస్తున్నాను. నీ కోసం, నీ కుటుంబం కోసం నువ్వెట్లా ప్రవర్తిస్తావో అది నీకే వదిలిపెడుతున్నాను.......(దర్పంగా వెళ్ళిపోతాడు)

అరుం : (అన్న వెళ్ళిన వైపే చూస్తూ) ఎన్ని మాటలని వెళ్ళాడు?

విద్య : (తల్లితో) నువ్వు వెనక్కు లాగావు గాని, ఆయన మొహం మీదే కడిగెయ్యాల్సింది –

కరుణా : పొరపాటు నాదమ్మా! అనవసరంగా పోట్లాట ఎందుకని. సౌమ్యంగా మాట్లాడాను...అందుకు ప్రతిఫలం...నన్ను ప్రజాద్రోహి అంటాడా? నన్ను!

అరుం : తొందరపడకండి.....అధికారం ఆయన పక్షాన వుంది.

కరుణా : కాని నిజం నా పక్షాన వుంది అరుంధతీ!

అరుం : అధికారం మద్దతులేని నిజం వల్ల ప్రయోజనం ఏముంటుందండీ?

విద్య : నువ్వు కూడా అట్లా మాట్లాడతావేం అమ్మా?

కరుణా : అరుంధతీ! వూరి వాళ్ళంతా మన పక్షం! పత్రికలు మన పక్షం! వీళ్ళు కాకపోతేనేం?

అరుం : కాని మీరు, మీ అన్నయ్య ఇలా నలుగురిలోనూ పోట్లాడుకోవడం బావుంటుందా?

కరుణా : మరేం చెయ్యమంటావు? ఆయన చెప్పిందల్లా చెయ్యమంటావా?

అరుం : పోనివ్వండి....మీరు చెప్పవలసింది చెప్పారు..ప్రమాదం అని హెచ్చరించారు...వాళ్ళు మీ మాట వింటే వింటారు..లేకపోతే లేదు....అంతకన్న ఎక్కువ పట్టుబడితే –

కరుణా : ఆ! పట్టుబడితే –

అరుం : పట్టుబడితే – ఉద్యోగంలోంచి తీసేస్తారండీ!

**కరుణా :** అందుకని నా విధిని నేను చెయ్యొద్దంటావా? అందుకని ఊరి ప్రజల్ని బలి ఇవ్వమంటావా?

**అరుం :** మరి పెళ్ళాం పిల్లల ఆలనా పాలనా మీ విధి కాదా?

**విద్య :** అవేం మాటలమ్మా?మా ఆలనా పాలనా ముఖ్యమా యిప్పుడు?

**అరుం :** నీకేమే! నువ్వు అట్లాగే అంటావు. రేప్పొద్దున్న నీకు పెళ్లికావడం ఎలా? మగపిల్లల భవిష్యత్తు ఏంకాను? మళ్ళీ మనం వెనకటి దరిద్రంలోకి వెళ్ళిపోతే –

**కరుణా :** అందుకని వాళ్ళ బూటకపు బ్రతుకునే నన్ను కూడా బతకమంటావ్? జీవితాంతం నా మొహాన్ని చూసుకుని నన్నే అసహ్యించుకుంటూ బతకమంటావ్! అంతేనా?

**అరుం :** చూడండి.......ప్రపంచంలో ఉన్న అవినీతినంతా మనం తుడిచెయ్యగలమా? దానిదారిన దానిని ఉండనివ్వండి....మనదారిన మనం గౌరవంగా బతుకుదాం.

(చైతన్య, నాగార్జున వస్తారు)

**అరుం :** మీకు ఉద్యోగం కూడా లేకపోతే వాళ్ళనెట్లా పోషిస్తామండీ?

(పిల్లలు బిత్తరపోయి తల్లిదండ్రుల వంక చూస్తూ వుండిపోతారు)

**కరుణా :** అరె! వచ్చేశారే! రండి.....చైతన్యా! నాగార్జునా! రండి......ఇట్లారండి....(నాగార్జునతో) ఇవ్వాళ స్కూల్లో మీకేం చెప్పారు?

**నాగా :** మాకు – ఇన్‌సెక్ట్స్ – పురుగుల్ని గురించి చెప్పారు నాన్నా!

**కరుణా :** నిజం?

**చైతన్య:** అందరూ అట్లా వున్నారేం?

హ: ఏమీలేదు.....కాని....ఇవ్వాళనుంచీ మీకు మనుషుల్ని గురించి చెబుతాను. సరా?

(అరుంధతీ ఏడుస్తూనే వుంటుంది. కరుణాకరం పిల్లల్ని దగ్గరకు తీసుకుంటూ వుండగా)

**తెర**

## మూడో రంగం

('సత్యంవద' పత్రిక సంపాదకుడు సత్యనాథం ఆఫీసు. గది అంతా చిందరవందరగా ఉంది. పత్రికలు, కాగతాలు, పుస్తకాలు చెల్లాచెదురుగా పడి వున్నాయి.....తెర లేచేసరికి సురేంద్ర ఒక కాగితం ప్రతిని చదువుతున్నాడు. లోలపనుంచి సత్యనాథం వస్తాడు.)

**సురేం :** డాక్టరుగారు ఇంకా రాలేదా?

**సత్య :** రాలేదు...చదవడం పూర్తి అయిందా?

(ఒక్క నిముషం ఆగమన్నట్టు సంజ్ఞ చేస్తాడు సురేంద్ర...చదవడం పూర్తయ్యాక, సత్యనాథం దగ్గరకు వచ్చి ఆ కాగితాల ప్రతిని ఇస్తాడు.)

సత్య : ఎట్లా వుంది?

సురేం : బ్రిలియంట్.....కల్లోలాన్ని సృష్టిచేటట్లుగా వుంది. ది డాక్టర్ ఈజ్ ఎ గ్రేట్ మన్. అక్కడ ఆఫీసుల్లో కూర్చున్న వాళ్ళెవరూ ఆయన కాలిగోటికి పోలరు. (మళ్ళీ కాగితాలు తీసుకుని వాటిని ఊపుతూ) ఇందులో విప్లవం రెపరెపలు వినిపిస్తున్నాయి నాకు.

సత్య : ష్......శివశంకరంగారు లోపలే ఉన్నారు.....

సురేం : ఆయన పిరికివాడండీ! అన్నీ మితంగా ఉండాలని చెప్పీ చెప్పీ తన మెదడును కూడా మితంగా ప్రచురిస్తూన్నారా, లేదా?

సత్య : డాక్టర్‌గారి కోసం ఎదురు చూస్తున్నాను....ఛైర్మన్‌గారు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ప్రచురణ జరిగి తీరవలసిందేనని చెప్పాను.

సురేం : కాని ఛైర్మన్‌గారికి వ్యతిరేకంగా ప్రచురించడం చాలా ప్రమాదకరం – అవునా?

సత్య : ఆపడానికి ప్రయత్నించమను, చూద్దాం.....అట్లా చేస్తే ఊళ్ళో ఉన్న శ్రామిక, పాటక జనం ఆయన నెత్తురు కళ్ళచూస్తారు....శివశంకరంగారు చూసుకుంటారు ఆ విషయాలన్నీ......

సురేం : ఈ ఆరోగ్యసంస్థని ఈ వూళ్ళో పెద్దలంతా పంచుకుని తింటున్నారు..కాస్త డబ్బు వాటాగా కట్టి, లక్షలకు లక్షలు లాభాలు గుంజుకుంటున్నారు.......ఇప్పుడు వాళ్ళంతా నెత్తిన గుడ్డలేసుకుపోతారు.

సత్య : చివరికి జరిగేదదే! ఒకసారి బావులన్నీ మూలపడితే అధికారంలో ఉన్న అయ్యగార్ల పసయేమిటో జనానికి తెలిసివస్తుంది...అప్పుడు కాని ఈ వూరికి నిజమైన ప్రజాప్రభుత్వం రాదు.

సురేం : అందుకే ఇది విప్లవం.......ప్రజావిప్లవానికి నాంది వాక్యాలు ఈ కాగితాల్లో ఉన్నాయి.

(అంటూ ఉండగా కరుణాకరం ప్రవేశిస్తాడు)

కరుణా : (వస్తూనే) ఇహ మీరు ఆ రిపోర్టు నిరభ్యంతరంగా ప్రచురణకు పంపొచ్చు.

సత్య : ఛైర్మన్‌గారు ఏమన్నారు?

కరుణా : ఆయన మనమీద యుద్ధం ప్రకటించాడు..ఆయన యుద్ధమే కావాలను కుంటున్నాడు కనుక మనం కూడా అందుకు సిద్ధం అవుదాం...(సురేంద్ర చేతుల్లో నుంచి కాగితాలు తీసుకుని) దానికి ప్రారంభం ఇదే! ఛైర్మన్‌గారు ఏం చేద్దామనుకుంటున్నారో తెలుసా?

సురేం : శివశంకరంగారూ! డాక్టర్‌గారు వచ్చారు!

కరుణా : నన్ను బ్లాక్‌మెయిల్ చేద్దామనుకుంటున్నాడు...తన అనుమతి లేకుండా ఈ విషయాన్ని నేను ఎక్కడా మాట్లాడడానికి వీలు లేదని ఆంక్షవిధించాడు.

సత్య : అంత కటువుగా అన్నాడా?

కరుణా : ఆ! నా మొహం మీద! పరిస్థితుల్ని అర్థం చేసుకోకపోతాడా అని నేనే కొంచెం మెత్తగా మాట్లాడాను. కాని వాళ్ళకి ప్రజాక్షేమంమ అక్కర్లేదు. తమ పదవిని భద్రంగా ఉంచుకోవడం కావాలి; అధికారం నిలవడం కావాలి. దాని కోసం ఊరినంతా విషమయం చేసినా సరే!

శివ : (ఈ మాటల చివర వస్తూ) డాక్టర్‌గారూ! కొంచెం మెల్లగా మాట్లాడండి. ఆవేశపడకండి..మితం – అదీ నా మతం....అతి సర్వత్రా వర్జయేత్ – అన్నాడు.

కరుణా : (శివశంకరం మాటల్ని తుంచివేస్తూ) వ్యాసం ఎట్లా వుంది సత్యనాథం?

సత్య : ఎక్సలెంట్.......మహత్తరమైన సామాజిక శక్తి అంతా ఆ వ్యాస రూపంలో రూపంలో రూపు కట్టుకుందండీ.....మనల్ని ఎటువంటి స్వార్థపరులు పరిపాలిస్తున్నారో ఒక్క దెబ్బతో నిరూపించారు.

శివ : అయితే దానిని అచ్చుకు పంపించవచ్చా?

కరుణా : నిరభ్యంతరంగా –

సత్య : రేపటి పత్రికలోనే ప్రచురిస్తామండీ.

కరుణా : ఆ! చూడండి శివశంకరం గారూ! మీ "మితం" మతాన్ని ఇక్కడ కూడా అన్వయించి వ్యాసాన్ని సగం సగం కొయ్యకుండా పూర్తిగా ప్రచురించండి.

శివ : (నవ్వుతూ) మరీ నన్ను అట్లా తీసిపారెయ్యకండి.

కరుణా : పత్రికల్లో మామూలుగా వచ్చే పచ్చి అబద్ధాలకు, అర్థ సత్యాలకు, పాతిక వంతు నిజాలకు భిన్నంగా – ఒక నూటికి నూరు పాళ్ళు నిజాన్ని ప్రజలకు అందించండి....కల్తీ లేని నిజం – ఆ నిజం ద్వారా మనం ఆశించే సామాజిక న్యాయం – ఇవీ మన లక్ష్యం! ఇది విజయవంతం అయితే క్రమక్రమంగా మిగిలిన విషయాలను గురించి కూడా –

శివ : కాని జ్ఞాపకం ఉంచుకోండి –

సురేం, సత్య : మితం నా మతం.

అతి సర్వత్ర వర్జయేత్ – నా పంథ.

(వాళ్ళ వైపు కొంచెం కోపంగా చూస్తాడు)

కరుణా : సరే! నేను వస్తాను...ఒక రోగిని అర్జంటుగా చూసి పొమ్మని కబురొచ్చింది.....(వెళ్ళిపోతాడు)

సత్య : (శివశంకరంతో) డాక్టర్‌గారు మనకు ఎంత ఉపయోగపడతారో తెలిసిందా?

శివ : కాని ఊళ్ళో అన్ని విషయాలని గురించీ రాస్తానంటాడేమిటి? ఇప్పుడు మన బావుల్ని గురించి రాస్తున్నాడు..ఇది చాలదూ?

సురేం : ఎందుకు ప్రతి నిమిషం అలా భయపడతారు?

శివ : నీదేం పోయిందోయ్? నేనిక్కడ బతక వలసిన వాణ్ణి.....కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించమను.....ఆయన యిష్టం.........కాని మునిసిపాలిటీని అదే పనిగా తిడితే –

సురేం : అందులో తేడా ఏమిటి? చెడు ఎక్కడున్నా చెడేగా?

శివ : పిచ్చివాడా? దూరంగా ఉన్నవాడి నెవడ్నో తిడితే వాడు మనకు కనిపించడు; వినిపించడు...రోజూ మొహం మొహం చూసుకోవలసిన వాణ్ణి తిడితే – రేపు వాడితో ఏం పనొస్తుందో ఎట్లా చెప్పగలం? పైగా ఈ ఊళ్ళో చిన్న కారు వ్యాపారస్థుల సంఘానికి నేను అధ్యక్షుణ్ణి –

సురేం : అంటే – మీరు చిన్నకారు వ్యాపారస్థుల సంఘానికి అధ్యక్షులయితే నిజాన్ని గంగలో కలపవచ్చునా మీ అభిప్రాయం –

శివ : కాదు....నిజాన్ని మించిన అవసరాలు చాలా వుంటయ్యని. అయినా ఈ క్రాస్ పరీక్షలు నన్ను చేస్తావేం? నువ్వు ఈ ఉద్యోగం వదిలేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి దగ్గర అసిస్టెంట్‌గా చేరుతున్నావుగా? అప్పుడు నిజాన్ని గంగలో కలపకుండా ఉంటావో చూద్దాం –

సత్య : ఏమిటీ! పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారి దగ్గర అసిస్టెంట్‌గా చేరుతున్నావా? ఆయన ఈ వూళ్ళో ప్రతి

మంచి పనికీ అడ్డంకే గదుటోయ్?

సురేం : ఏం? ఎందుకు చేరకూడదు? డాక్టర్‌గారు ఆరోగ్య సంస్థను బాగు చెయ్యాలనుకుంటున్నట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారి సిద్ధాంతాలని నేను బాగు చెయ్యాలనుకోకూడదా?

శివ : అనుకోవచ్చు...కాని అవతల వాడిని తేలిగ్గా తప్పు పట్టకూడదు....నన్ను పిరికివాడినని నువ్వు అంటూ వుంటావని విన్నాను. నేను విప్లవం, విప్లవం అంటూ అరవనూలేదు, మంచి ఉద్యోగాలకి ఎగబడనూ లేదు..నా అభిప్రాయాలు నాకున్నాయి. అవి మారవు....సరేనా?

(అంటూ కోపంగా లోపలికి వెళ్ళిపోతాడు)

సురేం : ఈయనతో పనిచెయ్యడం రానురాను కష్టమై పోతున్నది.

సత్య : తొందరపడకు....మన పత్రికకయ్యే ఖర్చంగా భరిస్తున్నాడాయన.

సురేం : ఆ! ఒక ఐడియా? మన పత్రికకి పెట్టుబడి పెట్టమని కరుణాకరం గారిని అడిగితే?

సత్య : ఆయనకి డబ్బెక్కడిది?

సురేం : ఆయన దగ్గర లేకపోతే, ఆయన మామగారి దగ్గర ఉంది.......

సత్య : అంత డబ్బుందా! అబ్బే.....ఆయన్ని గత ఐదేళ్ళుగా చూస్తున్నాను. అదే కోటు, అదే చొక్కా –

సురేం : అవి మారిస్తేనేనా డబ్బున్నవాడికింద లెక్క? ఆయన వెనక చాలా వ్యాపారాలు చేసేవాడని వినికిడి.........ఎప్పుడూ డబ్బు ఖర్చు చెయ్యడం ఎరగం –

(విద్య వస్తుంది...చేతులో ఓ పుస్తకం ఉంది)

విద్య : (సత్యనాధంతో) నమస్కారం.

సత్య : మీరా! ఇక్కడ!.......కూర్చోండి....ఏమిటీ?

విద్య : (కూర్చుంటూ) మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని వచ్చాను.....

సత్య : ఏమిటది?

విద్య : ఇది మీరు అనువాదం చెయ్యమని ఇచ్చిన ఇంగ్లీషు నవల.

సత్య : ఏం? చెయ్యరా?

విద్య : (సీరియస్‌గా) నాకిదేమి అర్థం కావడం లేదు.

సత్య : దేని విషయం?

విద్య : మీ నమ్మకాలకి, ఈ పుస్తకంలో విషయాలకి ఏమాత్రం పొంతన లేదు.

సత్య : పుస్తకం అంత ఘోరంగా ఉందా?

విద్య : ఇందులో అతి మనవీయ శక్తులూ, వాటి ఉపాసకులూ, అవి ప్రజల జీవితాలను మార్చడాలూ, మంచివాళ్ళని అకస్మాత్తుగా భగవంతుడు ఓ పాము రూపంలోనో వచ్చి రక్షించడం, చెడ్డవాళ్ళను శిక్షించడం – ఏమిటండీ ఇదంతా? ప్రపంచం ఇట్లాగే నడుస్తుందా?

సత్య : నిజమే, విద్యా!......క్షమించండి......'మీరు' పిలుస్తూ చొరవగా మాట్లాడం కష్టం –

విద్య : ఫరవాలేదు, చెప్పండి......

సత్య : చూడండి...చూడు, విద్య! ఇది పత్రిక మా పాఠకుల్లో తొంభైమంది ఇటువంటి నవలలే

కావాలంటారు....ఈ నవలల మధ్యలో అక్కడక్కడా అభ్యుదయ రాజకీయ భావాలను కూడా ప్రవేశపెడతాం.... పాఠకులకు అవసరమైన వాటిని మనం ఇవ్వకపోతే పత్రిక నాలుగు రోజుల పాటు కూడా నడవదు.

విద్య : బాగుంది! పత్రికాసంపాదకత్వంలో ఇవ్వాళ నాకు మొదటి పాఠం నేర్పారు....థాంక్స్ (వెళ్ళడానికి లేస్తుంది)

సత్య : విద్య! నన్ను గురించి అటువంటి ఉద్దేశ్యంతో నువ్వు వెళ్ళిపోవడం బాగులేదు..(సురేంద్రకు ఏమో కాగితాలు ఇచ్చి) ఇవి కంపోజింగ్‌కు ఇవ్వు (సురేంద్ర లోపలికి వెడతాడు)

సత్య : నన్ను గురించి అట్లా అనుకోవడం అన్యాయం....ఆ పుస్తకాన్ని నేను చదవను కూడా లేదు....అది సురేంద్రకు వచ్చిన ఐడియా!

విద్య : అతనూ అభ్యుదయ వాది అన్నారు !

సత్య : నిజమే! అతను కూడా –

విద్య : (ప్రతి అక్షరం నొక్కి పలుకుతూ) పత్రికల వాడు! భావించ వద్దనే నేను కోరేది....నీకు తెలుసు – నీ లాంటి ఆడపిల్లలంటే నాకు చాలా గౌరవం....ఇంత వరకు ఈ విషయం చెప్పే అవకాశం రాలేదు....నువ్వంటే నాకు చాలా ఇష్టం –

విద్య : (అది పట్టించుకోనట్లుగా) ఓహ్! ఈ పుస్తకం నన్ను చాలా కలవర పెట్టింది....(వెనక్కు తిరిగి) ఒక్క విషయం చెప్పండి.....మా నాన్న గారిని మీరెందుకు వెనకేసుకువస్తున్నారు?

సత్య : అందులో తెలియందేముంది? ఆయన అభిప్రాయాల్ని మా పత్రిక గౌరవిస్తుంది కనక.

విద్య : కాని ఇటువంటి నవలల్ని ప్రచురించే పత్రిక ఆయన అభిప్రాయాలను గౌరవించడం అసంభవం!

సత్య : అంత తొందరగా నిర్ణయాలకు వస్తావేం నువ్వు కూడా?.........మీ –

విద్య : చెప్పండి.......మీ –?

సత్య : అదే! –

విద్య : మా నాన్నగారి లానే అని మీ ఉద్దేశ్యం! మీ యిష్టం! మీరు అలానే అనుకోండి.....కాని మా నాన్నగారి భావాలకి ఈ పుస్తకంలో భావాలకి ఎక్కడా పొంతన లేదే? దీన్ని గురించి నాకేమీ అభిప్రాయాలుండ కూడదా?

సత్య : అది నా ఉద్దేశ్యం కాదని ఇది వరకే చెప్పాను.

విద్య : కాని దాన్ని ప్రచురించడానికి, సంపాదకుడిగా, మీకేం అభ్యంతరం లేదన్నారు..పైగా అవిలేంది పత్రిక నడవదన్నారు. మీకు ప్రిన్స్‌పిల్స్ లేవు.....గోడమీది పిల్లివాటంగా జీవితం గడిపే వాళ్ళంటే నాకసహ్యం. (వెళ్ళిపోతూ వుంటుంది)

శివ : (లోపలనుంచి వస్తూ) సత్యనాధం! సత్యనాధం! (వెడుతున్న విద్యను చూసి) డాక్టరు కరుణాకరం గారి అమ్మాయి కదూ?

విద్య : (వెనకకు తిరిగి) మిమ్మల్నందర్నీ చూస్తుంటే నాకిది వరకెన్నడూ వెయ్యనంత భయం వేస్తోంది! (వెళ్ళిపోతుంది)

సత్య : (ఆమె వెంట వెడుతూ) చూడు విద్యా! మాట –

శివ : ఎక్కడికి వెడుతున్నావు? లోపల ఛైర్మన్‌గారున్నారు.

సత్య : ఛైర్మన్‌గారా?

శివ : ఆ! ఛైర్మన్ రాజారావు గారు! నీతో మాట్లాడాలిట! వెనక గుమ్మంలోంచి లోపలికి వచ్చారు. తాను ఇక్కడికి రావడం ఎవ్వరూ చూడకూడదని ఆయన ఉద్దేశ్యంట!

సత్య : ఏం కావాలి ఆయనకి? (లోపలకి తొంగి చూసి) దయ చెయ్యండి ఛైర్మన్‌గారూ!

(అందులో వ్యంగ్యం లేదు....కొంతలో కొంత లొంగిపోయిన తనం ఉంది)

రాజా : (లోపలికి వస్తూ) అరె! ఈ గదంతా శుభ్రంగా తీర్చదిద్దినట్టు ఉందే! మామూలుగా పత్రికాఫీసులనగానే కాగితాల కుప్పలు, పత్రికల గుట్టలు, దుమ్ముకొట్టుకుపోయి కనిపిస్తాయి. ఇది చాలా శుభ్రంగా ఉంది శివశంకరంగారూ!

శివ : ఏదో! ఉన్నంతలో –

సత్య : చెప్పండి.....మీ వంటి పెద్దలు ఊరికే రారు! ఏమిటి సంగతి?

రాజా : (చేతులో కర్రను టేబుల్ పై పెడుతూ, కూర్చుని) మనసుకి చాలా కష్టం కలిగే పని ఒకటి జరిగిందయ్యా ఇవ్వాళ!

సత్య : అట్లాగా! ఏమిటది?

రాజా : మా తమ్ముడు ఏదో రిపోర్టు రాశాడని విన్నాను.....అదే! మన నీటి బావుల మీద –

సత్య : అట్లాగా! మీకట్టాగ తెలుసు?

రాజా : మీక్కూడా చెప్పాడా ఏమిటి ఆ సంగతి?

సత్య : ఏదో – మాట వరసకి అన్నారు –

శివ : (చేతులో కాగితాలను దాచే ప్రయత్నం చేస్తూ) క్షమించండి.......ఇప్పుడే వస్తాను.

రాజా : (ఆ కాగితాలు చూసి గుర్తుపట్టాడు) ఆ! అవే కాగితాలు! అవునా?

శివ : ఇవా? నాకు తెలియదే! ఇప్పుడే కంపోజిటరు నా చేతిలో పెట్టి వెళ్ళాడు.

రాజా : ఏవి? ఇట్లా ఇవ్వండి –

శివ : అబ్బే! ప్రూఫులు గదా! చాలా తప్పులుంటాయండీ –

రాజా : అచ్చుతప్పుల్ని పరిహరించుకొని చదవడం పాఠకులు నేర్చుకోవలసిన విద్యండీ! చూడనివ్వండి....

(ఆ కాగితాలు తీసుకుని పైనించి కిందదాకా చూసి)

దీన్ని మీ పత్రికలో వేస్తున్నారా?

సత్య : ఆయన తన పేరున ప్రచురించమని ఇస్తే, అచ్చు వెయ్యక తప్పదు గదండీ! అప్పుడు బాధ్యత రచయితదే అవుతుంది.

రాజా : శివశంకరంగారూ! దీన్ని మీ పత్రికలో ప్రచురించనిస్తున్నారా?

శివ : నాదే ముందండీ! నేను డబ్బు పెట్టిన వాణ్ణి! ఈ విషయాలన్నీ ఎడిటరే చూసుకుంటాడు.

రాజా : బావుండి –

శివ : ఆ కాగితాలిస్తే –

రాజా : అట్లాగే! (కాని ఇప్పుడు) ఆ నీటి బావుల్ని మరమ్మతు చేయడం అంటే –

శివ : నాకు తెలుసు ఛైర్మన్‌గారూ! ఆరోగ్య సంస్థలో భాగస్వాములలైన పెద్దలందరూ మళ్ళీ చాలా డబ్బు మదుపు పెట్టాల్సి వస్తుంది.

రాజా : దాన్ని గురించి మీరు మనసు కష్టపెట్టుకోకండి.....అది జరగని పని – ఆ డబ్బును భాగస్వాములు పెట్టుకోరు –

శివ : మరి?

రాజా : దాన్ని ఊళ్ళో ఉన్న దుకాణాదారులు, ప్రజలు భరించాలి – పన్నుల రూపంలో –

శివ : వాళ్ళెందుకు కట్టాలి? బావులకోసం పన్నులు వాళ్ళెందుకు కట్టాలండీ?

రాజా : దానిమీద బతుకుతున్నారు కనక, లాభాలు సంపాదిస్తున్నారు కనక.....ఆరోగ్య సంస్థ కట్టించింది ఈ బావుల్ని....కాని ప్రజలు అందులో మార్పుల్ని కోరితే, ఎవరి మాటల్నో విని కొత్తగా కట్టాలని డిమాండ్ చేస్తే దానికయ్యే ఖర్చును భరించాల్సింది కూడా ప్రజలేగా?

శివ : అది అసంభవం! ఇంకా పన్నులు వెయ్యడానికి ప్రజలు ఒప్పుకోరు......ఇంతా చేసి మామూలు జనం మీదనా మీ దాడి?

రాజా : ఏం? మీరంతా కలిసి కట్టుగా మామీద దాడి చెయ్యొచ్చా?

శివ : ఇంతకీ ఇది మీ అభిప్రాయమా? మునిసిపాలిటీ నిశ్చయమా?

రాజా : నా అభిప్రాయమే మున్సిపాలిటీ నిశ్చయం అనే మామూలు నిజాన్ని కూడా తెలుసుకోలేనివాడివి పత్రికాధిపతివేమిటయ్యా? – జరిగేది మాత్రం ఖచ్చితంగా ఇదే?

శివ : ఎక్కువ పన్నుల్ని కట్టక్కర్లేదని మా పత్రిక రాస్తేనో –?

రాజా : ఎక్కువ పన్నులు అక్కర్లేకపోతే బావుల్ని మూసేస్తాం సరా? పైగా తిరిగి ఈ గొట్టాలు వేసి, టాంకులు కట్టి నీళ్ళ బావుల్లోకి వదలడానికి రెండేళ్ళు పడుతుంది. ఈలోగా నీ చిన్నకారు వర్తకులకి పైగా ఆదాయం ఉండదు, మీ శ్రామికులు పస్తులుంటారు! దానికి తోడు కొత్త పన్నులు!

(శివశంకరం, సత్యనాధం పాలిపోతారు)

ఇదంతా ఎందువల్ల జరుగుతుందో తెలుసా? మనం విషం నీళ్ళు తాగుతున్నామని కొందరు పడుతున్న భ్రమ వల్ల; పుట్టిస్తున్న పుకార్ల వల్ల! దాన్ని నమ్మే కొందరు పెద్దల వల్ల –

సత్య : అది భ్రమేమిటండీ! సైన్స్! పచ్చి నిజం !!

రాజా : (కాగితాలు టేబుల్‌మీద విసిరి కొడుతూ) కాదు....అధికారాన్ని ఖాతరు చెయ్యకూడదనే డాక్టర్ కరుణాకరం మనస్తత్వం! అతిన పొగరు....పగతీర్చు కోవడానికి ఇది కుంటె సాకు! మన జీవితాలని సర్వనాశనం చెయ్యడానికి ఓ పిచ్చివాడు గిలికిన అక్షరాలు ఇవి! ఉన్నదానిని బాగు చేసుకుని, నలుగురితో కలిసి హాయిగా జీవించాలను కోనేవాడు చేసే పనులేనా ఇవి? మనల్ని నాశనం చెయ్యాలనీ, ప్రతీకారం చెయ్యాలనీ అక్కసు –

ఈ వూరి ప్రజలంతా దీన్ని సరిగ్గా అర్థం చేసుకోనేటట్లు చెయ్యడం నా విధి!

శివ : మీరు చెబుతున్న దంతా నిజమా ఛైర్మన్‌గారూ?

రాజా : ఇందులో అబద్ధం ఏమిటో మీరు చెప్పండి...(శివశంకరంతో) దీని వల్ల నష్టపోయేది చిన్నకారు దుకాణదారులని, రోజువారీ కూలీలన్నది నిజం కాదా? (సత్యనాథంతో) దీన్ని బాగు చేయించాలంటే అయ్యే లక్షల రూపాయలు, విధి లేక పన్నుల రూపంలో తప్ప మరొక రకంగా వసూలు చెయ్యడం కుదరదనేది నిజం కాదా? – చెప్పండి –

శివ : (సత్యనాథంతో) ఇప్పుడు చెప్పు మనం యింకా డాక్టరుగారిని వెనకేసుకురావడం ఎలానో?

సత్య : (రాజారావుతో) నేనీ విషయాలు ఆలోచించలేదు సుమండీ!....మీరన్న మాటలన్నీ నిజాలనే అనిపిస్తున్నది.....అధికారం అంటే ఆయనకున్న అసహ్యం నాకు తెలుసు....అందుకోసమే ప్రతికారం తీర్చుకుంటున్నాడేమోనని నాకిప్పుడు అనుమానంగా ఉంది....పైగా సామాన్య ప్రజానీకం కొత్త పన్నులు కట్టవలసి వస్తే – అది దారుణం!

హ : ఆయన చెప్పిన మాటల్ని గుడ్డిగా ప్రచారం చేద్దామనుకున్నారుగా! ఈ మాత్రం కూడా ఆలోచించకుండా ఎందుకు దిగారు?...లేదా, విశాల భావాలున్న మీ పాఠకులకి ఎక్కువ పన్నులు కట్టడం సరదానేమో తెలియదు....

చూడండి.....దీనికి వెనక వున్న అసలు నిజాన్ని గురించి ఒక వ్యాసం రాసి తీసుకువచ్చాను...జాగ్రత్తగా ప్లాన్ చేస్తే కొద్దిపాటి డబ్బుతోనే బావుల్ని, నీటినీ కూడా పరిశుభ్రం చేసే అవకాశాన్ని గురించి ఇందులో రాశాను......పైగా అందుకయ్యే ఖర్చు కూడా మునిసిపాలిటీ పెట్టుకుంటుందని చెప్పాను.

సత్య : ఆ వ్యాసాన్నొకసారి చూడొచ్చా?

రాజా : మీకోసమే తెచ్చాను.....చదవండి....అందులో మీకు నచ్చనివేమన్నా ఉంటే –

సురేం : (గబగబా వాకిట్లో నుంచి వస్తాడు) ఇప్పుడు డాక్టర్‌గారు ఇక్కడికి వస్తానన్నారా?

రాజా : వచ్చాడా ఏమిటి కొంపతీసి?

సురేం : ఇటేవస్తున్నారు.

రాజా : అతనికి ఎదురు పడడం నాకిష్టం లేదు....ఎక్కడైనా –

సురేం : ఇటురండి సార్......

శివ : (ముందు వాకిలి దగ్గర తొంగి చూస్తూ) తొందరగా

రాజా : (లోపలికి పోయి, మళ్ళీ తల వాకిట్లోకి పెట్టి) తొందరగా అతన్ని పంపించె వెయ్యండి. (సురేంద్ర, రాజారావు లోపలికి వెడతారు. సత్యనాథం, శివశంకరం చాలా పనివున్న వాళ్ళలా కాగితాల్లోకి చూస్తూ ఉంటారు. కరుణాకరం వచ్చాడు)

కరుణా : ప్రూఫులేమన్నా తయారయ్యాయా? (ఇద్దరూ మాట్లాడరు) బహుశా ఇంకా ఆలస్యం ఉందనుకుంటాను.

శివ : (ఆయన వంకకు తిరగకుండానే) ఆ! ఇప్పుడప్పుడే కావండీ –

కరుణా : పోనీ వచ్చేదాకా ఆగమంటారా?

సత్య : దాని వల్ల లాభం లేదు డాక్టరుగారూ! ఇంకా చాలాసేపు పట్టొచ్చు –

కరుణా : (నవ్వి) నా ఆదుర్దాని క్షమించు సత్యనాథం –

సత్య : ఇప్పుడు చాలా పనిలో ఉన్నాం –

కరుణా : అయితే మీ పనికి అడ్డం రాను (అంటూ వెళ్ళబోయి మళ్ళీ వెనక్కి వచ్చి)

కరుణా : ఒక చిన్న మాట! బజారు వెంట నడుస్తున్నా, బజారులో నడుస్తున్న ఆడా, మగాను చూస్తున్నా.... నాకు నిరంతరం ఇదే ఆలోచన! ఇంతమంది అమాయకుల జీవితాలతో ఆడుకొనే ఆ దుర్మార్గుల్ని ఏం చెయ్యాలా అని ........

శివ : డాక్టర్‌గారూ! మీరు పెద్దలు –

కరుణా : అదుగో! అలా నాకు పెద్దరికం అంటకట్టి మీకు దూరంగా ఉంచకండి. అందుకే నేను నిన్ననే చెప్పాను....ఈ నిజాన్ని బయటకు లాగననే పేరుమీద నాకు సన్మానాలు వంటివి చేస్తే నాకు నచ్చవని...నేనూ మీలో ఒకణ్ణండీ!

(అరుంధతీ చాలా గాభరాగా వస్తుంది)

అరుం : మీరు ఇక్కడ వుంటారని అనుకొనే వచ్చాను....ఇంటికి వెడదాం పదండి...మీరు విద్యతో అర్జంటుగా మాట్టాడాలి.

కరుణా : ఏమిటి అరుంధతీ? ఆ గాభరా ఏమిటి? విద్యతో ఇంత అవసరంగా మాట్లాడడమేమిటి? నాకేం అర్థం కావడం లేదు. ఏం జరిగింది?

అరుం : ఇంకా ఏం జరగలేదు......ఇప్పుడు జరగొచ్చు –

సత్య : కరుణాకరం గారు ముగ్గురు బిడ్డల తండ్రి సత్యనాథం గారూ! (భర్త వైపుకు తిరిగి) మీరు మిమ్మల్నందర్నీ ఇటువంటి ప్రమాదంలోకి ఎందుకు లాగుతున్నట్టు?

కరుణా : ప్రమాదం ఏమిటి?

అరుం : (సత్యనాథంతో) ఆయన మిమ్మల్ని కన్నకొడుకులా చూసుకున్నందుకు ఆయనకే ద్రోహం తలపడతారా?

సత్య : (నిర్ఘాంతపోయి) నేనా! నేను!!!

కరుణా : ఏం జరిగింది అరుంధతీ?

అరుం : (మళ్ళీ సత్యనాథంతోనే) మీ ప్రోత్సాహంతోనే ఆయన తన ఉద్యోగం కాస్తా పోగొట్టుకుంటారు. ఆ తరువాత నా పిల్లలు, నేను వీథుల్లో అడుక్కు తినాలి. ఆ వ్యాసం అచ్చువేసి ఆనందించిన మీరూ బావుంటారు, అవతల అధికారులూ బావుంటారు.....మధ్యలో ఆయన్ని పురుగును నలిపినట్టు నలుపుతారు!

కరుణా : అరుంధతీ! నువ్వేం మాట్టాడుతున్నావో నీకు తెలుస్తోందా?వీళ్ళంతా నా స్నేహితులు! నేను కావలను కొనేవాళ్ళు! నా వెనక ధైర్యంగా నిలబడిన వాళ్ళు –

అరుం : కాదండీ....కాదు.....వీళ్ళు మీ స్నేహితులు కాదు....విద్యని అడగండి కావలిస్తే!..ఇందాకటి నుంచి దాని ఘోష అదేనండి!

కరుణా : పొరపాటు అరుంధతీ!.....ఈ విషయానిన పత్రికల్లో వచ్చేట్టు చెయ్యడానికి సత్యనాథం ఉన్నాడు.... నలుగురికీ తెలిసిన తరువాత ప్రజల్లో, చైతన్యం తీసుకురావడానికి శివశంకరం గారున్నారు....

(టేబుల్ మీద ఉన్న కర్రను చూస్తాడు)

**కరుణా :** (దాన్ని చేతులోకి తీసుకుని, సంగతి గ్రహించి, సత్యనాధం, శివశంకరంల వైపు చూస్తాడు) ఏమిటిది? (వాళ్ళు మాట్లాడరు.....అతనికి కోపం వచ్చింది)

ఆయనకి ఇక్కడేం పని?

**శివ** : డాక్టర్‌గారూ! మెల్లగా మాట్లాడండి.....

**కరుణా :** ఏడీ? ఎక్కడున్నాడు? ఎందుకొచ్చాడు ఇక్కడికి?...మీతో మాట్టాడి ఇది అచ్చు పడకుండా చూడ్డానికేనా? (సత్యనాధంతో) మాట్టాడరేం?

(అని వెనక తలుపు తీయబోతాడు)

**శివ** : డాక్టర్‌గారూ! జాగ్రత్త

(కరుణాకరం శివశంకరం వైపు కోపంగా చూస్తాడు....రాజారావు సురేంద్రతో లోపలకు వస్తాడు...రాజారావు బిత్తరపోయాడు.......దాన్ని దాచుకునే ప్రయత్నం చేస్తున్నాడు)

**కరుణా :** (అన్నయ్యతో) నీటిని విషమయం చేశావు......అది చాలలేదు......ఇప్పుడు నీ దృష్టి పత్రికల మీద పడ్డది....ఇహ కలుషితం చెయ్యాల్సింది ప్రజాభిప్రాయాన్నేనా?

**రాజా** : నా చేతి కర్ర ఇటివ్వు......

**కరుణా :** ఛైర్మన్‌గారూ! మీరు కలకాలం ఈ పదవిలో ఉండిపోయేటట్లు ప్రవర్తిస్తున్నారు! ఈ పదవులు తాత్కాలికాలు......మామూలు ప్రజలను ప్రేమించి వాళ్ళకు మంచి చేస్తే కలకాలం మీ పేరు చెప్పుకుంటారు... ఇంకా జనం మాట్టాడ్డం మొదలు పెడితే ఏమవుతుందో ఆలోచించుకోండి.....(శివశంకరం, సత్యనాధంలతో) ప్రజలు నా పక్షాన ఉన్నారు. ఎందుకో తెలుసా? నిజం నా పక్షాన ఉంది కనక........

**శివ** : డాక్టర్‌గారూ! మేము శాస్త్రజ్ఞులం కాదు. మీరు రాసిన విషయాలు నిజమో కాదో మేం ఎట్లా తేల్చగలం?

**కరుణా :** అందుకే నా పేరు మీద అచ్చువెయ్యండి.....దానికి బాధ్యుణ్ణి నేను....నేను సమాధానం చెబుతాను.......

**సత్య** : అది కుదిరేపని కాదండీ......దాన్ని అచ్చు వేసి మా పత్రికకు భ్రసుట పట్టించుకోలేం.

**శివ** : ఇప్పుడు బావులను గురించి, ఏం రాసినా, దాన్ని బావు చేయడానికి కొత్త పన్నులు వేసితీరా లంటున్నారు ఛైర్మన్‌గారు –

**కరుణా :** ఓ! అందుకా అకస్మాత్తుగా – మేం డాక్టర్లం కాదు, మీ మాట నమ్మడం ఎలా అని కొత్త పాట మొదలు పెట్టారు? సరే, కానివ్వండి –

**సత్య** : మీరట్లా నిర్ధారణకి రావద్దు....అసలు విషయం ఏమిటంటే –

**కరుణా :** అసలు విషయం. అసలు విషయం, అసలు విషయం – ఏమిటయ్యా అసలు విషయం? ఛైర్మన్ గారు మిమ్మల్ని బెదిరించారు. ఆ బెదిరింపుకు మీరు లొంగిపోయారు.....అంతేనా?

**సత్య** : అట్లా అనడం భావ్యం కాదు –

**కరుణా :** (శివశంకరంతో) ఈ వ్యాసాన్ని కరపత్రంగా అచ్చు వెయ్యండి......ఎంత ఖర్చువుతుందో అంతా నేను పెట్టుకుంటాను....

**శివ** : డాక్టర్‌గారూ అది నా ప్రెస్‌లో అచ్చు వెయ్యడం కుదరదండీ! అచ్చు వేసి మా పత్రికకి , ఈ ఊరికి

నవ్వుల పాలు చెయ్యలేను....మీ కోసం కాకపోయినా మీ కుటుంబం కోసమైనా ఆ నీళ్ళ సంగతి మరిచిపొండి–

**అరుం :** ఆయన కుటుంబాన్ని గురించి మీకు అంత సానుభూతి ఉన్నందుకు కృతజ్ఞతలు....ప్రపంచంలో ఇంతటి నయవంచకులు కూడా ఉంటారా?

**కరుణా :** నా వ్యాసం ఇటివ్వండి......(తీసుకుంటూ)

**రాజా :** కరుణాకరం! ఆ వ్యాసాన్ని గురించి మరిచిపోయి మామూలుగా నీ ఉద్యోగం చేసుకోలేవా?

**కరుణా :** ఛైర్మన్‌గారూ ఈ పత్రికలో దీన్ని అచ్చు వెయ్యక పోవచ్చు. ఈ వూళ్ళో అచ్చు వెయ్యకపోవచ్చు...నేను జనాన్ని పోగుచేసి ఈ అరాచకాన్ని గురించి నలుగురికీ చెప్పితీరతాను.

**రాజా :** నువ్వు మీటింగ్ పెట్టడానికి చోటు దొరకదు.

**కరుణా :** చోటు దొరక్కపోతే, మెళ్ళో ఒక రండోలు వేసుకుని వీధి వీధికీ తిరిగి మీ బండారం బయటపెడతాను. ఈ ఊళ్ళో నీళ్ళెంత విషపూరితాలో, అధికారం కూడా అంత విషపూరితం అని చాటి చెబుతాను.

**రాజా :** నువ్వెంత కన్న తెగించే పిచ్చివాడివని నాకు తెలుసు.

**కరుణా :** అప్పుడే ఆ బిరుదివ్వకండి ఛైర్మన్‌గారూ! ఇంకా నా గళం విప్పలేదు; నిజం చెప్పలేదు...... అరుంధతీ! (తన చేతిని ఆమె భుజం మీద వేసి దర్పంగా నిష్క్రమిస్తాడు)

(రాజారావు వెడుతూ తన వ్యాసాన్ని సత్యనాధానికి ఇస్తాడు. సత్యనాథం సురేంద్రకి ఇస్తాడు; సురేంద్ర శివశంకరంగారికి ఇస్తాడు. శివశంకరం కంపోజింగ్‌కి ఇవ్వడానికి లోపలికి వెడతాడు.....రాజారావు వెడుతూ వుండగా)

**తెర**

## నాలుగో రంగం

(జానకి రామయ్యగారి ఇంటి ముంగిలి.....వీధి అరుగుమీద జంపఖానాలు పరిచి వుంటాయి....రెండు మూడు పాత కుర్చీలు –)

**సురేం :** జానకిరామయ్యగారూ!

**జానకి :** ఎవరూ? రండి.....ఇక్కడ కుర్చీలు, బెంచీలు లేవు.....వచ్చిన వాళ్ళంతా కింద కూర్చుంటే బావుంటుందనుకున్నాం.

**సురేం :** నా పేరు సురేంద్ర....మీరు నన్ను గుర్తు పట్టినట్టు లేరు.....డాక్టర్ గారింట్లో –

**జానకి :** అవును...పెద్దముండావాణ్ణా, మొహాలు అంత బాగా జ్ఞాపకం వుండవు. అయితే, ఎవరిని చూసినా ఇది వరకెక్కడో చూసిన మొహంలానే అనిపిస్తుంది. అందువల్ల ప్రతివాళ్ళు మనకు తెలిసినవాళ్ళే!.....ఆ గేటు బయట ఉన్నవాళ్ళంతా లోపలికి రారేం?

సురేం : బహుశా ఛైర్మన్‌గారి కోసమో, ఇంకో నాయకుడి కోసమో ఎదురు చూస్తున్నారనుకుంటాను...మీటింగ్ మొదలుపెట్టే ముందు మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలి......మీరు పెద్దలు, స్వాతంత్ర్య సమరయోధులు.....ఈ వూళ్ళో రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు....డాక్టర్‌గారి ఉపన్యాసానికి మీ ఇంటినెందుకు ఉపయోగించుకోనిస్తున్నారు?

జానకి : (నవ్వి) నేను నా పనుల మీద చాల వూళ్ళకి వెడుతూ వుంటాను.....అన్నట్టు నువ్వు కూడా ఊళ్ళు బాగా తిరుగుతుంటావా?

సురేం : ఆ అలవాటు లేదండీ!

జానకి : అవునా? ఎన్ని చోట్లకు వెళ్ళినా, మనకు నచ్చని విషయాలను బహిరంగంగా చెప్పడానికిగాని, అటువంటి అప్రియాలను వినడానికిగాని ఎవ్వరూ ఒప్పుకోరు. పోనీ ఆ సంగతి తెలుసా?

సురేం : అవునవును....

జానకి : అవునా? అది నాకిష్టం లేదు.....అందుకని!

సురేం : మరొక్క ప్రశ్న...ఈ ఊళ్ళో నీటి బావుల్ని గురించి డాక్టర్‌గారి అభిప్రాయమే మీ అభిప్రాయమా?

జానకి : ఆయన అభిప్రాయమేమిటో నాకు తెలియదు...ఇహ అదీ ఇదీ ఒకటేనని ఎట్టా చెప్పను?....కాని ఒకటి మాత్రం నిజం. అబద్ధాలు చెప్పి డాక్టరుగారు బావవుకు తినేదేమీ లేదన్నది మాత్రం స్పష్టం.

(ముగ్గురు పౌరులు కలుస్తారు)

పౌ1 : మీటింగు ఇక్కడేనా?

జానకి : రండి బాబూ! కుర్చీలు లేవు.....అందరం కిందే కూర్చోవాలి...లేకపోతే నిలబడన్నా ఉపన్యాసం వినాలి.......(బయటకు వెడతాడు)

పౌ1 : బాజా బయటికి తియ్యనా?

పౌ2 : ఆగు......ఆయన్ని ఉపన్యాసం మొదలెట్టనీ.

పౌ3 : ఆగేదేంటహె....మోగించరా! (అని అతని బాజా లాక్కుంటాడు)

జానకి : (వస్తూ) ఇక్కడ ఆగడాలు, అఘాయిత్యాలు జరగడానికి వీల్లేదు....తెలుసా?

(అరుంధతీ, విద్య వస్తారు)

రండి, మీరు అట్లా వెనగ్గా కూర్చోండి......ఈ కుర్చీల మీద -

అరుం : అక్కర్లేదు బాబుగారూ...ఏమీ గడబిడ జరగదుగా?

జానకి : అదుగో! నువ్వు మళ్ళీ మొదటికి వస్తున్నావు....అన్యాయాన్ని ప్రతిఘటించే వాళ్ళు అన్నిటికీ సిద్ధపడాలి - అని చెప్పాను.

విద్య : తాతగారూ! వాకిట్లో అంతమంది జనం పోగయ్యారు. ఎవ్వరూ లోపలికి రారేం?

జానకి : వాళ్ళంతా ఛైర్మన్‌గారి కోసం ఎదురు చూస్తున్నారు.

విద్య : వాళ్ళంతా ఆయన మనుషులా?

జానకి : ఏమో? ఎలా చెప్పగలం?

సురేం : (అరుంధతీ, విద్యల దగ్గరకు వచ్చి) నమస్కారమండీ! (తల్లీ, కూతుళ్ళు పెడమొహం పెడతారు) మీరు

నాతో మాట్లాడ్డం లేదని మిమ్మల్ని నిందించను...కాని ఇవ్వాళ మీటింగు లక్షణాలు చూస్తుంటే ఆడవాళ్ళు ఇక్కడ ఉండకూడదనిపిస్తోంది.

విద్య : మిమ్మల్ని మేము సలహా అడిగిన జ్ఞాపకం లేదు.

సురేం : మీరనుకొనేటంత దుర్మార్గుణ్ణి కాదండీ నేను –

విద్య : అయితే మీ పత్రికలో ఛైర్మన్‌గారి ప్రకటన వేశారు కాని నాన్న రాసిన ఒక్క ముక్క కూడా వెయ్యలేదేం? ఆయన చేప్పే దేమిటో ఎవ్వరికీ తెలియదు కదా, తెలియకుండానే ఎందుకున్నారు?

సురేం : మీ నాన్న గారి వ్యాసం ప్రచురించివుంటే, అది ఆయనకి చాలా ప్రమాదకరంగా పరిణమించి ఉండేది.

విద్య : (అతనికి దగ్గరగా పోయి) నేను ఇంతవరకు ఎవరినీ గురించీ ఈ మాట అనలేదు. అది మీ కోసం వ్యర్థం చేస్తున్నందుకు విచారంగా ఉంది. మీ అంతటి పచ్చి అబద్ధాల కోరును నేను ఇంతవరకు చూడలేదు. (ఒక్కసారిగా 3వ పౌరుడు బాజా ఊదుతాడు. ఆడవాళ్ళిద్దరూ ఉలిక్కిపడతారు...సురేంద్ర, జానకి రామ్య వెనక్కి తిరిగి చూస్తారు)

(రాజారావు వస్తాడు......వస్తూనే అరుంధతీ, విద్యల దగ్గరకు వస్తాడు)

రాజా : అరుంధతీ! మీరు కూడా వచ్చారా?

విద్య : అంతా మీ చలవే పెదనాన్నగారూ!

రాజా : నాదేముంది? మీ నాన్నే కదా మీటింగు కావాలన్నాడు....దానికోసం ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు! (అవతల వైపుకు వెళ్ళికూర్చున్నాడు)

(ఒక తాగుబోతు వస్తాడు)

తాగు : అపనా తనా మనా.......ఏంది ఈ జనం? ఇంతమంది ఒక సోట కూడ్నారంటే ఎవణ్ణో మర్డర్ అన్నా చేసుండాలి...లేదా ఎలచ్ఛన్లే అయివుండాలి.....

పౌ2 : రెండు మర్డర్లే! ఒక చోట మనిషి మర్డర్, రెండో చోట ప్రజాస్వామ్యం మర్డర్.....అంతే తేడా!

తాగు : అయితే యిక్కడ ఎలచ్ఛన్లేనా?.....ఎవరు నుంచున్నారు? నా ఓటేవరికి? కిందటిసారి ఎలచ్ఛన్లో చేర్మన్‌గారికి ఓటేస్తే ఆయునగోరు యాభై రూపాయులు, నాలుగు బుడ్లు సారా యిచ్చినాడు.....దరమాత్ముడు..మరి ఇప్పుడు నుంచునే దెవరు?

రాజా : ఒరే తాగుబోతు వెధవా!.......బయటకు నడు –

తాగు : నడుత్తానండీ! అట్లాగే నడుత్తా....తాగినోడు ఓటెయ్యగూడదని ఎక్కడ రాసుందో చెప్పండి –

జానకి : ఎక్కడా లేదు గాని నువ్వు వెళ్ళు.

తాగు : నే ఎళ్లను....ఓటేసి కాని ఎల్లను......యాబయ్ రూపాలయు, నాలుగు బుడ్లు యిస్తావుంటే ఓటెయ్యని ఎదవ నాయాలు ఎక్కడన్నా వుంటాడా? నేను.......జెంటిల్‌మెన్‌ని....ఓటేసే పతి నాయాలూ జెంటిల్‌మెనే నండీ –

(శివశంకరం వచ్చి, అటూ ఇటూ చూసి రాజారావు దగ్గరకు వెడతాడు)

శివ : ఛైర్మన్‌గారూ (అని గుమ్మం వైపు చూపుతాడు.....డాక్టర్ కరుణాకరం వస్తాడు....వెంట ఓ గుంపు)

కరుణా : (అందరి వంకా చూసి, దూరంగా వున్న వాళ్ళతో) అందరూ కొంచెం దగ్గరకు రండి....కుర్చీలు లేవు...."కూర్చుండ మా యింట కుర్చీలు లేవు, హృదయాంకమే అంక పీఠమంతు" అన్నాడు కవి.......ఎక్కువ సేపు మిమ్మల్ని శ్రమపెట్టను.....నేను చెప్పే ఈ నాలుగుమాటలూ మీకు చెప్పడానికి నాకు ఈ ఊళ్ళో చోటు దొరకలేదు....అందువల్ల హంగులూ లేని జానకరామయ్యగారి ముంగిట్లో ఈ సమావేశం ఏర్పాటు చేశాను....ఓ! ఛైర్మన్‌గా రొచ్చారే!......

రాజా : అమ్మమ్మ! ఈ మీటింగ్‌కి రాకపోతే ఎలా?

అరుం : (భర్త దగ్గరగా వచ్చి) అనవసరంగా ఉద్రేకపడరు కదూ?....(కరుణాకరం నవ్వి ఆమె చేతుల మీద మెల్లగా చరుస్తాడు, ఓదార్పుగా)

తాగు : (మళ్ళీవస్తూ) ఇక్కడ ఓటింగు కాకపోతే ఇంతమంది జనం ఎందుకు చేరినట్టు? అందరికీ ఓటెయ్యడానికి డబ్బులిచ్చి నాకెగస్తారాయేం? కబర్‌దార్!

రాజా : బయటకు నడుస్తావా? మెడపెట్టి గెంటమంటావ్?

తాగు : మెడబుట్టుకు గెంటుతావ్? ఏదీ, గెంటు, చూద్దాం....నే వెళ్ళి ఛైర్మన్‌గారితో చెప్పి నిన్ను జైల్లో పెట్టిస్తా! ఛైర్మన్‌గారు నా స్నేహితుడు. ఛైర్మన్ ఈజ్ మై ఫ్రెండ్.....నాకు యాభై రూపాయలు, నాలుగు బుడ్లు ఇప్పించాడాయన......ధర్మప్రభువు....

(అందరూ నవ్వుతూ అతన్ని వెనక్కు తోస్తారు)

కరుణా : (స్టేజీ ఎక్కి) సోదరులారా! దయచేసి నిశ్శబ్దంగా ఉండండి....ఇవాళ – మనందరి జీవితాలకు సంబందించిన ఒక ముఖ్య విషయాన్ని గురించి మీకు చెప్పాలి –

శివ : ఈ మీటింగ్ అధ్యక్షణ్ణి ఎన్నుకోలేదు డాక్టర్‌గారూ!

కరుణా : శివశంకరంగారూ! ఇది పబ్లిక్ మీటింగ్ కాదు.....నేను చెప్పే నాలుగు మాటలు వినవలసిందని నేను పిలిచిన ప్రయివేటు మీటింగు –

పౌ1 : ఏ మీటింగ్ అయితేనేం? ఇక్కడేం అవకతవకలు జరక్కుండా చూడ్డానికి అధ్యక్షుడు ఉండాల్సిందే!

కరుణా : ఇక్కడ అవకతవకలు ఎందుకు జరుగుతాయ్?

పౌ2 : ఆయన్ని మాట్లాడనివ్వండి.....ఏదో చెబుతానని పిలిచాడుగా?

పౌ3 : ఛైర్మన్‌గారూ! మీరు అధ్యక్షులుగా ఉండి కార్యక్రమం నడిపించండి....

కరుణా : ఆగండాగండి –

పౌ1 : ఇక్కడ అభిప్రాయ భేదాలున్నట్టు కనిపిస్తోంది.....అందువల్ల ఎవరో ఒకరు అధ్యక్షుడుగా ఉండాల్సిందే?

కరుణా : అప్పుడే అభిప్రాయ భేదాలా? ఇంకా నా అభిప్రాయం ఏమిటో ఒక్క మాట కూడా మాట్లాడలేదు!

పౌ3 : నీ అభిప్రాయాలన్నీ మాకు తెలుసులేవయ్యా! అధ్యక్షుడక్కర లేకపోతే నీ యింటో మీటింగు పెట్టుకో–

కరుణా : మీటింగు పెట్టింది నేను.....నన్ను గురించైనా రెండు ముక్కలు మాట్లాడనివ్వండి...

పౌ1 : నిన్ను గురించి మాకు తెలుసు.

కరుణా : ఏం తెలుసు? ఈ వూళ్ళో పత్రికలు రాసినవా? నాకు ఈ ఊరంటే ఇష్టం లేదని వాళ్ళు రాస్తే మీరు నమ్మడమేనా?

(చేతిలో కాగితాలు ఊపుతూ)

నేను ఇక్కడి మనిషిని – మీ మనిషిని –

రాజా : ప్రజాస్వామ్యంలో అధ్యక్షుడంటూ లేకుండా మీటింగేమిటి?

పౌ4 : ఛైర్మన్ గారే అధ్యక్షుడుగా ఉండాలి...(కొంతమంది "అవును, అవును" అని అరుపులు)

రాజా : ఒద్దు, ఒద్దు – అది సవ్యమైన పని కాదు...మన శివశంకరంగారు తటస్థుడు...ఆయన్ని అధ్యక్షుణ్ణి చేద్దాం –

పౌ2 : నేను మీటింగు వినడానికి వచ్చాను...అధ్యక్షుడు అక్కర్లేదు....

పౌ3 : ఏయ్! మాట్లాడకు బే.....ఒళ్ళేం తీటగా ఉందా?.....నేను శివశంకరంగారు అధ్యక్షుడుగా ఉండాలని బలపరుస్తున్నాను.

("అవును", "అవును" "శివశంకరంగారు అధ్యక్షుడుగా ఉండాలి" అంటూ జనం కేకలు)

కరుణా : సరే! సరే! మీ అందరి ఇష్టమూ అదే అయితే అలానే కానిద్దాం.....నేను మీకు ఒక ముఖ్యమైన విషయం గురించి చెప్పడానికి ఇక్కడికి రావలసిందిగా కోరాను....ఆ విషయాన్ని పత్రికల వాళ్ళు రాయడానికి నిరాకరించారు..నా కెక్కడా వేదిక దొరకకుండా చేశారు....ఇక్కడ నేను ఏర్పాటు చేసిన ఈ సభలోనన్నా – నాకు మాట్టాడడానికి అవకాశం యిస్తారని ఆశిస్తున్నాను....

(శివశంకరం స్టేజీమీదకు వెడతాడు...ఎవరో ఒక కుర్చీ తెచ్చి వేస్తారు....ఈలోగా పరంధామయ్య వచ్చి ఒక పక్క నిలబడతాడు)

శివ : సోదర సోదరీమణలారా! ఈ సభ ప్రారంభం కావడానికి ముందు ఒక మాట చెప్పాలి...ఇవ్వాళ ఇక్కడ ఎవరు ఏం చెప్పదలుచుకున్నా పౌరనీతిలో ప్రప్రధమ పాఠం – మితంగా వ్యవహరించడం – మోడరేషన్ – అదీ మన ఆశయం.....ఇప్పుడు సభా కార్యక్రమం....మాట్లాడదలుచుకున్న వాళ్ళెవరో –

తాగు : (అందర్నీ తోసుకుంటూ వచ్చి) ఓట్లేసే చోట ఉపన్యాసాలేంటంట? నా ఓటేక్కడో చెప్పండి...ఎవరు నుంచున్నా సరే, ఛైర్మన్ గారికేనా ఓటు....ఎందుకో తెలుసా? యాభై.......

పౌ1 : వాణ్ణి లాగెయ్యండి....పవిత్రమైన ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తున్నాడు....(ప్రజలు నవ్వులు, అరుపులు)

పౌ3 : వాణ్ణి లాగెయ్యండి.....(కేకలు,అరుపుల మధ్య వాణ్ణి లాగేస్తారు)

శివ : నిశ్శబ్దం....అందరూ నిశ్శబ్దం...ఎవరు – మాట్లాడదలుచుకున్న వాళ్ళు?

(డాక్టర్ కరుణాకరం చేయి ఎత్తి స్టేజీ దగ్గరకు వస్తూ వుంటాడు)

రాజా : (ఈలోగానే) అధ్యక్షుల వారు –

శివ : అరుగో – పూజ్యులు మున్సిపల్ ఛైర్మన్ రాజారావు గారు ఇప్పుడు మాట్లాడతారు...(రాజారావు వంక నిశితంగా చూసి కరుణాకరం వెనక్కు వస్తాడు)

రాజా : (స్టేజీ ఎక్కి) సోదరులారా! ఇవ్వాళ మన ముందున్న సమస్యను స్వార్థపరులు కొందరు మన ఊరిని

నవ్వుల పాలు చెయ్యడానికే పుట్టించారని ఈ సరికి మీకందరికి తెలుసు ననుకుంటాను. డాక్టర్ కరుణాకరం – ఆయన నా తమ్ముడని చెప్పడం నాకు చలా బాధగా ఉంది – కాని, పట్టణ ప్రజల సమస్యలు వచ్చినప్పుడు ప్రజా ప్రతినిధినైన నాకు బంధువులు, స్నేహితులు అన్న భేదంభావం ఉండకూడదు కనుక – మా తమ్ముడయినా సరే – డాక్టర్ కరుణాకరం – మన కందరికీ గర్వకారణమైన, మన ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన నీటి బుగ్గల్ని, దానని నిర్వహిస్తున్న పట్టణ ఆరోగ్య సంస్థని సమూలంగా నాశనం చెయ్యడానికి పూనుకున్నాడని చెప్పడానికి విచారిస్తున్నాను.

కరుణా : అన్నయ్యా –

శివ : ఛైర్మన్‌గారిని మాట్లాడనివ్వండి....ఎవ్వరూ ఆయన మాటలకి అడ్డం రూకూడదు.

రాజా : ఈ మాటలు చెప్పడానికి ఆయన ఎన్ని చిలవలు పలవులు కల్పించినా నిజం మాత్రం అది. మనల్ని, మన వూరిన బయట ప్రపంచంలో నవ్వుల పాలు చేద్దామనే ఆయన సంకల్పం –

పౌ 3 : అయితే ఊళ్ళో నించి తరిమెయ్యాలి గాని, ఈ ఉపన్యాసాలెందుకండీ?

(జనంలో కోలాహలం....అవును......అవును)

రాజా : ఆగండి....మన వూళ్ళో అనవసరమైన పోట్లాటలు, హింసాకాండ నా కిష్టం లేదు...మనది శాంతియుత సహజీవనాన్ని సాధించిన మహత్తరమైన పట్టణం. అధికారంలో ఎవరు ఉన్నా గిట్టని డాక్టర్ కరుణాకరం లాంటివాళ్ళు, ఆ అధికారాన్ని నాశనం చెయ్యాలని సంకిల్పించారు.....ఆ బావుల్లో ఏదో లోపం ఉందని చెప్పి ప్రజల్లో అశాంతిని, అనుమానాన్ని లేవగొట్టి, ప్రజా ప్రభుత్వాన్ని పడగొట్టాలని పన్నాగం పన్నారు వీళ్ళు –

కరుణా : నేను మాట్లాడవచ్చా?

శివ : ఛైర్మన్‌గారు ఇంకా మాట్లాడుతున్నారు కదండీ!

రాజా : డాక్టర్‌గారు తమ యిష్టప్రకారం మాట్లాగవచ్చని మీలో కొందరు అనుకోవచ్చు...ఇది ప్రజాస్వామ్యం కనక అందరికీ మాట్లాడే హక్కు ఉంది. కాని శాంతిని భగ్నంచేసి విప్లవాన్ని , అధికార ధిక్కారాన్ని పురికొల్పే ఏ ఉపన్యాసమో ఇక్కడ చెబితే, దాని వల్ల హింసాకాండ చెలరేగితే, దానికి బాధ్యులెవరు?

కరుణా : నువ్వు మాట్లాడుతున్న దానికేమన్నా అర్థం ఉందా?

శివ : డాక్టర్‌గారూ –

కరుణా : అవునండీ! మీటింగ్‌కి పిలిచిన వాణ్ణి నేను.....ఆయన్ని బొట్టు పెట్టిపిలిచి నాకు వ్యతిరేకంగా మాట్లడ్డానికి పిలిచానా వీళ్ళందర్నీ? ఆయనకి పత్రికలున్నాయి. ఊళ్ళో ఎన్నో వేదికలున్నాయి. బలగం వుంది, అధికారముంది. ఎక్కడయినా ఎప్పుడయినా మాట్లాడే అవకాశం ఉంది. ఈ సాయంకాలం నాకు మాట్లాడే వేదిక ఇది ఒక్కటే!

శివ : డాక్టర్‌గారూ! మరొకరు మాట్లాడుతూ వుండగా అడ్డురావడం సభ్యత కాదు.

(అందరూ ఊరుకో, ఊరుకో మాట్లాడకు – కూర్చో అని కేకలు...డాక్టర్ నిశ్చేష్టుడౌతాడు.)

మీరు కానివ్వండి ఛైర్మన్‌గారూ!

రాజా : నేను ఇంతవరకు మిమ్మల్ని హెచ్చరిస్తున్నది సరిగ్గా దీన్ని గురించే! ఇది మనకందరికీ కష్టకాలం.

మనం అన్ని రకాల పురోభివృద్ధిని సాధిస్తుంటే చూడలేక కొన్ని దుష్టశక్తుల పన్నాగం యిది...కొద్ది రోజుల్లోనే మన వూరు కళకళ లాడుతూ వుంటుంది..ఇక్కడ వున్న ప్రతి ఒక్కరూ – మన బావుల పుణ్యమా అని – ఇంకా ఇంకా భాగ్యవంతులు అవుతారు...మేడలూ, మిద్దెలూ కడతారు..ఇక్కడికి పెద్ద కాన్వెంటు, కాలేజీ వస్తాయి. ప్రపంచంలోనే మనవూరు ప్రఖ్యాత ఆరోగ్య కేంద్రంగా ఏర్పడడానికి సన్నాహాలు జరుగుతున్న ఈ తరుణంలో ఏదో కొద్ది లోపాలున్నాయని, మనం నిలబడ్డ చెట్టునే మనం నరుక్కుంటామా?

(అసంభవం, దుర్మార్గం......అని అరుపులు)

ఇదంతా ఒక్క మనిషి – విజ్ఞాన శాస్త్రం పేరుతో – కుతంత్రం చేస్తూ వుంటే మనమంతా ఏం చెయ్యాలి? గాజులు తొడిగించుకు కూర్చోవాలా – నువ్వట్లా అనడానికి వీలు లేదు – అని నిక్కచ్చిగా చెప్పాలా?

(అవును...చెప్పాల్సిందే...మాట్లాడనివ్వకండి...అని కేకలు)

**పౌ 1** : ఇంకా ఎవ్వరూ మాట్లాడక్కర్లేదు.

**పౌ 3** : ఆ డాక్టర్‌ని మాట్లాడనివ్వకండి.

**రాజా** : ఆగండి...ఆగండి.....మనం ఏం చేసినా శాంతి యుతంగా, మర్యాదగా చేయాలి.

**విద్య** : అవును! పీకలు కోసని సరే –

**శివ** : ఎవరది? ఎవరు?

**రాజా** : ఇటువంటి చిన్న చిన్న అరుపులకి, బెదిరింపులకి మనం భయపడకూడదు...మనం అందరం ఈ విషయంలో ఒక ఏకాభిప్రాయానిక వచ్చాం కనుక డాక్టర్ కరుణాకరం ఈ సభలో ఉపన్యసించకూడదని ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నాం.....(చప్పట్లు, ఈలలు, అవును, అవును – వగైరా)

**కరుణా** : (స్టేజీ దగ్గరకు వచ్చి) ఇదేం అన్యాయమండీ!

**శివ** : ఇది అధిక సంఖ్యాకుల అభిప్రాయం....ఇది ప్రజాస్వామ్యానికి విజయం! దీన్ని గురించి ఇంకా ఓటింగ్ పెట్టాలా? (అక్కర్లేదు...అక్కర్లేదు.....కేకలు)

**జానకి** : (స్టేజీ దగ్గరకు వచ్చి, అధ్యక్షుడితో) నన్ను రెండు ముక్కలు మాట్లాడనిస్తారా?

**శివ** : అయ్యా! జానకిరామయ్యగారూ! మీరు –

(మాట్లాడన్వండి – మాట్లాడనివ్వండి – అని కేకలు)

**రాజా** : ఇంకా ఎవరైనా మాట్లాడేదేముందండీ?

**జానకి** : నేను మీ పరస్పర భేదభావాలకి కారణమైన బావుల్ని గురించి మాట్లాడను. ఒక విజ్ఞాపన చేసి దిగిపోతాను.

(మాట్లాడనివ్వండి – తాతగారిని మాట్లాడనివ్వండి...అని అరుపులు)

: (అయిష్టంగా) సరే! జానకి రామయ్యగారు మాట్లాడతారు...చాలా కాలాతీతం అయింది కనుక రెండు నిమిషాల్లో ముగిస్తారు.

జానకి : (వేదికనెక్కి) మహాజనులారా! నేను ఈ వూరికి పాతకాపునన్న విషయం మీకందరికి తెలుసు...మా రోజులు వెళ్ళిపోయాయి...ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించడానికి మేము పోరాడిన పోరాటం ఇప్పుడు సత్ఫలితాలనిస్తున్నది...ఇక్కడ చేరిన పెద్దలూ, పిన్నలూ మరోసారి రుజువు చేశారు.

నేను రాజారావుగారిని, వారి తమ్ముడు కరుణాకరంగారిని – ఇద్దరినీ ఎరుగుదును. మీరందరూ కూడా వారిని ఎరుగుదురు. దీనిని నేను వారి వ్యక్తిగత వివాదంగా భావించడం లేదు....మన ఛైర్మన్‌గారు తమ అభిప్రాయం చెప్పారు...ప్రజాస్వామ్యం అంటే ఒక సమస్యను రెండు వైపులనుంచీ ఆలోచించి ఎక్కువ మందికి అనుకూలమైన పద్ధతిలో దానిని పరిష్కరించడం...అవునా? అటువంటప్పుడు...ఒకే వ్యక్తి మాటలు విని – ఆ వ్యక్తి ఛైర్మన్‌గారయినా సరే – దానిమీద ఆధారపడి నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య పద్ధతికే గొడ్డలిపెట్టు. ఈ వివాదంలో ఎవరిది ఒప్పు, ఎవరిది తప్పు – అని నేను చెప్పబోవడం లేదు. కాని రెండో వ్యక్తి చెప్పేది కూడా విని, సమస్యకు రెండో వైపు ఉన్న అభిప్రాయాలు విని మీ ఇష్టం వచ్చిన విధంగా దాన్ని పరిష్కరించుకోమని మాత్రమే మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. (అని నమస్కరించి దిగిపోతాడు)

(అవును..... డాక్టర్‌గారిని మాట్లాడనివ్వండి...ఏం మాట్లాడతారో చూద్దాం....అని జనం కేకలు)

శివ : (చుట్టూ చూస్తాడు. చేసేది లేక) డాక్టర్ కరుణాకరం గారూ –

కరుణా : (వేదిక మీదకు వచ్చి)

మిత్రులందరికీ నమస్కారం! అసలు విషయాన్ని గురించి మాట్లాడేముందు ఒక చిన్న మనవి. ఈ ఊళ్లో పీడిత వర్గాల తరఫున పోట్లాడుతూ, వాక్స్వాతంత్ర్యం కావాలని ఇన్నాళ్ళు ఘోషిస్తున్న మన మిత్రులు సత్యనాథం గారు, ఇతరులు ఇవ్వాళ ఇంతటి సంయమనాన్ని అలవరుచుకోగలిగినందుకు వారిని అభినందిస్తున్నాను...

సత్య : నా పాఠకుల్లో ఎక్కువమంది మీరు చెబుతున్న దానికి వ్యతిరేకులయితే వాళ్ళకు వ్యతిరేకంగా పొమ్మంటారా నన్ను?

కరుణా : సరిగ్గా నేను చెప్పదలుచుకున్న మాటల్నే సత్యనాథం గారు చెప్పారు....మనిషి ఇవ్వాళ ఈ దశకు ఎట్లా ఎదిగాడు? మీకు తెలుసు, రాతి యుగం మనిషిని గురించి. అనాగరికుడై, దొరికింది తిన్నాడు. కాని రాను రాను తన వస్తువుల్ని తాను తయారు చేసుకోవడం మొదలు పెట్టాడు. ఇళ్ళు కట్టుకున్నాడు...బట్టలు వేసుకుంటున్నాడు...పనీ పాటా చేసుకుంటున్నాడు....ఇంతటిలో మనిషి ఎదిగినట్టేనా? కాదు...... మంచి చెడులను విమర్శనాత్మకంగా చూడడం మొదలు పెట్టాడు. తనకు ఇది మంచి, ఇది చెడు అని తెలుసుకున్నాడు. అట్లా ఆలోచించ గలిగిన వాడే మనిషి......అట్లా మనిషులుగా తయారు కావడానికి మనం ప్రయత్నం చెయ్యాలి...అటువంటి ప్రయత్నమే ఈ వూరి బావుల్లోని నీళ్ళను గురించిన నా నిర్ణయం –

రాజా : వాటిని గురించి మాట్లాడే హక్కు నీకు లేదు –

(అవును...ఉపన్యాసం ఆపు....బావుల్ని గురించి మాట్లాడకు – అంటూ కేకలు)

శివ : ప్రజలు వద్దంటున్న విషయాన్ని గురించి మీరు మాట్లాడితే, మీ ఉపన్యాసం ఆపించి ఓటింగ్ తీసుకోవాల్సి

ఉంటుంది. అత్యధిక సంఖ్యాకులు మీరు మాట్లాడ్డం కుదరదంటే, మీ ఉపన్యాసం విరమించాలి.

**కరుణా :** సరే! నేను ఈ వూళ్ళో బావుల్ని గురించి, అందులో నీటిని గురించి మాట్లాడను....సరా?

**శివ :** అయితే, ఉపన్యాసం తొందరగా తెమల్చండి –

**కరుణా :** సోదరులారా! మీకు తెలుసు...ఇది నా ఊరు..ఇక్కడ పుట్టాను...ఇక్కడే పెరిగాను...దేశవిదేశాలు తిరిగాను...మళ్ళీ ఇక్కడికి ఎందుక వచ్చాను? ఈ వూరి వాళ్ళకి, నా సోదరీ సోదరులకు నేను చదివిన చదువు, నా పరిశోధన ఉపయోగించాలని....ఈ ఊరొచ్చాక – జీత భత్యాలు లేకుండా ఈ వూళ్ళో నీళ్ళను గురించి పరిశోధన చేశాను. ఇక్కడికి పై కొండలమీది నించి వచ్చే జలధారలో క్రిమిసంహారకాలున్నాయని, ఈ నీళ్ళు ఆరోగ్యానికి మంచివని, ముఖ్యంగా కొన్ని దీర్ఘవ్యాధులకు ఇందులో ఔషద గుణాలున్నాయని రిపోర్టునిచ్చాను. ఈ ఊరు గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందాలని ఆశించాను. ఈ నీటిని గురించి ఎన్నో జాతీయ పరిశోధనా పత్రికల్లో వ్యాసాలు రాశాను.....ఛైర్మన్‌గారు చెప్పినట్లు ఇక్కడ మేడలు, మిద్దెలు కట్లాటని ,ఇంటి కొక కారు కావాలని కాదు....ఇక్కడి నీళ్ళతో దేశం నలుమూలల్లో వ్యాధులతో మగ్గుతున్న జనం ఇక్కడికి వచ్చి తేరుకుంటారని, దేశానికి ఆరోగ్యాన్ని ప్రసాదించే మానవతా ధ్యేయంతో ఈ బావుల్ని నిర్మించాలనుకున్నాను.....దాని గురించి ఏమీ మాట్లాడడానికి వీలులేదని అధ్యక్షులవారు ఆదేశించారు. అధిక మెజారిటీ అక్కర్లేదంటే నేను మాట్లాడకూడదని కూడా సెలవిచ్చారు....కాని ఆ అధిక సంఖ్యాకులకు నిజం తెలియద్దా? వాళ్ళు నన్ను దిగిపొమ్మని ఆదేశించినప్పుడు నేను చెప్పినదాన్లో తప్పేమిటో మరీ చెప్పి నన్ను దిగిపోమ్మనాలి.......అదే పూజ్యులు జానకి రామయ్యగారు చెప్పిన దానిలో సారాంశం

అధిక సంఖ్యాకులు చెప్పిన మాట జవదాటకూడదు...నిజం. నేను జవదాటను...కాని ఏ అధిక సంఖ్యాకులు? విషయం తెలుసుకున్న వాళ్ళు....సమస్యని అర్థం చేసుకున్న అధిక సంఖ్యాకులు...అధిక సంఖ్యాకులు అనాలోచితంగా అరిస్తే అదే నిజమవుతుందా?

ఏసుక్రీస్తును శిలవ వేసినప్పుడు అధిక సంఖ్యాకులు ఆమోదించలేదా? గలీలియో భూమి గుండ్రంగా ఉందని చెబితే ఆ అధిక సంఖ్యాకులే అతన్ని కుక్కను తరిమినట్టు తరిమికొట్టలేదా? మెజారిటీ సరైన పనులు చేసినప్పుడే, సరైన నిర్ణయాలు తీసుకున్నప్పుడే – అది నిజమైన మెజారిటీ –

**సత్య :** ఈయన మన ప్రజాస్వామ్యాన్నే కాదంటున్నాడు...ఇహ ఆయనను మాట్లాడనివ్వకూడదు....

**కరుణా :** నేను – నేను ప్రజాస్వామ్యాన్ని కాదంటున్నానా?....ఎవరు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారో కాలమే నిర్ణయిస్తుంద....

(ప్రజల వైపు తిరిగి) నా కొక్క విషయం చెప్పండి..మన సైనికులున్నారు...దేశం సరిహద్దుల్లో గస్తీ తిరుగుతున్నారు. శత్రువుల స్థావరం కనిపెట్టి వారిని ఎదుర్కోవడానికి ఒక దారి వెంట వెడుతున్నారు. ఆ దారిన వెడితే శత్రువును తేలిగ్గా జయించవచ్చని వాళ్ళలో ప్రతి ఒక్కడూ ఉత్సాహంగా ఉన్నాడు. కాని ఆ దారికి ఎగువన కాపలా కాచే ఓ సైనికుడు ఉన్నాడు....ఓ సెంట్రీ – శత్రువులు మన సైనికుల్ని మట్టుపెట్టడానికి అక్కడ బాంబులు పెట్టారని అతనికి తెలుసు...అతని ఒక్కడికే తెలుసు – అతను సెంట్రీ కనుక – అతను పరిగెత్తుకుంటూ వెనక్కు వచ్చి తన ఇతర సైనికులతో వాళ్ళు వెళ్ళే దోవలో డైనమేట్ ఉందని చెబుతాడు. వీడికేం తెలుసులే అని ఆ సైనికులు అతని మాటల్ని

తోసిపారేస్తారా? అతని సలహా ప్రకారం ఆ డైనమేట్‌ను తీసేసి ముందుకు సాగిపోతారా? ఆ సెంట్రీకి తాను చూసింది నిజమనే నమ్మకం ఉంటే మెజారిటీ సైనికులకు తాను గ్రహించింది చెప్పి, వాళ్ళను హెచ్చరించడం తప్పా?

నాకు తెలుసు...మళ్ళీ ఇదంతా కట్టించడం అంటే బోలెడు ధనం కావాలి. చాలామందికి కొన్నాళ్ళ పాటు కష్టం కలుగుతుంది. కాని అంత మాత్రాన ఈ నీటి పథకాన్ని –

రాజా : దానిని గురించి ఆయన మాట్లాడడానికి వీలులేదు....

పౌ1 : ఔను మాట్లాడకూడదు.......(అవును....అవును...అంటూ పెద్ద కోలాహలం)

పౌ3 : మరోసారి ఈ ఊరి నీళ్ళను గురించి మాట్లాడితే ఈ గోడ అవతలకు గిరాటు వేస్తాను. జాగ్రత్త!

కరుణా : (గొంతు హెచ్చించి) సోదరులారా! ఈ బావుల్లో ఉన్న నీళ్ళు విషపూరితమని నేను మీ అందరిముందు నిరూపిస్తాను.

పౌ3 : (స్టేజీ ఎక్కి) చెప్పింది నీకు కాదు?

కరుణా : నన్ను సొంతం చెప్పనివ్వండి....

పౌ1 : మాట్లాడకు.

పౌ4 : ఆయన్ను కిందికి లాగండి.

పౌ1 : మాట్లాడనని మళ్ళీ అదే విషయం మాట్లాడుతున్నాడు.

శివ : ఆగండి.....అందరూ కూర్చోండి...సభ అయిపోవచ్చింఇ....తీర్మానం...

కరుణా : మీ యిష్టం వచ్చిన తీర్మానం చేసుకోండి...ఓటింగ్ పెట్టండి...కాని ఇక్కడి నీళ్ళు విష పూరితాలని మరోసారి చెబుతున్నాను. దయచేసి ఆ నీరు అలానే తాగకండి....నన్ను నమ్మండి....నేను మీకు నిరూపించి చూపిస్తాను.

(వద్దు....వద్దు...దిగి....దిగు....మాట్లడకు.....లాగండిరా, కిందికి – అంటూ కేకలు)

కరుణా : ఇక్కడ మాట్లాడడానికి వీలులేకపోతే ఇంకోవూరి పోయయినా సరే, నేను నిజాన్ని చెప్పితీరతాను.... ఇక్కడి ప్రజల్ని రోగగ్రస్థుల్ని కానివ్వను....

రాజా : అధ్యక్షా! ఆయన్ని మాట్లాడనివ్వకండి.....దిగపొమ్మని చెప్పండి.....

(దిగాలి..దిగాలి....మాట్లాడకు...మాట్లడకు......... దిగిపో – అంటూ కేకలు)

సత్య : మన వూరు బయట తలెత్తు కోకుండా చేస్తాడాయన......మనల్నందరినీ నాశనం చేస్తే కాని నిద్రపోడు.

కరుణా : పతనమైన మీ నైతిక జీవనం మీద ఈ ఆరోగ్య సంస్థను కట్టారు మీరు. ఇది వేళ్ళదగ్గరే పుచ్చి పోయిందని నేను చెబుతున్నాను. దీన్నఇ సమూలంగా –

(ఆగు, ఆగు అంటూ అరుపులు)

(ఇంతలో ఒక రాయి వచ్చి కరుణాకరం కణతన తగులుతుంది..."అబ్బా" అంటూ కరుణాకరం కూర్చుండి పోతాడు. జానకిరామయ్య, అరుంధతి, విద్య ఆయనను కిందికి దించుతారు)

(ఈయన ప్రజావిరోధి....ద్రోహి......ప్రజావిరోధి.....ప్రజావిరోధి.....అరెస్టు చేయించండి....అంటూ

అరుపులు...కేకలు....)

శివ : ఈ సభలో అత్యధిక మెజారిటీ పక్షాన ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నాను. ఇక్కడ చేరిన దేశభక్తి పూరితులైన అత్యధిక ప్రజానీకం ఈ వూరి ఆరోగ్య సంస్థలో డాక్టరుగా ఉంటున్న కరుణాకరాన్ని దేశద్రోహిగా, ప్రజావిరోధిగా తీర్మానించాయి........

(అవును.....అవును...ప్రజావిరోధి, ప్రజా విరోధి.....అంటూ కేకలు)

అరుం : ఆయన ప్రజావిరోధా? ఈ వూరిని యీ ప్రజల్ని ఆయన ప్రేమించనంతగా ఎవరైనా ప్రేమించగలరా?

జానకి : తమను ప్రేమిస్తున్నదెవరో, దగా చేస్తున్నదెవరో తెలుసుకోలేని మూఢులమ్మా వాళ్ళు....వాళ్ళను తప్పుపట్టకు –

కరుణా : (బిగ్గరగా) అజ్ఞానం......అదీ మనల్ని ఆవరించిన పెద్దరోగం....అది పోనిదే దేశం బాగుపడదు.

శివ : ప్రజావిరోధి అయిన కరుణాకరాన్ని ప్రజలంతా అదే విధంగా చూస్తారని ఆశిస్తూ ఈ సమావేశాన్ని ముగిస్తున్నాను.....

(చప్పట్లు, ఈలలు..........)

అరుం : ఇంటికి వెడదాం పదండి......

కరుణా : బాబుగారూ! మీకు కూడా శ్రమయిచ్చాం –

జానకి : భలేవాడివే! నేను ఇన్నాళ్ళుగా నమ్మిన దానిని ఇవ్వాళ్టి సంఘటనలు బలపరిచాయి....జనం విజ్ఞానవంతులు కానిది వాళ్ళకి విచక్షణా జ్ఞానం వుండదు...విచక్షణా జ్ఞానం లేని దేశంలో ప్రజాస్వామ్యం నిలవలేదు... విచక్షణా జ్ఞానం లేనివాడు మనిషే కాదు –

(అరుపులు, కేకలు....ప్రజా విరోధి – అంటూ)

అరుం : అటు వెనక గుమ్మంలో నుంచి వెడదాం అండీ!

కరుణా : దొడ్డి గుమ్మంలోంచి పారిపోయేటంత తప్పు మనమేం చెయ్యలేదు అరుంధతీ!

(కరుణాకరం, అరుంధతీ, విద్య, జానకిరామయ్య వెడుతూ వుండగా జనం అటూ ఇటూ చేరి "ప్రజావిరోధి, ప్రజాద్రోహి" అంటూ నినాదాలు చేస్తూనే వుంటారు....తల ఎత్తుకు వెడుతున్న కరుణాకరం మొహంలో ఏదో దృఢనిశ్చయం స్ఫుటంగా కనిపిస్తుంది.)

తెర

## అయిదో రంగం

(డాక్టర్ కరుణాకరంగారి ఇంటి లోపలి భాగం....ఇల్లంతా చిందర వందరగా ఉంది. ఇంటినిండా రాళ్ళు.....పగిలిన గాజు ముక్కలు...కరుణాకరం ఇంట్లో రాళ్ళను ఏరుతూ వుంటాడు)

కరుణా : అరుంధతీ! పని పిల్లవాణ్ణి పంపించి ఇదంతా కాస్త ఊడ్పించు....నడవడానికి కూడా వీల్లేకుండా ఉంది....

అరుం : (లోపల నుంచే) ఇవ్వాళ పనిపిల్లవాడు రాలేదండీ! వాళ్ళ వాళ్ళు రానిచ్చారో లేదో? (వాకిట్లో నుంచి ఒక రాయి వచ్చి కిటికీ తలుపుకు తగిలి లోపల పడుతుంది....కరుణాకరం గబగబా కిటికీ దగ్గరకు వెళ్ళి బయటకు చూస్తాడు.

(బయటకు వస్తూ) ఏమిటిది? మీకేం దెబ్బ తగలతేదు కదా?

కరుణా : (కిటికీ లోనుంచి చూస్తూ) ఆ పసిపిల్లవాణ్ణి చూడు! రాయి విసిరి పరుగెత్తుకు పోతున్నాడు. విషం ఎంత తొందరగా వ్యాపిస్తుందో చూశావా!

అరుం : ఇది మన వూరేనా అని అనుమానం కలుగుతున్నదండీ!

కరుణా : (ఏరిన రాళ్ళను టేబుల్ మీద పెడుతూ) ఈ రాళ్ళన్నీ చాల భద్రంగా ఉంచుతాను....ఎదగవలసిన ప్రజాస్వామ్యానికి ఇవి మైలురాళ్ళు.....మన పిల్లలు, వాళ్ళ పిల్లలు రోజూ వీటిని చూసుకోవాలి –

(వాకిట్లో "ఎవరండీ" అని పిలుపు)

అరుం : ఎవరు? (వాకిట్లోకి వెళ్ళి ఉత్తరంతో తిరిగివస్తుంది) ఉత్తరమండీ!

కరుణా : ఉత్తరమా? మనకు ఇప్పుడు ఎవరు రాస్తారబ్బా?

(విప్పి చదువుతాడు)

అరుం : ఇంట్లోకి వెచ్చాలు ఎట్లా తెచ్చుకోవాలో కూడా తెలియడం లేదు....వాకిట్లోకి వెళ్ళడమంటే భయంగా ఉంది....ఏమిటది? ఎవరు రాశారు?

కరుణా : ఇంటాయన...మనల్ని వెంటనే ఇల్లు ఖాళీ చెయ్యమని –

అరుం : అయ్యో! ఎట్లాగండీ?

కరుణా : ఆయనకు కూడా మనల్ని ఇలా అర్థంతరంగా వెళ్ళమనడం ఇష్టం లేదట...కాని పరిస్థితులు – అంటూ రాశాడు.

అరుం : ఏమండీ! ఈ లెక్కన మన పిల్లలు స్కూలుకు వెళ్ళరు. కులాసాగా తిరిగొస్తారంటారా?

కరుణా : ఛ! వాళ్ళనెవరేం చేస్తారు!

అరుం : కాదండీ! మనం అంటే ప్రాణం పెట్లే ఇంటాయన – ఆయనే పరిస్థితులకు తల ఒగ్గాడంటే – ఈ వూరు మనల్ని బ్రతకనివ్వదండీ!

కరుణా : అంతగా బ్రతకనివ్వకపోతే మరో వూరు పోదాం.

అరుం : ఆ వూరు మాత్రం ఇంతకన్నా వేరుగా ఉంటుందా?

కరుణా : ఏమో? ఎవరు చెప్పగలరు?

అరుం : అంత దూరం వెళ్ళినా, అక్కడ కూడా ఇటువంటి జనమే తారసపడితే?

కరుణా : (కొంచెం ఆగి) అరుంధతీ! రాత్రి నన్ను వెక్కిరించి, వేళాకోళం చేసి, నామీద అరిచిన ఆ మనుషుల మొహాలు మరిచి పోలేక పోతున్నాను.

అరుం : వద్దండీ...ఆ జ్ఞాపకాలు వద్దు.....అది పీడకల!

కరుణా : ఆ ఇకిలింపులు....చేతులూ కాళ్ళతో వాళ్ళు చేసిన వికటాట్ట హాసాలు.......నాకు అడవి మృగాలే గుర్తుకొస్తున్నాయి....వాళ్ళ నాయకులు? మీ వెంటనే ఉన్నామని నమ్మింఇచ, పీడిత ప్రజానీకం అంటూ అట్టహాసం చేసిన వాళ్ళకి ఇప్పుడు నేనెదురైతే జీవితంలో ఎన్నడూ ఎరగని వాళ్ళలా వెళ్ళిపోతారనుకుంటాను!

("నాన్నా" అంటూ విద్య పరిగెత్తుకుంటూ వస్తుంది)

విద్య : నాన్నా!

కరుణా : అదేమిటమ్మా, అప్పుడే వచ్చే శావు స్కూలు నుంచి?

విద్య : నాన్నా! నన్ను స్కూలు వాళ్ళు డిస్‌మిస్ చేశారు!

అరుం : ఎవరు? సీతారామయ్యగారే!

విద్య : ఆయనేం చెయ్యగలరమ్మా! నన్ను ఉద్యోగంలోంచి వెంటనే తీసెయ్యాలని అప్పుడే మూడు ఉత్తరాలు వచ్చాయి....ఆయన చూపించారు కూడా!

కరుణా : ఎవరు రాశారమ్మా!

విద్య : కింద సంతకం లేదు నాన్నా!

కరుణా : ప్రజాస్వామ్యానికి అనామక హంతకులన్నమాట! ఒకళ్ళు చేసిన పనికి మరొకరికి శిక్షించే వీళ్ళు నీతి పరులు! మరొకళ్ళ మంచి కోసం పోట్లాడే నేను – ప్రజా విరోధిని!

(నరసింహం వచ్చాడు)

నర : డాక్టరుగారూ! లోపలికి రావచ్చా! నేనండీ! నరసింహాన్ని!! అప్పోజిషను పార్టీ లీడర్ని....నిన్న మీకు ఘోరమైన అవమానం జరిగిందని మా వాళ్ళు చెప్పారు....నేనూళ్ళో లేను. ఉంటే నా సామిరంగా! ఛైర్మన్ అయ్యేది, ఆడి బాబయ్యేది నా తడాఖా చూపించే వోడిని....

కరుణా : చెప్పండి, మీకిప్పుడేం కావాలి?

నర : ఏం కావాలేమిటి? మీ మద్దతు...మీరు పక్కకి రండి, మాతో చేతులు కలపండి – అని అనాడే చెప్పానా? ఇప్పుడయినా మీరు మా పక్కకొచ్చి నిలబడండి.....వీళ్ళు చేసిన అరాచకాలన్నీ బట్టబయలు చేద్దాం.

మీ అన్నగారు లచ్చల లచ్చల డబ్బు మింగి కదండీ ఆ గొట్టాలను నేలబారుగా ఏయించారు? ఆ పైన నీళ్ళ టాంకీల్లో మందు కలపాలన్నారు..కలిపారంటండీ? ఇయన్నీ కడిగెయ్యద్దూ?

కరుణా : దీని వల్ల మీకేమిటి లాభం?

నర : అంత ఖరాఖండీగా అడిగితే చెప్పడం ఎట్టాగండీ? మాకు లాభం ఏటంటేనండీ.....ఏటంటే – మనం ఛైర్మన్ కావచ్చు నండీ....మీరంతా నా పక్కన వుంటే ఊరినే వేసెయ్యొచ్చు కదండీ!

కరుణా : అయితే, ఈ బావుల్లో నీళ్ళన్నీ విషక్రిములతో నిండి వున్నాయని, కాలుష్యాన్ని తీసేసేదాకా బావుల్ని ముట్టు కోకూడదని నాతో పాటు మీరూ వాదిస్తారా?

నర : అమ్మమ్మ! అక్కడే మనం కొంచెం నేర్పుగా యవారం నడపాలండీ......ఇప్పుడేమో జనమంతా మంచి టెంపర్‌మీదున్నారండీ! కొంచెం ఆ ఏడితగ్గాక యీ మాట చెబుదామండీ....ఈలోగా ఛైర్మన్‌గారు

ఇట్టాంటి గొట్టాలేయించినందుకు రాజీనామా చెయ్యాలంటానండి....ఆ ఎనక నుంచి –

కరుణా : చూడండి నరసింహంగారూ! నేను డాక్టర్ని. రాజకీయవాదిని కాదు...అది మీరు మీరు చూసుకోండి. మీరూ మీరూ పంతాలు తీర్చుకోవడానికి నన్ను అడ్డం పెట్టుకోవద్దు. ఆ నీళ్ళను గురించిని నిజం జనంతో చెబుతానని మీరు మాటివ్వండి...నేను మీతో పాటు వస్తాను.....మీ వెంట వుంటాను.....

నర : మీతో సిక్కంతా అక్కడేనండీ! ఎక్కడా కాస్తంత పట్లూ విడుపూ లేకపోతే ఎట్టనండీ? ఇప్పుడు మీరు మా పక్కకొచ్చి అక్కడున్న అవకతవకలన్నీ కక్కెయ్యండి..ఆటిని ఆసరాగా పెట్టుకుని ఆ అధికార పక్షం వోళ్ళని లాగెద్దామండీ......ఆ తరువాత –

కరుణా : నరసింహంగారూ! ఇదంతా అనవసరమైన కంఠశోష – మీరు నా నమ్మకంతో, నిజంతో ఏకీభవిస్తేనే కాని నేను ఏమీ చెయ్యలేను. చెయ్యను

నర : అంతేనంటారా? సరే! మీ మంచికి చెప్పినా మీకు చేదయితే ఏం చేస్తాం! ఆలోచించుకోండి.....మీరెప్పుడు కబురు చేస్తే అప్పుడు లగెత్తుకుంటూ వస్తా – (వెడతాడు)

(అరుంధతీ, విద్య లోపలకు వస్తారు)

అరుం : ఏం కావాలంటాడాయన?

కరుణా : ఆయనా మీ బావగారి లాంటి వాడే! తన కోసం ఇతరుల బలి అయినా ఫరవాలేదంటాడు – ఆయన బొమ్మ, ఈయన బొరుసు...ముందు నన్ను బొమ్మను చెయ్యి, ఆ తరువాత నువ్వు చేప్పేది ఆలోచిస్తాను అంటాడు....ఇందరు స్వార్థపరుల మధ్య బతకలేమని పిస్తోంది......(విద్యతో) ఇహ ఈ వూళ్ళో ఉండలేమోనని పిస్తోందమ్మా!

విద్య : అలా అనకు నాన్నా! ఇవాళ మా సీతారామయ్యగారితో ఏం చెప్పానో తెలుసా? మిమ్మల్ని కూడా మీ ఆశయాలకు విరుద్ధంగా ఒత్తిడి చేసిన ఇటువంటి వాళ్ళ స్కూల్లో పని చెయ్యడం కంటే నాలుగిళ్ళలో కసు వూడ్చుకుని బతకడం మంచిదన్నాను – ఈ వూళ్ళోనే –

(జానకి రామయ్యగారు వస్తారు.)

జానకి : అమ్మా! అరుంధతీ!

కరుణా : రండి బాబుగారూ! సమయానికి వచ్చారు.

విద్య : తాతగారూ! ఇవ్వాళ మన వూరు సాధించిన మరో ప్రగతి ఏమిటో చెప్పుకోండి, చూద్దాం –

జానకి : ఏముంటుందమ్మా! మిమ్మల్ని ఊళ్ళో ఉండకుండా చెయ్యడానికి మరో ప్రయత్నం చేసి వుంటారు!

విద్య : అరె! రైట్.....దానికి మొదటి మెట్టు – నన్ను ఉద్యోగం లోనుంచి తీసెయ్యడం!

జానకి : నిజంగా! మన సీతారామయ్య అటువంటి పనిచేశాడా! నమ్మలేకుండా ఉన్నానే!

కరుణా : మీరు నమ్మలేనివి చాలా ఉన్నాయి బాబుగారూ! మమ్మల్ని ఈ ఇల్లు ఖాళీ చెయ్యమని వెంకటపతి గారు తాఖీదు ఇచ్చారు.

జానకి : అవి ఇంకా ఎందుకు రాలేదా అనుకుంటున్నాను...మరి మీకు కూడా ఒక శుభవార్త చెప్పనా? ఇన్నాళ్లు గ్రంథాలయంలో జీతం బత్తెం లేని గుమాస్తాగా పనిచేసేవాడినా? అది 45 ఏళ్ళుగా

సాగుతోందా.....అందులోంచి నన్ను తీసేసారు..అక్కడికి రావడానికి వీలులేదన్నారు....(నవ్వుతాడు)

విద్య : తాతగారూ! మిమ్మల్ని, మిమ్మల్ని ఉద్యోగం లోంచి తీసెయ్యడానికి వాళ్ళెవరండీ? వాళ్ళు పుట్టకముందు నుంచీ మీరక్కడ వుంటే?

జానకి : అధికారం అంతేనమ్మా! దానికి పిన్నా పెద్దా లేదు; వెనక ముందూ లేదు. అందర్నీ సమానంగా చూస్తుంది. పాపం! (నవ్వి) ఏం డాక్టరూ? అట్లా బిగుసుకుపోయావ్? నవ్వవేం?

కరుణా : ఇదంతా, నా వల్ల కదా!....మీకు సహాయం చెయ్యవలసింది పోయి –

జానకి : పిచ్చివాడా! ఇది సహాయం కాదుటోయ్! మనమూ, మన జాతి ఎటువైపు పోతున్నామో తెలియ చెప్పే ఈ మహత్తరమైన సంఘటన మనకు కనువిప్పు కాదూ?

నిన్నటి వరకు – పెద్దవాడినయ్యాను........నాకున్న ఒక్క కొడుకూ అమెరికాలో స్థిరపడిపోయాడు....మీ ముసలితనంలో నేను నా దేశాన్ని వదిలి వాడి దగ్గరకు పోవాలేమోనని దిగులు పడ్డాను.

ఇప్పుడు – ఆ దిగులు లేదయ్యా, ఇహ....నువ్వూ, అమ్మాయి, మనవరాలు, మనవళ్ళు – ఇక నాతో పాటే నా యింట్లోనే వుంటారు – కొడుకు అమెరికాలో ఉన్నాడు కాని, కూతురు ఇక్కడే ఉందయ్యా!

విద్య : తాతగారూ! (ముసలాయన మనవరాలిని దగ్గరకు తీసుకుంటూ వుండగా వాకిట్లోనుంచి "కరుణాకరం" అని పిలుపు)

రాజా : (మరి కొద్ది సేపటికి లోపలికి వచ్చి) మీరంతా ఏదో పనిలో వున్నట్టున్నారు. తరువాత వస్తాను.

కరుణా : పగిలిన గాజుముక్కల్ని ఏరిపారేస్తున్నాం...అంతే! .......రా అన్నయ్యా! ఇంకా నా నుంచి ఏంకావాలి?

అరుం : బాబుగారూ లోపలికి రండి –

జానకి : అవును....మనం మాట్లాడుకుంటున్న విషయం మీద ఏదో ఒక నిర్ణయానికి రావాలి కదా!....పద.

కరుణా : నేను కూడా ఐదు నిమిషాల్లో వస్తాను...

(అరుంధతి, విద్య, జానకి రామయ్య గారు లోపలకు వెడతారు)

కరుణా : ఇప్పుడు చెప్పు......ఇంకా నాతో పనేమిటి?

రాజా : ఇక్కడ కూర్చోవచ్చా?

కరుణా : వద్దు వద్దు...అందులో కూర్చుంటే మెజారిటీ రాయొచ్చి నీ తల పగిలిపోవచ్చు....ఈ కుర్చీలో కూర్చో.

(రాజారావు కూర్చుని ఒక కవరు తీస్తాడు)

కరుణా : ఏమిటి? అదేనా?.....నీ ఉద్వాసన కాగితం –

రాజా : (కవరు యిస్తూ) అవును. ఆరోగ్య సంస్థ అధిష్టాన సమావేశం ఈ పొద్దున్నే జరిగింది. అందులో ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం యిది.

కరుణా : ఎందుకంత పాలిపోయి కనిపిస్తున్నావ్?

రాజా : (అది పట్టించుకోకుండా) ఈ వూళ్ళో ఇహ నీకు ప్రాక్టీసుండదు...

కరుణా : భయపడకు. డాక్టర్ అవసరం ప్రతివాళ్ళకీ వుంటుంది.

రాజా : అట్లా కొట్టి పారెయ్యకు......ఎంత అవసరం వచ్చినా, నిన్ను పిలవకూడదని అందరి దగ్గరా సంతకాలు తీసుకుంటున్నారు.

కరుణా : అందులో మొదటి సంతకం నీ దేనా?

రాజా : లేదు....విషయం నా చేతులు దాటిపోయింది.

కరుణా : ఏమీ ఫరవాలేదు.

రాజా : అంటే? ఏమిటి నీ ధీమా? నువ్వు సర్వ నాశనం అయినా, ఇంకా ఫరవాలేదు – అంటే ఏమిటి దాని అర్థం?

కరుణా : అన్నయ్యా! నాకు తెలుసు....ఇది జరిగితే నేను ఈ వూరు వదిలిపోతాను. బయట వూళ్ళలో ఈ విషయాన్ని గురించి నలుగురికీ చెబుతాను....అదీ నీ భయం!

రాజా : ఒక రకంగా నిజమే! కాని ఈ వూరి బాగునే నువ్వు కోరుకుని ఉంటే, అందరినీ – నీతో సహా అందరినీ – సర్వనాశనం చెయ్యకుండా నువ్వు కావాలనుకున్నవి సాధించే వాడివి.

కరుణా : ఇప్పుడీ కొత్త కథ ఏమిటి?

రాజా : నువ్వు ఈ వూరంటే నీకున్న ప్రేమతో – అవసరమైన దానికన్న ఎక్కు ఆదుర్దా పడ్డానని, దానివల్ల వచ్చే ప్రమాదాన్ని ఎక్కువ చేసి చెప్పి వుంటాననీ...ఏదైనా సరే, ఆ అర్థం వచ్చేటట్లు ఒక ప్రకటన మీద సంతకం చేసి ఇవ్వు.......మళ్లీ నీ ఉద్యోగం నీకు వస్తుంది. ఆరోగ్య పథకంలో మెల్లమెల్లగా నువ్వనుకున్న మార్పులన్నింటిని చెయ్యడానికి అవకాశం కలగచేస్తాను...

కరుణా : అంటే, మనుషులు విషంతాగుతూ వుంటే, వాళ్ళకి దానిని కొద్ది కొద్ది మోతాదులో ఇచ్చే అధికారిగా పని చెయ్యమంటావు!.....అంతేనా?

రాజా : కావలసిన మార్పుల్ని మెల్లమెల్లగా చేసుకోవచ్చు నన్నానుగా!

కరుణా : ఎంతమెల్లగా? ఐదు సంవత్సరాలు? పది?......అన్నయ్యా! ఇన్నేళ్లలోనూ నువ్వు తెలుసు కోలేక పోయిందేమిటో తెలుసా? కొంతమందిని నువ్వు కొనలేవు– ఏ ఎర చూపించినా సరే!

రాజా : అవును....ఆ సంగతి నాకు బాగా తెలుసు.....కాని నేను నీలాంటి వాడిని కొనాలనుకుంటానని పొరపాటు పడుతున్నావ్!....ఆ పని ఛస్తే చెయ్యను.

కరుణా : ఎందుకనో?

రాజా : ఎందుకనా? (ఆగి) నీకు పరంధామయ్య లాంటి మామగారు ఉన్నారు కనక!

కరుణా : నీకేం మతి పోలేదు కదా? ఆయనకీ ఈ గొడవకీ సంబంధం ఏమిటి?

రాజా : తెలియనట్లు అమాయకుడిలా నటించకు....నువ్వు సృష్టించిన గొడవకి అర్థం ఏమిటో ఇప్పుడు తెలుస్తున్నది.

కరుణా : అంతా అయోమయంగా ఉంది.....ఏమిటి నీకు తెలిసింది?

రాజా : అంటే, మీ మామగారు ఆరోగ్య సంస్థలో డబ్బుపెట్టిన వాటాదారులందరి దగ్గరకూ వెళ్ళి వాళ్ళ వాటాలు కొనేస్తున్నాడని నీకు తెలియదంటావా?

కరుణా : వాటాలేమిటి? కొనడమేమిటి?

రాజా : (కొంచెం తమాయించుకుని) ఈ వూరి బావుల్ని నిర్వహించే ఆరోగ్య సంస్థ ఎవరిదో తెలుసునా?

కరుణా : తెలుసు....నీ వంటి భాగ్యవంతులు, పలుకు బడి వున్న వాళ్ళు అందులో వాటాలు తీసుకుని ప్రయివేటు కంపెనీగా మొదలు పెట్టారు..దాన్ని నిర్వహించడానికి మునిసిపాలిటీకి అప్పచెప్పారు.....

రాజా : ఆ మాత్రం తెలుసు కదా!...ఒక్కొక్కళ్ళం యాభైవేలు పెట్టాం....పదిహేనుమందిమి.....ఆ 7 1/2 లక్షలతో ఈ పథకం పూర్తి చేశాం......మీ మామగారు ఇవ్వాళ పొద్దున్నే బయలుదేరి ఆ పదిహేను మందిలోను ఎనిమిది మంది దగ్గరనుంచి వాళ్ళవాటాలు కొనేసాడు.....సగం ధరకే!

కరుణా : అవును....ఆయన వాటాలు కొంటే నాకేమిటి సంబంధం?

రాజా : ఏమిటో తెలియనట్టు అమాయకంగా మొహం పెట్టకు....ఆరోగ్య సంస్థ అంటేనూ, మునిసిపల్ కమిటీ అంటేనూ ప్రజల్లో అపనమ్మకాన్ని కలగచేశావు నువ్వు....బావుల్లో నీళ్ళను గురించి కొత్త సంగతులు చెప్పావు.....మర్నాడు ఉదయం – ఆపిడుగు పాటు నుంచి తేరుకునే లోగానే – మీ మామగారు పట్నం అంతా తిరిగి మూలధనంలో సగం ధరకే ఆ వాటాలన్నీ కొనేశాడు....నీళ్ళలో విష క్రిములు నిజంగానే ఉన్నాయేమో నని భయపడి యాభైవేల వాటాని పాతిక వేలకే అమ్మేశారు వాటాదార్లు.....దీని అర్థం ఏమిటో బుర్ర ఉన్న ప్రతివాడికీ తెలుస్తూనే వుంది.....ఇప్పుడు ఉపన్యాసాలివ్వు నీ సిద్ధాంతాలను గురించి –

కరుణా : అంటే – అంటే, నాకూ ఈ లావాదేవీలకు సంబంధం ఉన్నదంటావా? నేను, నేను అటువంటి పని చేస్తానని –

రాజా : నీ మనస్తత్వ శాస్త్రాలు, నీ నైతిక సూత్రాలు తుంగలో తొక్కు...ఎదురుగుండా కనిపిస్తున్నదే నాకు నిజం......ఏమిటా నిజం?.....తన మామగారి లాభం కోసం ఒక డాక్టరు పన్నిన పన్నాగం....నీకు మరో మాట కూడా చెబుతున్నాను....ఇవ్వాళ రాత్రిలోపల ఊళ్ళో ప్రతివాడికీ ఈ విషయం తెలుస్తుంది....అసలే నువ్వంటే మండి పోతున్న ప్రజలు ఏం చేస్తారో కూడా నేను చెప్పలేను.

కరుణా : అన్నయ్యా – నువ్వు.......నువ్వు......

రాజా : పరిస్థితులు ఇంకా విషమించకముందే నేను చెప్పినట్టు చెయ్యి......ఆ టేబుల్ దగ్గర కూర్చుని ఇంతకాలంగా నువ్వు చెబుతున్నదంతా అబద్ధమని ఒక వివరణ రాసి సంతకం పెట్టి ఇవ్వు –

కరుణా : (టేబుల్ దాకా వెళ్ళి, కలాన్ని కింద పెట్టి) నువ్వు ఇంత నీచానికి దిగజారుతావని అనుకోలేదు.

రాజా : సరే! ఆఖరుసారిగి చెబుతున్నాను.....బావుల్ని గురించి, నీళ్లని గురించి ఎక్కడన్నా ఒక్క మాట రాశావంటే, నీకు అరెస్టు వారెంటు వస్తుంది....అక్రమంగా వ్యాపారం చెయ్యడం కోసం నువ్వు ఊరి ఊరినంతా మోసం చేశావన్న నేరం మీద నిన్ను జైలుకు పంపవలసి వస్తుంది....జ్ఞాపకం ఉంచుకో –

(కరుణాకరం 'అలానే' అన్నట్టు తల ఊపుతాడు....రాజారావు వెళ్ళడానికి లేస్తాడు....గుమ్మం దగ్గర – లోపలకు వస్తూ పరంధామయ్య కనిపిస్తాడు.....)

రాజా : (సాభిప్రాయంగా) ఆ! (అని వెళ్ళిపోతాడు)

(పరంధామయ్య ఆనందంగా కూని రాగాలు తీస్తూ ఒక కుర్చీ దగ్గరకు వెడతాడు)

కరుణా : మామయ్యా! ఏమిటి మీరు చేసిన పని? ఇది నాకు ఎంత అవమానమో ఆలోచించారా?

(పరంధామయ్య జేబులో నుంచి ఒక కాగితాల కట్టతీసి, టేబుల్ మీద పడేస్తాడు)

కరుణా : ఇవేనా?

పరం : అవును. ఆరోగ్య సంస్థవారి రోగనివారణ జలపథకంలో ఉన్న 15 వాటాల్లోను, ఎనిమిదింటి తాలూకు పత్రాలు –

కరుణా : ఎందుకు కొన్నారు వీటిని?

పరం : అరె! ఎందుకు అంత గాభరాపడతావు?.....నా దగ్గర కాస్తంత డబ్బుంది...వాటాలు చౌక ధరలో దొరుకుతున్నాయి; కొన్నాను....ఇందులో తప్పేమిటి?

కరుణా : వాటాలు కొనడంలో తప్పులేదు....కాని ఇప్పుడా? అందులోనూ ఆరోగ్య పథకంలోనా?.....దానితో నేను యుద్ధం సాగిస్తున్న సంగతి ఊళ్ళో ప్రతివాడికీ తెలుసు....ఇంత సిగ్గుచేటుపని ఎందుకు చేశారు? ఎవరి కోసం?

పరం : కరుణాకరం! నిన్న సాయంకాలం మీటింగ్‌లో నేనూ వున్నాను.

కరుణా : చూశాను –

పరం : వాళ్ళంతా నిన్ను అవమానించడం చూశాను –

కరుణా : ఆ మాట మీరు చెప్పక్కర్లేదు –

పరం : కాని వాళ్ళు నువ్వు చెప్పిన మాటల్ని నమ్మారు కూడా! అవకాశం దొరికితే నిన్ను చంపడానికి కూడా చూశారు..అయినా నిన్ను నమ్మారు. (కొంచెం ఆగి) వాళ్ళు చెబుతున్న దానిని బట్టి ఈ కాలుష్యం అంతా కొండల మీద ఉన్న ఫ్యాక్టరీల నుంచి వస్తున్నదే –

కరుణా : అందులో అనుమానం ఏముంది? ఖచ్చితంగా అక్కడ నుంచి వస్తున్నదే –

పరం : నా రంపపు పొట్టు ఫ్యాక్టరీ, కలప అడితీ – అన్నీ అక్కడే ఉన్నాయి.

కరుణా : వస్తున్న కాలుష్యం అక్కడిదేనని నేనే చెప్పాను.

పరం : నేను నిన్ను తప్పు పట్టడం లేదు....నువ్వు నిన్న ఈ మాట చెప్పినప్పుడు నిన్ను నమ్మకపోవడం నా తప్పు.....కాని ఇప్పుడదే చాలా ప్రమాదమైంది.....ఆ ఫ్యాక్టరీలు మా నాన్న నుంచి నాకు వచ్చాయి. ఆయనకు వాళ్ళ నాన్న యిచ్చి వెళ్ళాడు...మూడు తరాల నుంచి అవిచ్ఛిన్నంగా మేము వ్యాపారం చేస్తుంటే – ఇవ్వాళ – అక్కడ నుంచి వచ్చే కాలుష్యం నీటిలో కలిసి దాన్ని విషంగా మార్చాయని చెప్పి, మమ్మల్ని ఈ ఊరికి విషం పెట్టి చంపే హంతకులుగా నిరూపిస్తుంది....ఆ మాట ఒక వాటాదారు అంటేనే – నేను ఈ వాటాలు కొనడం మొదలుపెట్టాను...నా కుటుంబానికి ఈ అపవాదు రావడం నేనొప్పుకోను.

కరుణా : మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, విషక్రిములు వస్తున్నది అక్కడినుంచే...అవి వచ్చినంత కాలం ఈ నీటి కాలుష్యం తగ్గదు. అది తగ్గనంత వరకు ఈ విషానికి విరుగుడు లేదు....అది జరగకుండా ఎవ్వరూ ఆపలేరు.

పరం : నువ్వు ఆపగలవు.

కరుణా : నేనా?

పరం : అవును...ఈ వాటాలు నేను ఎందుకు కొన్నానోతెలుసా?

కరుణా : ఎందుకు కొన్నా, అవి నాలుక గీచుకోవడానికి కూడా పనికిరావు...మీ డబ్బును అనవసరంగా

వాటిమీద పెట్టారు.

పరం : పిచ్చివాడా! ఇవి నా డబ్బుతో కొనలేదు. మీ డబ్బుతో కొన్నాను.

కరుణా : మా డబ్బుతోనా?

పరం : అవును. నేను అమ్మాయికి యిద్దామనుకున్న డబ్బుతో ఈ వాటాలు కొన్నాను.

కరుణా : ఆ డబ్బుతో ఎందుకూ పనికి రాని వాటాలు కొన్నారా?

పరం : అవును. జీవితాంతం నేను, నా తాత ముత్తాతలు, మచ్చలేకుండా బతికాం, బతుకుతున్నాం...ఇవ్వాళ నువ్వు చెప్పిన ఈ మాటల వల్ల ఇన్ని తరాల వాళ్ళను శాపనార్థాలు పెడతారు ఈ వూరి వాళ్ళు....

కరుణా : అందుకని వాటాలు కొని ఆ డబ్బును తగలేస్తారా?

పరం : లేదు....నువ్వు మళ్ళీ ఆ నీళ్ళను పరిశోధనకి పంపిస్తావు.

కరుణా : ఎన్నిసార్లు పరిశోధనలు చేసినా అందులో విషం ఉన్నమాట అబద్ధం కాదు.

పరం : నువ్వు నీ మొండి పట్టుదలని, ఈ నీళ్ళను గురించిన నీ అభిప్రాయాన్ని మార్చుకుంటే –

కరుణా : ఎట్లా మార్చుకోవడం? ఆ నీళ్లు విషమయం, విషమయం......

పరం : నువ్వు అవి విషమయం, విషమయం అని ఒక పక్కన చెబుతూ, మరోపక్క ఈ వాటాలు నీ యింట్లో, ఉంటే, దానికి అర్థం ఒకటే – నీకు పిచ్చెక్కిందని –

కరుణా : అవును...ఇంతవరకు ఎక్కలేదు....ఇప్పుడు పిచ్చెక్కుతున్నది –

పరం : నీ పట్టుదలతో నీ కుటుంబాన్ని వీధులపాలు చేస్తున్నావు – నీకున్న మొత్తం డబ్బు ఈ వాటాల రూపంలో ఉంది – జ్ఞాపకం ఉంచుకో –

కరుణా : ఈ వాటాలు కొనకముందు నాకెందుకు చెప్పలేదు?

పరం : కొన్న తరువాత చెబితేనే నీకు బాగా అర్థం అవుతుందని....నువ్వు ఆ నీటిని పరిశోదన చేసినప్పుడు కనిపించిన విషక్రిములు ఆ తరువాత ఉండకపోవచ్చు...నువ్వు చూసిన ఆ కాస్తంత నీటిలోనే వుండి మిగిలిన నీటిలో ఉండకపోవచ్చు...అధవా వున్నా, ఆ నీటిని ఆ కాస్తంత శుభ్రపరిచే ఉపాయాలుండొచ్చు –

కరుణా : ఇవన్నీ ఆలోచించకుండానే ఈ నిర్ణయానికి వచ్చానంటున్నారా?...ఇక గత్యంతరం లేకనే నీటి బుగ్గల్ని మూయించాలని చెప్పాను...ఆ నీరు బాగుపడాలంటే, మీ ఫ్యాక్టరీలు మూసెయ్యాలి....లేదా, అందులో వచ్చే వేస్ట్‌ని మరో చోటికి మళ్ళించాలి. కొండలమీద నుంచి వస్తున్న ధారని లేరు మార్గానికి మార్చాలి. బాగా ఎత్తున, కొండలమీద టాంక్ కట్టాలి. ఇప్పుడున్న నీటి గొట్టాలని, టాంక్‌లని ఎండించి, మళ్ళీ వేరు చోట్ల తవ్వాలి. ఇదంతా జరగనంత కాలం ఈ కాలుష్యం తప్పదు...అటువంటప్పుడు ఈ వాటాలు కొని అందర్నీ ఎందుకు నాశనం చేశారు? నా నిర్ణయానికి మీ అమ్మాయినెందుకు బలి చేశారు?

పరం : ఎందుకంటే – పరంధామయ్య వల్ల, ఆయన కుటుంబం వల్ల ఈ ఊరు స్మశానం అయిపోయిందని జనం అనకుండా ఉండాలిని – నీ అభిప్రాయాన్ని నువ్వు మార్చుకున్నావా, సరే! లేదా ఈ వాలాలను కూడా ఏ స్వచ్ఛంద సంస్థకో రాసి పారేస్తాను....నీకు నీ పేరుకు మచ్చ రాకూడదని ఎట్లా వుందో, నాకూ అంతే!

(ఆ వాటి కాగితాలన్నీ తీసుకుని లేస్తాడు, వెళ్ళడానికి)

కరుణా : మిమ్మల్నిప్పుడు చూస్తుంటే, రాక్షసులు ఈ లోకంలోనే వున్నారనిపిస్తున్నది.

(తలుపు తీసిన చప్పుడు. గుమ్మం దగ్గర శివశంకరం, సత్యనాథం నిలబడి వున్నారు)

మీరా!

శివ : (గబగబా, కరుణాకరం దగ్గరకు వచ్చి, చేతులు పట్టుకుని) మీరు ఉద్రేక పడకండి....(ఇద్దరూ పరంధామయ్యని చూసి నవ్వుతూ పలకరిస్తారు)

పరం : ఇక్కడంతా మేధావులు....నాలాంటి చదువురాని వాళ్ళకి ఇక్కడ స్థానం లేదు (వెళ్ళడానికి బయలు దేరుతాడు)

శివ : డాక్టర్‌గారూ! ఒక్క అయిదు నిమిషాలు మీతో మాట్లాడాలి.

కరుణా : నాకు మీతో మాట్లాడవలసిందేమీ లేదు.

పరం : (గుమ్మం దగ్గర నుంచి) నీ నిర్ణయం ఏమిటో వెంటనే చెప్పాలి....జ్ఞాపకం ఉంచుకో! (వెళ్ళిపోతాడు)

కరుణా : సరే! ఏం కావాలి మీకు? తొందరగా చెప్పండి....

సత్య : మీటింగ్‌లో మా ప్రవర్తనకి మీరు మమ్మల్ని క్షమించరని మాకు తెలుసు.

కరుణా : మీ ప్రవర్తనా?...దారుణం..నీచం – సరే! అవన్నీ ఎందుకు? మీకేం కావాలి?

శివ : మీ మనసులో ఈ విషయం (పరంధామయ్య వెళ్ళిన వైపు చూపుతూ) ఉందని మాకు ముందే చెప్పాల్సింది.....అప్పుడు "సత్యంవద" ఆది నుంచి అంతం దాకా మీతోనే వుండేది.

సత్య : అప్పుడు ప్రజలంతా మీ పక్షాన ఉండేవారు......

కరుణా : ఈ డొంక తిరుగుళ్లు నాకు నచ్చవు..నాకు చాలా అలసటగా ఉంది....అసలు సంగతికి రండి.

సత్య : మీ మామగారు ఆరోగ్య సంస్థ వాటాలన్నీ కొనేస్తున్నారు...ఆ సంగతి ఊరూవాడా తెలిసిపోయింది.

కరుణా : తెలిస్తే?

సత్య : అది కూడా మమ్మల్నే చెప్పమంటారా?

కరుణా : చెప్పండీ......

సత్య : మేము మొట్టమొదట మిమ్మల్నే బలపరిచాం....కాని ప్రజలంతా తిరిగబడ్డప్పుడు మేము మిమ్మల్ని బలపరిస్తే –

కరుణా : ఆ ప్రజలు తిరిగబడడానికి కారణం మీరు....మీరు చేసిన దుష్ప్రచారమే –

సత్య : ఒక్కొక్క విషయాన్ని వేరువేరుగా మాట్లాడుకుందాం....కారణం ఏమైనా అంతటి ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా మేమూ మీతో ఉంటే, మిమ్మల్ని చూసినట్టుగానే మమ్మల్ని చూసేవాళ్ళు.....

కరుణా : మీ స్వార్థం కోసం నిజాన్ని బలిపెట్టడానికి కూడా మీరు జంకలేదన్న మాట! అయితే, ఇప్పుడేం కావాలి?

సత్య : సత్యంవద పత్రిక మిమ్మల్ని తిరిగి నిలబెడుతుంది....మిమ్మల్ని ప్రజానాయకుణ్ణి చేస్తుంది.

కరుణా : ఎట్లాగో?

సత్య : మీరు ఈ వాటాలు ఇంత నష్టంతో కొన్నది స్వార్థం కోసం కాదని, పరిశోధన కోసం అనీ, బావుల్ని

మునిసిపాలిటీ గాని, ఆరోగ్య సంస్థకాని బాగు చెయ్యదు కనుక వాటిని బావు చెయ్యడానికే మీరు కొన్నారని జనానికి చెబుతాం.....

శివ : అంటే – మీరు విషం కలిపిన నీటినుంచి ఈ వూరిని రక్షించడానికే ఈ పని చేశారని తేలిగ్గా నమ్మిస్తాం.

కరుణా : అందుకోసం నేను మీకు ఏం చెయ్యాలి? మీ పత్రికకు అయ్యే డబ్బు ఇవ్వాలి. అంతేనా?

శివ : డబ్బుంటే.....మరి –

సత్య : మరీ అంత కటీ బిటీగా మాట్లాడకండి.....మిమ్మల్ని బలపరిస్తే కొన్నాళ్ల పాటు మా పత్రికకు సర్కులేషన్ తగ్గిపోతుంది...నష్టాలు వస్తాయి......ఎంతకాలం? అయిదారు నెలలు....ఆ నష్టాన్ని మీరు – లేదా పరంధామయ్యగారు – పూడిస్తే చాలు...ఇందులో మాకు ఏ మాత్రం స్వార్థం లేదు.......

(కొంచెం సేపు నిశ్శబ్దం.....ఆలోచనలతో కిటికీ దగ్గరకు వెడతాడు)

శివ : మీరు ఇప్పుడున్న పరిస్థితుల్లో మా పత్రిక మద్దతు ఎంతైనా అవసరం.

కరుణా : వచ్చిన మచ్చని మాన్చుకోవాలని ఎవరికి ఉండదు కనుక?

సత్య : ఆ అదీ! ఇప్పుడు మీరు మా భావాన్ని బాగా అర్థం చేసుకున్నారు....శివశంకరంగారూ! పత్రికకు ఏ మాత్రం ఖర్చవుతుందో, ఆ వివరాలు చూపించండి......

కరుణా : ఒక్క క్షణం ఆగండి.....చిలక పలుకుల్లాగా చెప్పినమాటలే మళ్ళీ మళ్ళీ చెప్పడం నాకు అసహ్యం....అయినా చెప్పక తప్పడం లేదు.....ఆ నీళ్ళు విషయమం –

శివ : కాని మీరు ఆరోగ్య సంస్థకు డాక్టరుగా ఉంటే అక్కడ ఏమీ పొరపాట్లు రావని మాకు ఖచ్చితంగా తెలుసు.

కరుణా : అంటే – నా పేరుకు వచ్చిన మచ్చను పోగొట్టుకోవాలంటే, ఈ విష ప్రయోగానికి నేను ఆధిపత్యం వహించాలన్నమాట!

శివ : కాని అంతా ఒక్కరోజులో మార్చగలమా? నెమ్మది మీద నీరు బాగు పడుతుంది.

కరుణా : అంటే – మీరు నా మంచి కోసమని నమ్మించి, నా దగ్గర డబ్బు గుంజడానికి వచ్చారని నేను అనుకోవచ్చా? నేను తప్పు అని నిరూపించిన పథకానికి నేను అధికారిని కావాలి......దానికి గాను నాకు మద్దతునిస్తే మీ పత్రిక నడపడానికి నేను మదుపు పెట్టాలి....ఇంతకన్న మోసం ఏముంటుంది?

సత్య : (కోపంగా) మీకు వచ్చిన ఈ చెడ్డపేరును తొలగించాలనే మా ప్రయత్నం – దానిని మీ స్వార్థ అనుకుంటే –

కరుణా : అనుకొంటే – ఏం జరుగుతుంది? ఏం జరుగుతుందో చెప్పు –

సత్య : పదండి. మనం వెడదాం–

కరుణా : (దారికి అడ్డంగా వచ్చి) ఏం చేస్తారో చెప్పి వెళ్ళండి.....రెండు నిమిషాల క్రితం నన్ను ప్రజానాయకుణ్ణి చేస్తానన్నారు.....ఇప్పుడు మీరు అడిగిన డబ్బు ఇవ్వను అన్నాను.....ఇవ్వకపోతే ఏం చేస్తారు?

సత్య : ఏం చేస్తామా? స్వార్థం కోసం ఒక ప్రభుత్వ సంస్థను మోసం చేశారన్న నేరం మీద మిమ్మల్ని జైలుకు పంపిస్తాం....సరేనా? మీకన్నా పాషాణం నయం.....మీ వంశం పేరు ప్రతిష్టలు, మీ కుటుంబం, మీ

పిల్లా జెల్లా – వీధిన పడుతుంటే – మీరు సిద్ధాంతాలు వల్లిస్తూ కూర్చుంటారా?......మీకు జరుగుతున్న శాస్తి సమంజసమేనని పిస్తోంది.

శివ : డాక్టర్‌గారూ.....శాంతంగా మరోసారి ఆలోచించండి –

(ఇంతలో వాకిట్లో అలజడి.....“ఏమయింది?” “నా బిడ్డకి ఏమయిందరా?” అంటూ అరుంధతి ఏడుపు.... కరుణాకరం అటు వైపుకు తొందరగా వెడతాడు.....చైతన్యకు నుదిటి మీద పెద్ద దెబ్బ తగిలివుంది.....విద్య, జానకి రామయ్యగారు లోపలనుంచి వస్తారు...అరుంధతి చైతన్యను తీసుకు వస్తుంది.....నాగార్జున వెంట వుంటాడు)

అరుం : చూడండి వాడి వంక! ఏదో జరిగిందండీ!

చైతన్య: నేను బాగానే వున్నానమ్మా!

కరుణా : ఏమయిందిక్కడ?

చైతన్య: ఏమీ లేదు నాన్న!

కరుణా : (నాగార్జునతో) ఏమయిందిరా? మీరు స్కూల్లో ఎందుకు లేరు?

నాగా : హెడ్‌మాస్టారు గారేమో – మీరు యింటిదగ్గరే వుండిపోండి, స్కూలుకు రాకండి – అని చెప్పారు.. మేము యింటికి తిరిగి వస్తూ ఉండగా ఓ కుర్రాడు –

కరుణా : కొట్టాడా?

నాగా : నిన్ను ఏవేవో మాటలు అన్నాడు...అన్నయ్యకి కోపం వచ్చివాడితో పోట్లాడడం మొదలు పెట్టాడు... అప్పుడు పిల్లలంతా చేరి –

అరుం : వాళ్ళకి సమాధానం ఎందుకు చెప్పావురా నాయనా?

చైతన్య: (కోపంతో) నాన్నని వాళ్ళు దేశద్రోహి, ప్రజావిరోధి అని ఎగతాళి చేస్తున్నారమ్మా!....నాన్న ద్రోహా?

నాగా : వాళ్ళతో మనకెందుకు ఇంటికి పోదాం అని చెబుతూనే వున్నాను –

అరుం : వాళ్ళు ఈ అదను కోసమే చూస్తున్నారు.....పిల్లవాడిని చంపేశేవాళ్ళే –

కరుణా : చైతన్య....ఇటురా –

(చైతన్య భయపడి.....కరుణాకరానికి అందకుండా పోతాడు – కరుణాకరం అతన్ని అందుకోవడానికి పరుగెత్తి పట్టుకుంటాడు....)

కరుణా : నాన్నా! (అని దగ్గరకు తీసుకుంటాడు)

చైతన్య: వాళ్ళు నిన్ను ద్రోహి, విరోధి అంటున్నారు నాన్న!

కరుణా : అననీ నాన్నా! అన్నంత మాత్రాన అయిపోతామా?

చైతన్య: ఆసారి వాడిని కనిపించనీ...వాడిని –

కరుణా : (కొడుకును సముదాయించి) ముందులోపలికి పోయి మొహం కడుక్కో – (విద్య పిల్లలను లోపలకు తీసుకుపోతుంది)

కరుణా : (ఠీవిగా నిలబడి) మీరు ఇక వెళ్ళొచ్చు.......

శివ : మీ నిశ్చయం ఏమిటో చెబితే –

కరుణా : ప్రజావిరోధిని కావడమే నా నిశ్చయం –

సత్య : డాక్టర్‌గారూ! మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలుస్తోందా?

కరుణా : ఆ! అభం శుభం ఎరగని చిన్న పిల్లలను కూడా హింసాకాండకు పురికొల్పిన ఆ జనానికి నేను విరోధినే!....నేనూ, నా పిల్లలు, మా ఆవిడా – అందరం ప్రజావిరోధులమే!

శివ : డాక్టర్! మా మాట వినండి...మీకు కావలసినవన్నీ సాధించుకోవచ్చు.

కరుణా : ఒక్క నిజాన్ని తప్ప! నాకు అన్నీ లభిస్తాయి – ఆ నీళ్లు విషపూరితం అన్న నిజానికి మీ ఆమోదం తప్ప....ఇప్పుడు పసిపిల్లల్ని ఆ విష పూరితుల్ని చేశారు...పెద్దవాళ్ళను విషపూరితుల్ని చేశారు...ఆ విష ప్రయోగానికి నన్ను అధికారిగా ఉండి దాన్ని ప్రజల రక్తనాళాలలోకి ఎక్కించమంటున్నారు!....ఏదో విధంగా ప్రాణాలను నిలుపుకోవడం కోసం రోజూ చస్తూ వుండమంటున్నారు....మీరు బ్రతుకుతున్న అబద్ధపు బతుకునే నన్నూ బతక మంటున్నారు...

సత్య : మీకు మతి స్థిమితం తగ్గింది –

కరుణా : అవును....మీ పత్రికని కొంటే నేను మేధావిని; ప్రజా నాయకుణ్ణి...లేకపోతే ప్రజావిరోధిని, పిచ్చివాణ్ణి!......మీరు వెళ్ళబోయే ముందు నేను ఎటువంటి విరోధినో తెలుసుకుని వెళ్ళండి....నా కలం పదును మీకు తెలుసు. దాన్ని ఇంకా పదును పెడతాను...నీటిలో వున్న విషాన్ని గురించి...అధికారంలో వున్న విషాన్ని గురించి, ప్రజల్లో మీరు వ్యాపింప చేస్తున్న విషాన్ని గురించి...వెళ్ళండి...వెళ్ళి ఏం చెయ్యగలరో చెయ్యండి.....ప్రాణంపోతున్నా డాక్టరుని పిలవవద్దనండి...వాళ్ళ పిల్లలిన నడి బజార్లో నరకమనండి....పసిపిల్లల హృదయాల్లో మంచిని పెంచే వాళ్ళ అమ్మాయిని డిస్‌మిస్ చెయ్యమనండి..ఇన్ని చేసినా నిజం నిద్రపోదని తెలుసుకోండి........

సత్య : డాక్టర్! మీకు పిచ్చెక్కింది.

చైతన్య: (అతని మీద దూకుడుగా పోయి) మా నాన్నగారిని మళ్ళీ ఆ మాట అన్నావో జాగ్రత్త!

కరుణా : ఇంకా అక్కడే వున్నారేం? వెళ్ళండి – (కదలరు) వెళ్ళండి.......గెట్ అవుట్....(వెడతారు...తలుపు వేసి తన కుటుంబం వైపుకు తిరుగుతాడు)......వినండి....మనం ఈ ఇంట్లో ఒంటరిగా ఉన్నాం....చుట్టూ విరోధులు....వాళ్ళు ఎప్పడయినా మన ఇంటి మీదికి రావచ్చు.

(ఒక రాయి కిటికీ గుండా వచ్చి ఇంట్లో పడుతుంది)

అరుం : బాబుగారితో పాటు ఇవాళ పట్న వెళ్ళిపోదామండీ!

కరుణా : మనం ఎక్కడకీ వెళ్ళడం లేదు.

విద్య : అంతే నాన్నగారూ!

అరుం : కాని పిల్లలు స్కూలుకు వెళ్ళడానికి వీలు లేదు....

కరుణా : వాళ్ళకి, నేనూ, విద్యా చదువు చెబుతాం.....ఆ! విద్యా! నువ్వు వెంటనే తాతయ్యగారింటికి వెళ్లి – ఆయనతో ఒక మాట చెప్పిరావాలి.......

విద్య : ఏమని?

కరుణా : మీరు చెప్పిన మాటలు నాన్నగారికి సుతారామూ ఇష్టం లేదని –

విద్య : అట్లాగే నాన్నా!

**అరుం :** తాతగారు –

**జానకి :** నేనూ ఎక్కడికి వెళ్ళడం లేదమ్మా!....మీ పిల్లలిద్దరే కాదు...ఇంకా చదువులేని వాళ్ళు, బంగారం లాంటి మనసున్న వాళ్ళు, రోజూ గ్రంథాలయానికి వచ్చే వాళ్లు ఓ డజను మంది కుర్రాళ్ళున్నారు –

**కరుణా :** బాబుగారూ! వాళ్ళు చదువుకోని కుటుంబాల వాళ్ళేనా?

**జానకి :** అవును బాబూ! ఊరు మురికి వాడల్లో నుంచి వచ్చినా మెరికల్లాంటి వాళ్ళు –

**కరుణా :** అటువంటి పిల్లలకు చదువు చెబుదాం – వాళ్ళకి మానవత్వం నేర్పుదాం...పక్కవాడినీ, పక్కవాడి అభిప్రాయాన్ని గౌరవించడం నేర్పుదాం.....మనిషిగా చూసే మమతను నేర్పుదాం.....

(మరో రాయి పడుతుంది)

(వాకిట్లో అరుపులు)

**జానకి :** (కిటికీ దగ్గరకు పోయి) ఊళ్ళో సగం జనం ఇటు వస్తున్నారు.

**అరుం :** ఇప్పుడేం జరుగుతుందండీ?..ఏం జరుగుతుంది?

**కరుణా :** (ఆమెను అనునయిస్తూ) తెలియదు...కాని నిజాన్ని చంపాలనే వాళ్ళ ప్రయత్నంలో వాళ్ళు ఎన్నటికీ విజయం సాధించలేరని మాత్రం తెలుసు...మనం అంతా నిజాన్ని బ్రతికించాలని ఈ బాధలు పడుతున్నాం... అందుకే మనం ఒంటరిగా వున్నాం –

**జానకి :** నిజం కోసం పోట్లాడే ఆ ఆదర్శమే మనకు కావలసిన బలాన్ని యిస్తుంది.

**కరుణా :** అవును...ఆదర్శాలున్న బలవంతుడు ఒంటరిగా పోట్లాడడం నేర్చుకోవాలి. (మరో రాయి లోపల పడుతుంది....వాకిట్లో అరుపులు..."డాక్టర్ వాకిట్లోకి రావాలి"......"ప్రజావిరోధి డౌన్, డౌన్"...అంటూ.... కరుణాకరం కిటికీ దగ్గరకు నడుస్తూ వుంటాడు...అరుంధతి పిల్లల్ని దగ్గరకు తీసుకుంటూ వుండగా –

**తెర**